thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 183 | కరీంనగర్ బుధవారం, 10 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఢిల్లీ పెత్తనాన్ని ఎప్పటికీ అనుమతించం..

చెన్నై: ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమా రమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రూ.880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ.100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రంథాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారన్నారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 09: ఉపరాష్ట్రపతి ఎన్నికపై జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ సుదర్శన్ రెడ్డి గెలవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి వన్నె తెస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంకితభావం ఉందన్నారు. మంగళవారం నాడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని జాగృతి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి కవిత నివాళులర్పించారు. ఇదే సమయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి కూడా నివాళులర్పించారు కవిత. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ జాగృతి కృషి చేస్తుందన్నారు. ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు వస్తామని.. సామాజిక తెలంగాణ సాధించేవరకు జాగృతి కృషి చేస్తుందని చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు జాగృతి కృషి చేస్తుందన్నారు. తెలంగాణ సాధనలో బొంత పురుగునైనా ముద్దాడుతానన్న కేసీఆర్ స్ఫూర్తితో ముందుకు పోతామని కవిత చెప్పుకొచ్చారు. లెఫ్ట్ టు రైట్ అందర్నీ కులుపుకుని ముందుకు వెళతామన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి వచ్చుంటే సామాజిక తెలంగాణ కోసం కృషి చేసేవారని కవిత పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకుని రాజకీయంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారామె. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కీలక కామెంట్స్ చేశారు కవిత. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీటి కోసం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రూ. 1500 కోట్ల ప్రాజెక్టును రూ. 7,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సొమ్మును మెగా కృష్ణా రెడ్డికి దోచి పెడుతున్నారంటూ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కుంభకోణంలో భాగంగానే ప్రాజెక్టు అంచనాలు పెంచారని ఆరోపించారు.





## డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్.. ఇక దశ తిరిగినట్లే!

ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి.. వాటి ద్వారా ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళలకు ఒక స్థిరమైన ఆదాయ మార్గం ఏర్పడుతుంది. ఫలితంగా బస్సుల కొరత సమస్య కూడా కొంత మేరకు పరిష్కారమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం రూ.30 లక్షల ఆర్థిక సహాయం అందిస్తే.. మహిళా సంఘాలు రూ.6 లక్షలు జోడించి బస్సు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుంది. ఈ బస్సుల ద్వారా నెలకు మహిళా సంఘాలకు నికర ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విధానం ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుంది. తెలంగాణలో అమలు అవుతున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. దీంతో వీరికి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తుండగా.. వీటిలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీనివల్ల ఆర్టీసీకి అదనపు వాహనాలు అవసరం ఏర్పడింది. కొత్తగా బస్సులను కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారడంతో.. మహిళా సంఘాల అద్దె బస్సులను వినియోగించడం రెండు వర్గాలకూ లాభదాయకంగా మారుతుందని భావిస్తున్నారు.




హైదరాబాద్ : ఫార్ములా ఈ- కారు రేస్ కేసులో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫార్ములా ఈ- కారు రేస్ కేసులో మాజీమంత్రి కేటీఆర్, అరవింద్ కుమార్, ఐఏఎస్ అధికారి బీఎల్ఎన్ రెడ్డి, ఇతర అధికారులు కిషన్‌రావు, ఎఫ్ఈవోలను ప్రాసిక్యూట్ చేసేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, గవర్నర్ అనుమతి అనంతరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కూడా అనుమతి రాగానే వారిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు ఏసీబీ అధికారులు. కాగా, ఇప్పటికే కేటీఆర్‌ను నాలుగు సార్లు అరవింద్ కుమార్‌ను ఐదుసార్లు విచారించారు ఏసీబీ అధికారులు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో భారీగా అవినీతి జరిగినట్లు తేల్చారు ఏసీబీ అధికారులు. ఈ కేసులో క్విడ్‌ప్రోకో జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు ఏసీబీ అధికారులు. తొమ్మిది నెలల పాటు పకడ్బందీగా ఏసీబీ అధికారులు విచారణ జరిపారు. కేబినెట్ అనుమతి లేకుండానే ఎఫ్ఈవో కంపెనీకి నిధులు మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో 19 డిసెంబర్ 2024న ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రూ.54.88 కోట్లకుపైగా నిధులు దారి మళ్లించారని ఆరోపణలు వచ్చాయి. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో భారీగా అవినీతి జరిగినట్లు తేల్చారు ఏసీబీ అధికారులు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో క్విడ్‌ప్రోకో జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు ఏసీబీ అధికారులు.




దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నిక లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. మొత్తం 781 మంది సభ్యులకుగాను 767 మంది పార్లమెంట్ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత రాష్ట్ర సమితి, బీజేడీ, శిరోమణి అకాళీదళ్ సభ్యులు ఓటు వేయలేదు. ఉప రాష్ట్రపతి అభ్యర్థులుగా ఎన్డీయే తరపున సీపీ రాధా కృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీ చేశారు. ఉపరాష్ట్రపతి కోటా విజయానికి కావాల్సి ఓట్లు 377 కాగా.. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు, సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొత్తం ఓట్లలో 15 చెల్లనివిగా గుర్తించారు. దీంతో 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు రాజ్యసభ సెక్రటరీ ప్రకటించారు. పార్లమెంట్ నూతన భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. భారత 17వ ఉప రాష్ట్రపతిగా ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్ను స్వామి రాధాకృష్ణన్. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఆయన జన్మించారు. తమిళనాడు నుంచి ఉప రాష్ట్రపతి పీఠం అధిష్ఠించనున్న మూడో వ్యక్తిగా రాధాకృష్ణన్ గుర్తింపు పొందారు.



## ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించండి

దిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టంపై ఆర్థిక మంత్రికి నివేదిక అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్ తదితరులు సీఎం వెంట ఉన్నారు.




**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి**.. పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# బిగోస్తున్నారా!?

## పశ్చాత్తాప పడుతున్న డొనాల్డ్ ట్రంప్..

## నరేంద్ర మోదీని గొప్ప ప్రధానిగా అభివర్ణించిన ట్రంప్!



భారత్‌పై సుంకాలు విధించినందుకు డొనాల్డ్ ట్రంప్ మనోవేదనకు గురవుతున్నారు. భారత్‌తో పాటు చైనాకు అమెరికా దూరమయ్యాయని, చైనాకు దగ్గరయ్యాయని మధనపడుతున్నారు. తియాన్‌జిన్ వేదికగా జరిగిన SCO సదస్సులో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌ల ఫోటోను తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేశారు ట్రంప్. సుంకాలతో దెబ్బతీసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ దూరమయినందుకు బాధపడుతున్నారు. భారత్‌తో పాటు రష్యా తమకు దూరమైనట్టు అని భావిస్తునట్టు తెలిపారు. చైనాకు ఈ రెండు దేశాలు దగ్గరయ్యాయని అన్నారు. ఇటీవల చైనాలో జరిగిన SCO సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌ల ఫోటోను తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేశారు ట్రంప్. మూడు దేశాల మధ్య మైత్రీ చాలా కాలం కొనసాగుతుందని భావిస్తునట్టు పేర్కొన్నారు ట్రంప్. టియాన్‌జిన్ వేదికగా జరిగిన SCO సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ సుంకాలకు విరుగుడుపై లోతుగా చర్చించారు. దీనిపై స్పందించారు ట్రంప్. "భారత్, రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తుందని చాలా నిరాశ చెందాను. నేను వారికి ఆ విషయాన్ని తెలియజేశాను. మేము భారతదేశంపై చాలా పెద్ద సుంకం విధించాము. 50 శాతం సుంకం, చాలా ఎక్కువ సుంకం." అంటూ ట్రంప ప్రశ్చాత్తాపపడు తున్నారు. భారత్‌పై సుంకాలు విధించినందుకు లోలోన ఆయన బాధపడుతున్నారు. తన తీరు తోనే బద్ధశత్రువులైన భారత్, చైనాలో ఏకమైనట్టు ట్రంప్ ఆవేదన చెందుతున్నట్టు తెలుస్తోంది. భారత్, రష్యా, చైనా లాంటి శక్తివంతమైన దేశాలు ఏకం కావడం అమెరికాకు చాలా నష్టమనే భావన ఆ దేశం లోని పలువురు ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. తనపై విమర్శలు వెల్లువెత్తడంతో ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత సంబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. "నేను నరేంద్ర మోదీతో చాలా బాగా కలిసిపోతాను. ఆయన చాలా గొప్పవాడు. ఆయన రెండు నెలల క్రితం ఇక్కడి వచ్చి వెళ్లారు" అని ట్రంప్ అన్నారు. భారతదేశం మరియు అమెరికా మధ్య "చాలా ప్రత్యేకమైన సంబంధం" ను అధ్యక్షుడు పునరుద్ఘాటించారు, అప్పుడప్పుడు విభేదాలు ఉన్నప్పటికీ తాను, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "ఎల్లప్పుడూ స్నేహితులుగా" ఉంటామని స్పష్టం చేశారు. భారతదేశంతో సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అని విలేకరులు అడిగినప్పుడు, "నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. భారత ప్రధాని మోదీతో స్నేహంగా ఉంటాను. ఆయన గొప్ప ప్రధానమంత్రి. నేను ఎల్లప్పుడూ స్నేహితులుగా ఉంటాను, కానీ ఈ ప్రత్యేక సమయంలో ఆయన ఏమి చేస్తున్నారో నాకు నచ్చడం లేదు. కానీ భారతదేశం-అమెరికా మధ్య చాలా ప్రత్యేకమైన సంబంధం ఉంది. చింతించాల్సిన అవసరం లేదు. మనకు అప్పుడప్పుడు ఇలాంటి క్షణాలు ఉంటాయి." అంటూ పేర్కొన్నారు.

డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యల భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. "ఈ పోస్ట్‌పై ప్రస్తుతానికి ఎటువంటి వ్యాఖ్యలు చేయలేను" అని అన్నారు. ఇదిలావుంటే, గత నెలలో న్యూఢిల్లీపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల తర్వాత భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు సంవత్సరాలలో అత్యంత కనిష్ట స్థాయికి దిగజారాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై భారత్‌పై అమెరికా 25 శాతం బేస్ సుంకాలను, మరో 25 శాతం లెవీని విధించింది. మరోవైపు అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సీఈవోలకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. వైట్‌హౌస్‌లో మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం ఈ డిన్నర్ ఏర్పాటు చేశారు.

దీనికి టిమ్‌కుక్, సుందర్ పిచాయ్, జుకర్‌బర్గ్, సత్యనాదెళ్ల వంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో పెట్టుబడుల గురించి ట్రంప్ వారిని సూటిగా ప్రశ్నించారు. ఇన్నాళ్లూ మీరు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టింది చాలు. ఇక స్వదేశానికి తిరిగిరండి..ఎంత పెట్టుబడి పెడతారు? అంటూ యాపిల్ సీఈవో టిమ్ కుక్‌ను ట్రంప్ అడిగారు.



# గ్రూప్-I జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు

హైదరాబాద్: గ్రూప్-1 మూల్యాంకనం, ర్యాంకింగ్ లిస్ట్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. సంజయ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పునఃమూల్యాంకనం జరపాలని టీజీపీఎస్సీని ఆదేశించింది.

ఈ ప్రక్రియను 8 నెలల్లోపు పూర్తిచేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలా చేయని పక్షంలో మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపికైన అభ్యర్థులు మరికొందరు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జులై 7న న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు వాదనలు విన్నారు. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించారు.



# మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నియమితులయ్యారు. నంబాల కేశవరావు మరణంతో కేంద్ర కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది. ఆయన స్థానంలో తిరుపతిని నియమించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తిరుపతి.. మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1983లో పార్టీలో చేరారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కార్యదర్శి వరకు ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా, మిలీషియా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తిప్పిరి తిరుపతిపై రూ.కోటి నజరానా ఉంది. 2010లో జరిగిన దంతెవాడ సెంట్రల్ రిజర్వ్ జవాన్లపై దాడి ఘటనకు ఆయన ప్రాతినిధ్యం వహించారు.



# ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా.. హామీలను నెరవేరుస్తున్నాం: పొంగులేటి

కూసుమంచి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ. 8.19 లక్షల కోట్లు అప్పు చేసిందని, పేదవారికి కష్టం కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రాబోయే మూడేళ్లలో అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటించారు. కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో రూ. 20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు.

నర్సింహులగూడెం గ్రామంలో కిష్టాపురం నుంచి నర్సింహులగూడెం వరకు రూ. 1.33 కోట్లతో చేపట్టనున్న పీఆర్ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

# ఖైదీల్లో జైలు సిబ్బంది మార్పు తీసుకురావాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్: 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌కు తెలంగాణ జైళ్ల శాఖ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."10 ఏళ్ల తర్వాత మళ్లీ తెలంగాణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మీట్ ఓ పోటీ కాదు. క్రమశిక్షణ, విధి నిర్వహణలో అంకితభావం పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన మంచి కార్యక్రమం. జైలు సిబ్బంది తమ ప్రతిభను గుర్తుంచుకోవాలి. భద్రతా విధులు నిర్వహిస్తూ ఖైదీలలో మార్పు తీసుకురావాలి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్నాలజీ, వృత్తి శిక్షణ, సంక్షేమ కార్యక్రమాల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయి. మనిషి జీవితంలో అసలైన లక్ష్యం మనసును అభివృద్ధి చేసుకోవడం. సాంస్కృతిక కార్యక్రమాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచి ప్రవర్తనతో ఉన్న 231 మంది ఖైదీలు విడుదలయ్యారు. వారు కొత్త జీవితం సాగించేందుకు అవకాశం కల్పించారు. కొందరికి పెట్రోల్ బంకుల్లో ఉద్యోగాలు వచ్చాయి. మహిళలకు కుట్టు మెషిన్లు ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ ఒక గతంతోపాటు భవిష్యత్తు ఉంటుంది. సంగారెడ్డి, నిజామాబాద్ సెంట్రల్ జైళ్లలో కొత్త సిబ్బంది వచ్చారు. సిద్దిపేట జిల్లా జైలును ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ప్రిజన్ డ్యూటీ మీట్



అందరికీ మంచి అనుభూతి కలిగించడంతోపాటు జైలు సంస్కరణలు చేపట్టడానికి శిక్షణలా ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తున్నా" అని గవర్నర్ వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో దేశంలోని 21 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1200 మందికి పైగా జైళ్ల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# నిరసనల వేళ దుబాయ్‌కి నేపాల్ ప్రధాని..?

## నేపాల్‌లో రాజకీయ సంక్షోభం? దుబాయ్‌కి ప్రధాని కేపీ ఓలీ..!

సోషల్ మీడియాపై నిషేధం ఎత్తివేసినప్పటికీ.. నేపాల్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో పలువురు మంత్రులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. ఈక్రమంలో ప్రధాని కేపీ శర్మ ఓలీ దేశాన్ని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆయన దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మంగళవారం కూడా యువత పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. మాజీ ఉప ప్రధానమంత్రి రఘువీర్ మహాసేత్ నివాసంపై నిరసనకారులు రాళ్లు రువ్వుతున్నారు. నిన్న రాజీనామా చేసిన హోం మంత్రి రమేశ్ లేఖక్ నివాసానికి నిప్పంటించారు. నేపాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవుబా నివాసాన్ని చుట్టుముట్టారు. ఆయనకు సంబంధించిన ఆస్తులకు నిప్పు పెట్టారు. ఈ నిరసనల నేపథ్యంలో కాఠ్‌మాండూతో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. నిరసనకారులను తరిమికొట్టేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో నిరసనకారుల్లో ఒకరు మాట్లాడుతూ.. నిన్నటి ఆందోళనల్లో మరణించిన యువత కుటుంబాలకు న్యాయం జరగాలన్నారు. అందుకుగాను కేపీ ఓలీ ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు.

**పీఎం, అధ్యక్ష నివాసాలకు నిప్పు...** మరోవైపు, ఈ ఆందోళనలు మరింత హింసాత్మకంగా మారుతున్నాయి. ప్రధాని ఓలీ, అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ప్రైవేటు నివాసాలకు నిరసనకారులు పెద్ద ఎత్తున చేరుకుని వాటికి నిప్పు పెట్టారు. భక్తపుర్ బాల్కోట్‌లోని ప్రధాని ఓలీ అధికారిక నివాసాన్నీ ఆందోళనకారులు ముట్టడించేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిపిన కాల్పుల్లో పలువురు గాయపడ్డారు. పలువురు మంత్రుల నివాసాలకూ నిరసనకారులు నిప్పుపెట్టారు.

**వరుస రాజీనామాలు..** ఈ ఆందోళనల నేపథ్యంలో దేశ మంత్రులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. నిరసనలకు నైతిక బాధ్యత వహిస్తూ నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ సోమవారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి రామ్‌నాథ్ అధికారి, నీటి సరఫరా శాఖ మంత్రి ప్రదీప్ యాదవ్ కూడా రాజీనామా ప్రకటించారు. పలువురు ఎంపీలు కూడా రాజీనామాలు సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. ఈక్రమంలో ఓలీ దుబాయ్‌కు వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. హిమాలయ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూడా ఆయన ప్రయాణం కోసం సిద్ధం చేసినట్లు సమాచారం. వైద్య చికిత్స కోసం ఆయన దుబాయ్ వెళ్తున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఉప ప్రధానికి తాత్కాలిక బాధ్యతలు కూడా అప్పగించారట. మరోవైపు.. దేశంలో ఉద్రిక్తతలు తీవ్రతరమైన నేపథ్యంలో అఖిలపక్ష సమావేశానికి ఓలీ పిలుపునిచ్చారు. ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఈ సమావేశం జరగనున్నట్లు తెలిపారు.



# బస్సులో ఫోన్ కొట్టేసి రూ.6 లక్షలు స్వాహా

సికింద్రాబాద్: దొంగిలించిన సెల్ ఫోన్ నుంచి రెండు బ్యాంకు ఖాతాల ద్వారా ఓ దుండగుడు రూ. 6 లక్షలు అపహరించిన ఘటన సికింద్రాబాద్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ప్రసాద్‌రావు బోయిన్‌పల్లిలో నాందేడ్‌కు చెందిన బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆయన ఫోన్‌ను దొంగిలించాడు. దీంతో ప్రసాద్‌రావు బోధన్‌లో కొత్త ఫోన్ కొనుగోలు చేసి తన పాత నంబర్‌పై సిమ్ తీసుకున్నారు. దాన్ని ఫోన్‌లో వేయగానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కట్ అయినట్టు వెనువెంటనే సందేశాలు వచ్చాయి. దీంతో బాధితుడు బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ. 6 లక్షలకు పైగా విత్ డ్రా అయినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తాం: కవిత

హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళు లర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. "ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన



అవసరం ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ఆ పదవికి వన్నె తెస్తారు' అని కవిత అన్నారు.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట




హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. నల్గొండలో వేర్వేరు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన మూడు కేసులను కొట్టివేసింది హైకోర్టు. గతేడాది జరిగిన పదోతరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీక్‌పై కేటీఆర్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుల మేరకు మూడు పోలీస్ స్టేషన్‌లలో కేటీఆర్‌పై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేటీఆర్ తమ పేర్లను ఎలా చెబుతారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై కేసులను నమోదు చేశారు పోలీసులు. ఈ నేపథ్యంలో ఈ కేసులను కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు కేటీఆర్. అయితే, కేటీఆర్‌పై దాఖలైన మూడు పిటిషన్లపై విచారణ చేపట్టారు జస్టిస్ కె.లక్ష్మణ్. రాజకీయ కక్షల కారణంగా కేసు నమోదు చేశారని కేటీఆర్ తరపు న్యాయవాది రమణరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా, ఈ పిటిషన్లపై హై కోర్టులో ఇరువైపులా వాదనలు ముగిశాయి. వాదనల అనంతరం కేటీఆర్‌పై నమోదైన కేసులను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది తెలంగాణ హైకోర్టు.




# గ్రూప్ 1 పరీక్ష ఫలితాల రద్దు.. హరీష్ రావు ఘాటు రియాక్షన్..

హైదరాబాద్, సెప్టెంబర్ 9: గ్రూప్ 1 పరీక్ష రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని.. కోర్టు తీర్పుపై సీఎం చెప్పే సమాధానం ఏంటని హరీష్ రావు ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించిన హరీష్ రావు.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'గ్రూప్ 1 పరీక్ష మూల్యాంకనంలో అవకతవకలు.. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, పరీక్ష ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో నేడు హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు. లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి.. ఈ కోర్టు తీర్పుకు మీరు చెప్పే సమాధానం ఏమిటి? హడావుడిగా పరీక్షలు నిర్వహించి, అవకతవకలకు పాల్పడ్డ నీ నిర్లక్ష్యానికి విద్యార్థులు, నిరుద్యోగులు బలవుతున్నారు. గప్పాలు కొట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరీక్షలు ఎలా నిర్వహించాలి అనే సోయి కూడా లేదు. పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం అంటే విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొట్టి చిల్లర రాజకీయాలు చేయడం కాదు రేవంత్ రెడ్డి. ఇప్పటికైనా కండ్లు తెరువు. నీ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరికి సిగ్గుతో తలదించుకో. తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పు.' అంటూ ఘాటైన వ్యాఖ్యలతో హరీష్ రావు పోస్ట్ చేశారు. ఇదిలాఉంటే.. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం నాడు సంచలన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్ 1 మెయిన్స్ మెరిట్ లిస్ట్‌ను ర్దదు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలిచ్చింది. అంతేకాదు.. మెయిన్స్ పేపర్స్‌ని తిరిగి మూల్యాంకనం చేయాలని.. ఆ తరువాతే తిరిగి మెయిన్స్ ఫలితాలను విడుదల చేయాలని స్పష్టం చేసింది. రీవాల్యుయేషన్‌కు 8 నెలల సమయం ఇచ్చిన హైకోర్టు ధర్మాసనం.. ఒకవేళ మూల్యాంకనం సాధ్యం అవకపోతే మళ్లీ మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది.

# మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి



మావోయిస్ట్ ఉద్యమం భారత దేశంలో 1967 నక్సల్బరీ ఉద్యమం నుంచి ప్రారంభమై, వివిధ దశల్లో పునరావృతమై 2004లో సిపిఐ (మావోయిస్ట్)గా పునర్ వ్యవస్థీకరించ బడింది. దాదాపు అరవై ఏళ్ల చరిత్రలో నాయకత్వం మార్పులు చాలా తక్కువ. మొదట చారుమజుందర్ సిద్ధాంత ఆధారిత నక్సల్బరీ తిరుగుబాటు తర్వాత పలు ప్రాంతీయ దళాలు ఏర్పడ్డాయి. 1980లలో పీపుల్స్ వార్ గ్రూప్ (%ౡాఔ+%) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలను ఆధారంగా చేసుకొని బలపడింది. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ (%వీజజ%) విలీనం చెంది సిపిఐ (మావోయిస్ట్)గా అవతరించింది. ఆ విలీనానికి ముందు నుంచి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ప్రధాన కార్యదర్శిగా కొనసాగి 2018 వరకు సుమారు పదమూడు సంవత్సరాలు పార్టీని నడిపించాడు. ఆయన తప్పుకున్న తరువాత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రధాన కార్యదర్శిగా నియమితుడై దాదాపు ఆరు సంవత్సరాలు ఆ స్థానంలో ఉన్నాడు. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2010లో మావోయిస్ట్ ప్రభావిత జిల్లాలు 223 ఉండగా, 2024 నాటికి 45 జిల్లాలకు తగ్గాయి. ఒకప్పుడు దాదాపు 90 జిల్లాల్లో తీవ్ర ప్రభావం కలిగిన ఈ ఉద్యమం ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార?ండ్‌లోని కొన్ని అరణ్యప్రాంతాల్లో మాత్రమే నిలిచి ఉంది. భద్రతా బలగాల నిరంతర ఆపరేషన్లలో 2010%-%2020 మధ్యకాలంలో దాదాపు 2000 మంది మావోయిస్ట్ లు హతమయ్యారు. 2014-2024 మధ్య పదేళ్లలో 10,000 మందికి పైగా లొంగిపోయారు. ఈ సంఖ్యలు ఉద్యమ బలహీనతను ప్రతిబింబిస్తున్నాయి. అటువంటి సమయంలో 2025 మే నెలలో ఎన్కౌంటర్ లో బసవరాజు మృతి చెందడం ఉద్యమానికి ఊహించని శూన్యతను తెచ్చింది. బసవరాజు మరణానంతరం మూడు నెలలపాటు కేంద్ర కమిటీ అత్యవసరంగా సమావేశమై కొత్త నాయకత్వాన్ని నిర్ణయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో ప్రధానంగా ఇద్దరు నాయకుల పేర్లు చర్చకు వచ్చాయని చర్చ. ఒకరు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీ, మరొకరు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను. తిప్పిరి తిరుపతి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందినవాడు. మాదిగ దళిత వర్గానికి చెందిన ఈ నాయకుడు 1980లలోనే పీడబ్ల్యుజీ కార్యకలాపాలలో చేరి తరువాతి మూడు దశాబ్దాలుగా అరణ్య ప్రాంతాల్లో మావోయిస్ట్ దళాలను నడిపాడు. ఆయన ప్రధానంగా సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధిపతిగా పనిచేస్తూ, దళాల నియంత్రణలో కీలక స్థానాన్ని సంపాదించాడు. ప్రస్తుతం ఆయన వయసు అరవై సంవత్సరాలు దాటింది. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు అరణ్య ప్రాంతాల్లో ఆయన నేరుగా నడిపిన దాడులు దశాబ్దాలుగా భద్రతా బలగాలకు ముప్పుగా నిలిచాయి. వేణుగోపాలరావు మరోవైపు సిద్ధాంత విభాగానికి అధిపతి. ఆయన అన్న కిషన్జీ ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో అత్యంత ప్రభావవంతమైన మావోయిస్ట్ నాయకుడిగా 2011లో ఎన్‌కౌంటర్లో మరణించాడు. పెద్దపల్లి జిల్లా, బ్రాహ్మణ వర్గానికి చెందిన వేణుగోపాలరావు ప్రస్తుతం 69 ఏళ్ల వయసులో ఉన్నాడు. సిద్ధాంతపరమైన దృఢత ఉన్నప్పటికీ, సైనిక అనుభవం తక్కువగా ఉండటం, వయసు ఎక్కువ కావడం ఆయనకు ప్రతికూలమైనట్లు చర్చ. ఈ రెండు పేర్ల మధ్య చివరకు తిప్పిరి తిరుపతిని సెప్టెంబర్ 2025లో కేంద్ర ప్రధాన కార్యదర్శిగా నియమించగా, అధికారికంగా వెంటనే ప్రకటించ లేదు. అంటే అధికారికంగా ఎన్నిక ప్రక్రియ కాదు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర కమిటీ తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయం. ఈ నియామకానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి ఆయనకు ఉన్న సైనిక ఆధిపత్యం, రెండవది ఆయన దళిత వర్గానికి చెందిన వాడని పార్టీ ప్రదర్శించుకోవడం. మావోయిస్ట్ ఉద్యమంలో ఇప్పటివరకు ఉన్న బ్రాహ్మణ, మధ్యతరగతి ఆధిపత్యానికి బదులుగా దళిత నాయకత్వాన్ని ముందుకు తెచ్చి సామాజిక సమీకరణాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశం ఇక్కడ ప్రతిఫలించింది. అయితే ఈ నియామకం ఉద్యమ భవిష్యత్తుకు ఎంతవరకు బలాన్నిస్తుందన్నది ప్రశ్నార్థకమే. ఎందుకంటే 2006లో మావోయిస్ట్ హింసాత్మక సంఘటనలు 1591గా నమోదవ్వగా, 2023 నాటికి అవి 500లోపే మిగిలాయి. 2010లో మావోయిస్ట్ దాడుల్లో 1005 మంది మరణించగా, 2023లో అది 200లోపే పరిమితమైంది. ఈ గణాంకాలు ఉద్యమ శక్తి తగ్గుముఖం పట్టిందనడానికి సాక్ష్యం. ఈ నేపథ్యంలో తిప్పిరి తిరుపతి బాధ్యతలు చేపట్టడం ఒక వైపు ఉద్యమాన్ని నిలబెట్టే ప్రయత్నం, మరోవైపు భద్రతా బలగాల కఠిన చర్యలకు ఎదురొడ్డి నిలబడే సవాలు. ఆయనకు ఉన్న అనుభవం, సామాజిక వర్గ నేపథ్యం ఒక ఆశ కిరణం చూపవచ్చేమో కానీ వాస్తవ గణాంకాలు మాత్రం మావోయిస్ట్ ఉద్యమం దిగజారిపోతున్నదని తెలుపుతున్నాయి. అయినప్పటికీ ఈ నియామకం ఉద్యమ చరిత్రలో కొత్త అధ్యాయం. ఒకవైపు సామాజిక ప్రతినిధ్యాన్ని బలపరచడం, మరోవైపు సంక్షోభ సమయంలో సైనిక వ్యూహ రచనకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మావోయిస్ట్ వ్యూహంలో ప్రతిఫలిస్తోంది. ఇలా చూస్తే తిప్పిరి తిరుపతి కేంద్ర ప్రధాన కార్యదర్శిగా అవతరించడం ఒక పరిణామం మాత్రమే కాదు, ఉద్యమ దిశను నిర్దేశించే కీలక మలుపు. తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచి పెడతామన్న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పదే పదే స్పష్టం చేస్తున్న, ప్రకటనను క్రమంగా సాకారం చేస్తున్న క్రమంలో... భవిష్యత్తులో తిప్పిరి తిరుపతి నాయకత్వం మావోయిస్ట్ కదలికను స్థిరంగా కొనసాగిస్తుందా లేదా క్షీణింప చేస్తుందా అన్నది భారతీయ తీవ్రవాద చరిత్రలో కీలకమైన ప్రశ్నగా నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# మానవత్వాన్ని మర్చిపోయిన జైళ్లు.. అమెరికా నిర్బంధ కేంద్రాలు




అమెరికాలో అక్రమ వలసదారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వలస చట్టాలను ఉల్లంఘించిన వారికి తాత్కాలిక నిర్బంధం కల్పించే కేంద్రాలు ఇప్పుడు నిజంగా "నిత్య నరకం"గా మారిపోయాయి. మియామీలోని క్రోమ్ నిర్బంధ కేంద్రం నుంచి బయటకు వచ్చిన వీడియో ఈ కేంద్రాల అసలు రూపాన్ని ప్రపంచానికి చూపించింది.

**కిక్కిరిసిన గదులు.. మానవ హక్కుల ఉల్లంఘన..** ఈ కేంద్రాల్లో ఇరుకైన గదుల్లో వందలాది మంది ఒకే ప్రదేశంలో కిక్కిరిసి పడుకోవాల్సి వస్తోంది. నేలమీద కార్డుబోర్డు పెట్టుకొని పరుపుల్లా ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి. ట్యూబ్ లైట్ల కాంతి కళ్లపై పడకుండా మాస్కులు వేసుకోవడం తప్ప వేరే మార్గం లేదు. ఒకరి కాళ్లు మరొకరి ముఖానికి తగలడం, శ్వాస తీసుకోవడమే కష్టంగా మారుతోంది.

**ఆహారం, నీరు, సదుపాయాల కొరత...** ఐసీఈ (ఇమిగ్రేషన్ మరియు కస్టమ్స్ ఎన్ ఫోర్స్ మెంట్ ) నియమాల ప్రకారం వలసదారులను 12 గంటలకు మించి ఉంచరాదు. కానీ వాస్తవానికి 3-4 రోజుల వరకు నిర్బంధిస్తున్నారు. ఈ కాలంలో సరైన ఆహారం, నీరు అందడం లేదు. దిండ్లు, దుప్పట్లు ఇవ్వడం లేదు. ఏసీలు పనిచేయక గదులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇటీవలే 3 రోజులకు పైగా నిర్బంధంలో ఉన్న ఒక వ్యక్తి మరణించడం పరిస్థితుల తీవ్రతను చాటిచెప్పింది.

**ట్రంప్ పాలనలో నిర్బంధాల విస్తరణ....** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక వలసదారులపై నిర్బంధం మరింత కఠినమైంది. నిర్బంధ కేంద్రాల్లో 81 శాతం సీట్లు నిండిపోయాయి. గతంలో పది మందికి మించి లేని కేంద్రాల్లో ఇప్పుడు వందల మంది ఉంటున్నారు. మయామీ క్రోమ్ కేంద్రంలో ప్రస్తుతం 600 మందికి పైగా నిర్బంధంలో ఉన్నారు. తాజాగా ట్రంప్ ఆమోదించిన ఫైలుతో అదనంగా 80,000 బెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**మానవత్వం ఎక్కడ?...** ఐసీఈ కేంద్రాలపై వచ్చిన అంతర్గత ఆడిట్లలోనూ అనేక లోపాలు బయటపడ్డాయి. వలసదారుల పట్ల కనీస మానవతా దృక్పథం లేకుండా ప్రవర్తించడం అంతర్జాతీయంగా విమర్శలకు గురవుతోంది. మానవ హక్కుల సంఘాలు ఈ కేంద్రాలను "మానవత్వాన్ని మర్చిపోయిన జైలు ్ల"గా అభివర్ణిస్తున్నాయి. అమెరికా కలల కోసం వచ్చిన వలసదారులు చివరకు నిర్బంధ కేంద్రాల "నరకం"లో ఇరుక్కుపోతుండటం అమెరికా ప్రజాస్వామ్యంపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# బీహార్ పోరు...హెలికాప్టర్లు మూడింతలు ఎగురుతాయట!

బీహార్ ఎన్నికలు దగ్గరలోకి వచ్చేశాయి. అక్టోబర్ చివరిలో కానీ నవంబర్ మొదటి వారంలో కానీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అంటున్నారు. గట్టిగా చూస్తే రెండు నెలల సమయం కూడా లేదు. ఇదిలా ఉంటే బీహార్ లో ఎన్నికల వేడి రాజుకుంది. ఈ మధ్యనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర పేరుతో ఏకంగా పదిహేను రోజుల పాటు బీహార్ లోని కీలక ప్రాంతాలను చుట్టేసి వచ్చారు. ఈ విధంగా ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. మరో వైపు చూస్తే ఈ మధ్యనే అనేక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ నుంచి ప్రారంభించారు. బీహార్ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం డబుల్ ఇంజన్ సర్కార్ వల్లనే సాధ్యపడుతుంది అని మోడీ చెప్పారు.

**భారీ ఎత్తున ప్రచారం :** ఈసారి చూస్తే కనుక అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కార్ కి విపక్షంలో ఉన్న మహా ఘట్ బంధన్ కి మధ్య భీకర మైన పోరు సాగనుంది. ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రావాలని ఆర్జేడీ కాంగ్రెస్ కమ్యూనిస్టులతో ఉన్న మహా ఘట్ బంధం చూస్తూంటే




తమ అధికారాన్ని మరో అయిదేళ్ళ పాటు నిలబెట్టుకోవాలని ఎన్డీయే చూస్తోంది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కి ప్రధాని నరేంద్ర మోడీ తోడుగా ఉంటూ ఈసారి ఎన్నికల ప్రచారాని పరుగులు పెట్టిస్తారు అని బీజేపీ నేతలు చెబుతున్నారు. మాకు జనం తోనే నేరుగా అనుసంధానం ఉంది అయినా ధీటైన ప్రచారం చేస్తామని ఆర్జేడీ నేతలు చెబుతున్నారు.

**రోజుకు ఇరవై హెలికాప్టర్లు !...** ఇదిలా ఉంటే ఈసారి బీహార్ ఎన్నికల ప్రచారం కొంత పుంతలు తొక్కనుంది అని అంటున్నారు. రాజకీయ పార్టీలు అన్నీ కూడా ముందుగానే హెలి కాప్టర్లను బుక్ చేసుకోవడం బట్టి చూస్తూటే ప్రచారం అంతా గగన తలం నుంచే అని అంటున్నారు. 2020 ఎన్నికల్లో ఇంతటి హంగామా లేదని అంటున్నారు. పైగా అపుడు కరోనా ఉంది. దాంతో ఒక పద్ధతిలో మితంగానే ప్రచారం చేశారు. అప్పట్లో అయిదారు హెలికాప్టర్లు మొత్తం రాజకీయ పక్షాల నుంచి ఎగిరాయి. ఈసారి ఆ సంఖ్య మూడింతలు కాబోతోంది అని అంటున్నారు. ఒక్క ఎన్డీఏ నే దాదాపుగా పన్నెండు నుంచి పద్నాలుగు దాకా హెలి కాప్టర్లను వాడబోతోంది అని అంటున్నారు. ఇక విపక్ష మహా ఘట్ బంధన్ అయితే ఆరేడు హెలికాప్టర్లను వాడుతుందిట. అందులో కాంగ్రెస్ రెండు నుంచి మూడు అయితే మిగిలినవి ఆర్జేడీ వినియోగిస్తుంది అని అంటున్నారు.


**ఎక్కువ కవర్ చేయాలనే :** బీహార్ లో ప్రతీ ప్రాంతాన్ని కవర్ చేయాలని అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయించుకున్నాయి. రోజుకు కనీసం అయ్యిదారు సభలలో ప్రధాన నాయకులు పాల్గొనాలని కూడా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నారు. దాంతో ఈసారి బీహార్ అంతా ప్రచారంతో హెూరెత్తిపోనుంది. ఇక నాయకులను సాధ్యమైనంత వేగంగా జనంలోకి తీసుకుని వెళ్ళడానికి హెలికాప్టర్లు బాగా ఉపయోగపడతాయని అంటున్నారు. అయితే వీటి వ్యయమే ప్రతీ రోజూ కనీసంగా పదిహేను లక్షల దాకా ఒక్కో పార్టీకి ఉండొచ్చు అని అంటున్నారు. ఈ లెకక్న పదిహేను రోజుల ప్రచారానికి కోట్లు హెలికాప్టర్ల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది అని అంటున్నారు. అత్యంత ఖరీదైన ఎన్నికగా ఈసారి బీహార్ నిలిచే అవకాశం ఉంది అని అంటున్నారు.

# యూపీఐ లావాదేవీలపై మనీ గేమింగ్ ల ఎఫెక్ట్ పడిందే?

కేంద్ర ప్రభుత్వం రియల్ మనీ గేమింగ్ యాప్‌లపై తీసుకున్న నిర్ణయం ఆర్థిక లావాదేవీలపై.. ముఖ్యంగా యూపీఐ ట్రాన్సాక్షన్లపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇది కేవలం ఆర్థిక కోణంలోనే కాకుండా.. సామాజిక కోణంలో కూడా ఒక ముఖ్యమైన అంశాన్ని వెలుగులోకి తెచ్చింది.

**యూపీఐ లావాదేవీల తగ్గుదల...** ఆగస్టు 2025లో యూపీఐ లావాదేవీల మొత్తం విలువ రూ. 2,500 కోట్లు తగ్గింది. ఈ తగ్గుదలకు ప్రధాన కారణం గేమింగ్ యాప్‌లపై నిషేధమేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. యూపీఐ లావాదేవీల్లో దాదాపు 25% గేమింగ్ సంబంధితవే అని వెల్లడవడం ఆందోళన కలిగించే విషయం. ఇది ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ఎంత పెద్ద మొత్తంలో ఆర్థిక కార్యకలాపాలను నడిపిస్తున్నాయో స్పష్టంగా తెలియజేస్తుంది.

**యూపీఐ వాడకం...** భారతదేశంలో యూపీఐ డిజిటల్ చెల్లింపుల కోసం అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి. గేమింగ్ యాప్‌లకు డబ్బు బదిలీ చేయడానికి ఇది ప్రధాన మార్గంగా ఉపయోగపడింది. నిషేధం తర్వాత, ఈ రకమైన చెల్లింపులు గణనీయంగా తగ్గాయి.




**ప్రభావం - విశ్లేషణ...** ఈ నిషేధం వలన ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ తాత్కాలికంగా దెబ్బతిన్నప్పటికీ, ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక రకంగా మంచిది కావచ్చు. గేమింగ్ ద్వారా డబ్బు కోల్పోయే ప్రమాదాన్ని ఇది తగ్గిస్తుంది. ఈ గణాంకాలు యువతలో పెరుగుతున్న గేమింగ్ వ్యసనాన్ని బహిర్గతం చేశాయి. చాలామంది యువత వినోదం కోసం కాకుండా డబ్బు సంపాదించడానికి ఈ గేమ్స్‌పై ఆధారపడుతున్నారని ఇది సూచిస్తోంది. ఈ నిషేధం వలన యువత ఈ వ్యసనం నుంచి బయటపడే అవకాశం ఉంది. మనీ గేమింగ్ యాప్‌లపై నిషేధం అనేది కేవలం ఆర్థిక లావాదేవీల తగ్గుదల మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తును ప్రభావితం చేసే ఒక సామాజిక సమస్యకు పరిష్కార మార్గం చూపింది. ఈ నిర్ణయం వలన దీర్ఘకాలంలో యువత గేమింగ్ వ్యసనం నుంచి బయటపడి, మరింత ఉత్పాదక కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు. అయితే, ఈ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చూడాలి. ఈ చర్య వలన యూపీఐ లావాదేవీలలో తగ్గుదల తాత్కాలికంగా ఉన్నా, ఇది ఒక మంచి పరిణామమని చెప్పవచ్చు.

# "చిత్ర రేఖలలో చిరకాల ప్రతిధ్వని"

## చందమామ వెలుగుల్లో బొమ్మల బ్రహ్మ వడ్డాది పాపయ్య - డ్డాది పాపయ్య: కుంచెలో విరిసిన తెలుగుదనం - సెప్టెంబరు 10...వడ్డాది పాపయ్య జయంతి





వడ్డాది పాపయ్య (సెప్టెంబరు 10, 1921 - డిసెంబర్ 30, 1992) తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఒక అపూర్వ చిత్ర కారుడు. "వ.పా." అనే పొడి అక్షరాల సంతకం చూసిన వెంటనే ఆ బొమ్మ ఎవరిదో చెప్పకుండానే అర్థమయ్యేది. తెలుగు పత్రికలు, పుస్తకాలు, బాలల కథలు, పురాణ చిత్రాలు, పల్లె దృశ్యాలు ఆయన కుంచె తాకిడితో జీవం పోసు కున్నాయి. కేవలం ఒక చిత్రకారుడిగా కాకుండా రచయితగా, దృశ్య కవిగా, సృజనాత్మక తపస్విగా ఆయన నిలిచారు. శ్రీకాకుళం పట్టణంలో రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన పాపయ్య తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడం వలన చిన్ననాటి నుంచే రంగుల లోకంలో మునిగి పోయాడు. ఐదేళ్ల వయసులోనే హనుమంతుని చిత్రాన్ని గీసి తన ప్రతిభను చాటుకున్నాడు. రాజా రవివర్మ, దామెర్ల రామారావు వంటి దిగ్గజాల ప్రభావం ఆయనపై బలంగా పడింది. కానీ ఆయన వారిని అనుకరించకుండా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపు దిద్దుకున్నారు. బొమ్మలపై మక్కువ వయసు పెరిగేకొద్దీ సాధనగా మారి, సాధన తపస్సుగా పరిణమించి, ఆ తపస్సే ఆయన చిత్ర జీవితమైంది. ఆయన శైలిలో సంప్రదాయం, ఆధునికత, జానపదం, పల్లెపాటల సౌందర్యం అంతర్లీనంగా కలిసి పోయేవి. మహిళా రూప చిత్రణలో ఆయనకున్న ప్రతిభ అసామాన్యం. స్త్రీ రూపం ఆయన చిత్రాల్లో దివ్యమైన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది. "వడ్డాది బ్యూటీ" అన్న పదం తెలుగు పాఠక లోకంలో ఒక ప్రత్యేక ముద్ర వేసింది. ఆయన గీసిన సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులు లాంటి దైవ రూపాలు పుస్తకాల్లో చూడగానే ఆ పాత్రలపై మరింత భక్తి, మమకారం కలుగుతాయి. అదే విధంగా ఆయన సృష్టించిన పల్లె ఆడపిల్లల రూపాలు, మత్స్యగంధి, ఊర్మిళ నిద్ర వంటి చిత్రాలు పల్లెటూరి అందాలను సజీవం చేస్తాయి. వడ్డాది పాపయ్య చిత్రాలు తెలుగు పత్రికా ప్రపంచంలో ఒక విప్లవం. "చందమామ" పత్రికలో మూడు దశాబ్దాలకు పైగా ఆయన చిత్రాలు వెలువడ్డాయి. కథ చదివే ముందే పాఠకుని మనసును గెలుచు కునేది ఆయన వేసిన బొమ్మే. "భారతి", "చంద్రిక", "ఆంధ్రపత్రిక", "ఆంధ్రజ్యోతి", "స్వాతి", "అభిసారిక", "యువ" వంటి పత్రికల్లో ఆయన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణ. ఆయన చిత్రాలు కోసం పత్రికలు అమ్ముడయ్యేవి అనడం అతిశయోక్తి కాదు. గుడిపాటి వెంకట చలం, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యద్దనపూడి సులోచనా రాణి నవలలకు ఆయన వేసిన కవర్ ఆర్ట్ ఆ పుస్తకాల ప్రాచుర్యాన్ని రెట్టింపు చేసింది. ఒక చిన్న చిత్రం కూడా సాహిత్యానికి ఎంత జీవం పోసుకోగలదో ఆయన చూపించారు. ఆయన చిత్రాల్లో రంగుల వినియోగం అపూర్వం. నీలి రంగుపై ఆయనకున్న మక్కువ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తైల వర్ణాల కంటే నీటి రంగుల్లోనే తాను కోరుకున్న సున్నితత్వం సాధ్యమవుతుందని భావించేవారు. నలుపు-తెలుపు చిత్రాల్లోనూ ఆయన ప్రతిభ తక్కువేమీ కాదు. వెలుగు-నీడల సమన్వయం ఆయన చిత్రాలకు అద్భుతమైన ఆహ్లాదాన్ని, కవితాత్మకతను తెచ్చింది. జీవంతో కూడిన రేఖలు, మృదువైన స్పర్శ, అలంకరణలోని నైపుణ్యం ఆయన చిత్రాలకు ప్రత్యేకతను ఇచ్చాయి. చిత్రకళ మాత్రమే కాకుండా రచనలోనూ ఆయన ప్రతిభను ప్రదర్శించారు. "చందమామ"లో కొడవటిగంటి కుటుంబరావు మొదలు పెట్టిన "దేవీ భాగవతం" కథలను పూర్తి చేయడంతో పాటు "విష్ణుకథ" అనే పౌరాణిక సీరియల్‌ను రచించారు. చిన్నపిల్లల ఊహా ప్రపంచాన్ని విస్తరించేలా ఆయన చిత్రాలు, రచనలు ఒకేసారి ఆకర్షించేవి. పంచతంత్రం కథల్లోని జంతు పాత్రలకు ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ పాఠకుల మదిలో నిలిచిపోయాయి. పాపయ్య నిరాడంబర జీవనశైలిని అవలంబించారు. ఇంటర్వ్యూలు, ప్రదర్శనలు, వ్యక్తిగత ప్రాచుర్యం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. కళను గౌరవించాలి, కళాకారుని కాదు అని ఆయన నమ్మకం. ప్రయోగాత్మకంగా జేగురు మట్టి, సున్నం, బొగ్గు వంటి సామాన్య పదార్థాలతో కూడా అద్భుతమైన చిత్రాలు సృష్టించారు. తన జీవితాన్ని కళకే అంకితం చేసి, వేలాది చిత్రాలను సృష్టించి, తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయారు. 1992 డిసెంబర్ 30న ఆయన మరణం సంభవించినా ఆయన కుంచె సృష్టించిన రూపాలు, ఆయన వేసిన పుస్తక కవర్‌లు, ఆయన అలంకరించిన పత్రికా పుటలు నేటికీ జీవంగా ఉంటూ తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళకు కేవలం ఒక పేరు కాదు, ఒక యుగం. ఆయన కుంచెలో సౌందర్యం విరిసింది, ఆయన బొమ్మల్లో తెలుగుదనం మిగిలింది, ఆయన కృషిలో ఒక సంస్కృతికి చిరస్మృతి సొంతమైంది. తెలుగు చిత్రకళకు వడ్డాది పాపయ్య ఒక దీపస్తంభం. ఆయన కళలో శిల్ప సౌందర్యం, సాహిత్యానికి జీవం, పాఠకుల హృదయాల్లో అజరామరమైన స్థానం ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చురకలు

## సంపాదకీయం

### అమెరికాకు ప్రపంచ ఉసురు తగిలిందా?

### దారుణ స్థితిలో ఉందా?

అగ్రరాజ్యమన్న అహంకారం తలనిండా పట్టించుకున్న అమెరికాకు.. ట్రంప్ లాంటి ఒంటెద్దుపోకడలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచే ట్రంప్ అధినేతగా రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన క్షణం నుంచి పరిస్థితుల్లో ఎంతటి మార్పు వచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎడాపెడా నిర్ణయాలు తీసుకోవటం.. మనసుకు ఏది తోచితే దాన్నిచెప్పేయటం లాంటివెన్నో వికారాల్ని ఇప్పటివరకు ప్రదర్శించారు. ప్రపంచ దేశాల మీద సుంకాల పేరుతో షాకులు ఇచ్చిన ట్రంప్ కారణంగా అమెరికా ఆర్థిక పరిస్థితి అంతకంతకూ దిగజారుతోందన్న మాట బలంగా వినిపిస్తోంది. తాజాగా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోనుందా? అన్న ప్రశ్న తలెత్తేలా పలువురు విశ్లేషకుల వ్యాఖ్యలు ఉంటున్నాయి. ఆ కోవలోకే చెందింది అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ అమెరికాను హెచ్చరిస్తున్నారు. అమెరికా జీడీపీలో మూడో వంతు ఇప్పటికే తిరోగమనంలోకి జారుకుందన్న ఆయన.. 'ఇప్పటికే లేకున్నా.. జార్చుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అమెరికాను మూడు ముక్కలుగా చేస్తే.. ఒక ముక్క ఆర్థికంగా దారుణ పరిస్థితుల్లో ఉంటే.. రెండో ముక్కనిలకడగా ఉంది. మూడో ముక్క మాత్రం పురోగమిస్తోంది. రాష్ట్రాల వారీగా చూస్తే.. వ్యోమింగ్.. మెంటానా.. మిన్నెసోటా.. మిస్సిస్సిప్పీ.. కాన్సాస్.. మసాచుసెట్స్ కు మాంద్యం ముప్పు పొంచి ఉంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ రెండో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు భారీగా కోత పెట్టటంతో వాషింగ్టన్ డీసీ కూడా ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటోందన్నారు. మార్క్ జాండీ మాటల్ని సీరియస్ గా తీసుకోవాలా? ఆయన విశ్లేషణను నమ్మేసి అగ్రరాజ్యం మీదకు ఒక అభిప్రాయానికి వచ్చేయటం మంచిదేనా? అన్న సందేహం కలగొచ్చు. దానికి ఒక విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అదేమంటే.. 2008లో అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని ముందుగా అంచనా వేసిన వారిలో ఈ పెద్దమనిషి (జాండీ) ఒకరన్న విషయాన్ని మర్చిపోకూడదు. అప్పట్లో అమెరికా ఆర్థిక మాంద్యం ప్రపంచ దేశాల్ని ఎంతలా ప్రభావితం చేసిందో తెలిసిందే. అమెరికాలో నిత్యవసర ధరలు మరింత పెరుగుతున్నాయని.. త్వరలోనే మర్చిపోలేనంత స్థాయికి చేరుకున్న ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. పెరిగిన ధరల కారణంగా అమెరికన్ల కొనుగోలు శక్తి తగ్గినట్లుగా చెప్పిన ఆయన.. "వినియోగదారుల వ్యయ వృద్ధి 2008-09 ఆర్థిక సంక్షోభ కాలం నాటి కనిష్ఠ స్థాయికి జారుకుంది. ఈ జులైలో అమెరికాలో వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మరో 0.2 శాతం పెరిగి.. 2.7 శాతానికి చేరుకుంది. వచ్చే ఏడాదికి ఇది కాస్తా 4 శాతానికి పెరిగే ఛాన్సుంది. దీని కారణంగా అమెరికన్ల కొనుగోలు శక్తి మరింత తగ్గే వీలుంది' అంటూ ఆయన విశ్లేషిస్తున్నారు. మొత్తంగా అమెరికా మీద జాండీ లాంటి పెద్ద ఆర్థిక వేత్త చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక గా మారాయి. పెద్దన్న అహంకారంతో వ్యవహరిస్తే.. ఇలాంటి కొంప మునిగే కార్యక్రమాలు ఎదురవుతాయన్న విషయాన్ని ట్రంప్ ఇప్పటికైనా గుర్తిస్తారో లేదో?

## ఆత్మ హత్యల నివారణ సామాజిక బాధ్యత - సెప్టెంబర్ 10... ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

హిందూ ధర్మ శాస్త్రాలు ఆత్మ హత్యను మహాపాతకంగా వర్ణిస్తాయి. ఓ కష్టం, ఓ నష్టం, ఆవేదన, ఆవేశం, ఆక్రోశం.. ఏదో ఒక కారణం. అనిశ్చితి, అభద్రత...ఏదోఒక ఆందోళన ఒత్తిడిని పెంచితే చటుక్కున ఒక్క క్షణంలో విలువైన ప్రాణాలను పణంగా పెట్టేస్తున్న అవివేకి మనిషే. వివేచన, విచక్షణ శక్తి ఉన్న ఏకైక జీవి మనిషి. అయినా బలవంతంగా నిండు ప్రాణాన్ని తనకు తానుగా బలిపెట్టు కుంటున్నదీ మానవుడే. ప్రేమ అనుబంధాల వైఫల్యం, ఆత్మీయులను కోల్పోవడం, కుటుంబ కలహాలు, అవాంఛిత గర్భం, వరకట్న వేధింపులు, నయంకాని జబ్బులు, అనారోగ్యం, తీర్చలేని అప్పులు, ఆస్తి నష్టం, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, ఉన్నవారికి లేనివారికి మధ్య పెరుగుతున్న అంతరాలు, ఆర్థిక ఇబ్బందులు,రాజకీయ అస్థిరత, మతపరమైన విద్వేషాలు, సైద్ధాంతిక కారణాలు, హీరోలపై మితిమీరిన అభిమానం, ఉద్యోగాన్ని, గౌరవాన్ని, సామాజిక హోదాను కోల్పోవడం, నిరుద్యోగం, అనువంశిక, జన్యు లోపాలు కుటుంబంలో ఎవరి అండదండలు లేకపోవడం, వారిని సరిగ్గా పట్టించు కోలేక పోవడం, మోస పోవడం, మతి స్థిమితం సరిగ్గా లేకపోవటం, మద్యానికి బానిస కావడం, భార్య భర్తల మధ్య గొడవలు, ఒకరినొకరు అర్థం చేసుకోక పోవడం, ఉద్యోగం తొలి ప్రయత్నంలోనే రాలేదని, ప్రేమలో విఫల మయ్యామని, పరీక్షల్లో తప్పామని, అనుకున్న ర్యాంకు రాలేదని, వ్యాపారంలో నష్ట పోయామని, తనను దూషించారని, ఇతరులకు వచ్చిన ఉద్యోగోన్నతి తనకు రాలేదని, చేయని తప్పునకు తనపై ఆపద మోపారని, సాగు చేసిన పంటలో తనకు నష్టం వచ్చిందని... ఇలా చిన్న చిన్న కారణాలతోనే ఆత్మ హత్యలకు పాల్పడుతున్న ఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. మహిళల కన్నా పురుషులే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ముఖ్యంగా వివాహితుల్లో భార్యల కన్నా భర్తలే రెట్టింపు సంఖ్యలో బలవన్మరణాలకు సిద్ధ పడుతున్నారని తేలింది.వీరిలో నడివయసు వారే (30-44 ఏళ్లు) ఎక్కువ. పురుగు మందును తాగడం (37 శాతం), ఉరి వేసుకోవడం (26 శాతం), ఒంటికి నిప్పంటించుకోవడం (11 శాతం), నీళ్లలో మునిగిపోవడం (9 శాతం), తుపాకీతో కాల్చుకోవడం (1 శాతం) ఎత్తైన చోట్లనుంచి దూకటం ద్వారా బలవన్మరణాలు అధికం అవుతున్నాయి. కాలంతో పాటు మారుతున్న జీవనశైలి ప్రభావాన్నీ కాదనలేం. పూర్వం ప్రేమ, ఆప్యాయత, అనురాగం అనే బంధాలు మనుషుల మధ్య ఎక్కువగా ఉండేవి. కానీ ప్రస్తుత ఒత్తిడి జీవితాల్లో అనేక మంది వాటికి దూరమవుతున్నారు. ఎక్కడ చూసినా చిన్న చిన్న కుటుంబాలే దర్శనమిస్తున్నాయి. హిందూ శాస్త్రాల దృష్టిలో ఆత్మహత్య మహా పాతకం.




ఒకడు ఇనుప కమ్మీతో ఆత్మహత్య చేసుకుంటే అదే ఇనుప కమ్మీతో నరకాగ్నిలో శిక్షించ బడతాడని చెప్తూరు. ఒక వ్యక్తి గాయపడి, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటే... "నా దాసుడు తొందరపడి తనను తాను చంపు కున్నాడు, ఇతనికి పరలోక ప్రవేశం ఉండదు" అంటాడు అల్లాహ్ (బుఖారీ 2:445). "ఊపిరాడకుండా చేసుకొని చనిపోయిన వాడు నరకంలో కూడా ఊపిరాడని శిక్షలోనే ఉంటాడు. కత్తితో పొడుచుకొని చనిపోయిన వాడు నరకాగ్నిలో సదా తనను తాను పొడుచు కుంటూనే ఉంటాడు. (బుఖారీ 2:446). ఒకడు ఏ వస్తువుతో ఆత్మహత్య చేసుకుంటాడో పునరుత్థాన దినాన అదే వస్తువుతో హింసించ బడతాడు. (బుఖారీ 8:73). క్రైస్తవం దృష్టిలో ఆత్మహత్య తప్పు. పౌలు ఈ లోకంనుంచి వెళ్లిపోవలను కుంటాడు (ఫిలిప్పీ 1:20). అంత్య దినాల్లో ప్రజలు చనిపోవాలని కోరుకుంటారు గాని వాళ్లకు చావు దొరకదు. మరణం వాళ్ళ దగ్గర నుండి పారిపోతుంది. (ప్రకటన 9:10). ఎక్కువ మంది క్షణికావేశంలోనే ఆత్మహత్యలు చేసుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం, ఏటా 8 లక్షల మంది ఆత్మ హత్యలు చేసు కుంటున్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారి మరణాలకు రోడ్డు ప్రమాదాల తర్వాత రెండో ప్రధాన కారణం ఆత్మహత్యలే. భారత దేశంలో గంటకు 14 ఆత్మహత్యలు జరుగుతున్నట్లు నేషనల్ క్రైమ్స్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. అన్ని వయసుల వారూ ఆత్మ హత్యలు చేసుకుంటున్నా, ప్రపంచ వ్యాప్తంగా పురుషుల్లో ఆత్మ హత్యల రేటు ఎక్కువగా ఉంది. ఆత్మహత్యలకు, మానసిక రుగ్మతలకు మధ్య సంబంధం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రజల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటోంది. ఘర్షణలు, విపత్తులు, హింస, ఒంటరి తనం లాంటివి ఆత్మ హత్యలకు ప్రేరేపిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ముఖ్యంగా జీవితం పట్ల నిరాశ, విరక్తి, మద్యపానం లాంటివి బలవన్మరణాలకు ఎక్కువగా దారి తీస్తున్నాయి. 2011లో జరిపిన అధ్యయనం ప్రకారం ఏటా ఒక మిలియన్ మంది బల వంతపు మరణాలకు పాల్పడుతున్నారు. 2020 నాటికి ఈ సంఖ్య 1.50 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రతి 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు దాపురించడంపై ఆందోళన వెలిబుచ్చింది. 2016 గణాంకాల ప్రకారం, పురుషుల్లో ఆత్మహత్య రేటు లక్ష మందికి 13.5 కాగా, మహిళల్లో లక్షకు 7.7గా ఉంది. ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడితే, దానివల్ల 135 మంది దాకా ప్రభావితం అవుతారని, గతేడాది అమెరికాలో జరిగిన ఒక అధ్యయనంలో తేలింది. ఆత్మ హత్యలు, బాధితుల కుటుంబ సభ్యులతో పాటు, వారి సన్నిహితులపై మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతాయని కెంటకీ విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ జూలీ సెరెల్ పేర్కొన్నారు. సార్క్‌దేశాలైన భారత్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల్లో ప్రతి లక్ష మందిలో 8 నుండి 50 మంది దాకా ఆత్మ హత్యలకు పాల్పడు తున్నారని తేలింది. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం 45వ స్థానంలో ఉండగా, శ్రీలంక 12వ స్థానంలో ఉంది. 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మ హత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలు కొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించ బడింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని దాదాపు 40 దేశాలు అధికారికంగా చేపడు తున్నాయి. ఆత్మ హత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆత్మహత్య అనేకంటే ఇచ్ఛా మరణం అనటమే సరైనది. అది బలవన్మరణం కాదు. ఇచ్ఛా మరణం పొందిన వారిలో... భీష్మాచార్యుడు అంపశయ్యపై తనువు చాలించాడు. స్వామి వివేకానంద కపాల మోక్షం పొందారు. పోతులూరి వీర బ్రహ్మం సజీవ సమాధి అయ్యారు. కాను సన్యాల్ ఉరి వేసుకుని చని పోయారు. ఐ.పి.సి.309 సెక్షన్ ప్రకారం ఆత్మహత్యా ప్రయత్నం చేసి బ్రతికిన వారిపై కేసులు పెడతారు. ఇప్పుడు ఆ సెక్షన్ రద్దుకోసం భారత లా కమిషన్ సిఫారసు చేసింది. ఆత్మహత్యా యత్నం నేరం కాదు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది. 'తీవ్రమైన నిరాశ నిస్పృహలతోనే ఆత్మహత్య చేసుకోవాలని ఎవరైనా భావిస్తారు. వారికి కావలసింది సహాయం కానీ శిక్ష కాదు' అని స్పష్టం చేసింది. ఆత్మ హత్యకు ప్రయత్నించటాన్ని నేరంగా పరిగణిస్తున్న ఐపీసీ 309 సెక్షన్‌ను తొలగించాలని పార్లమెంటుకు సిఫార్సు చేయడం కూడా జరిగింది.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

## నిబద్ధతకు ప్రతిరూపం రాఘవాచారి - సెప్టెంబర్ 10... సంపాదక "చక్రవర్తుల" జన్మదినం




నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్ధతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్, సంస్కృత భాషల్లో పండితుడు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశాడు. ఆయన మూర్తీభవించిన నిజాయితీపరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహాభారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. సంస్కృతం నేర్పు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు. 1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించాడు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది. వరంగల్ వెళ్లి బీఏఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చదివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఇంగ్లీష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969-71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకు లయ్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం – ప్రయోగాలు – ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని వివరణ వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాలలోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిసలాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండినా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్ధత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేదీ తెల్లవారుజామున మరణించాడు.తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తించుకునే, ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి ఆయన.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

## "తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ" - సెప్టెంబర్ 10... కవి సామ్రాట్ జయంతి

తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞలు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవన వేదనను ప్రతిబింబించేదే. ప్రతి అక్షరంలోను అసాధారణ ఊహశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి చొచ్చుకుపోగలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియ లేదు. తన రచనల ద్వారా కులతత్వ, మతతత్వ విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించడం అసాధ్యం. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో జన్మించారు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, మరియు పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా లభించడం ఆయన అదృష్టం. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరారు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించారు. తరువాతి కాలంలో ఈయన వివిధ కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించారు. బందరు నేషనల్ కాలేజీ (1928), గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీ (ఏసీ కాలేజీ) (1938 వరకు), విజయవాడ లో ఎస్.ఆర్.ఆర్. %c?% సి.వి.ఆర్. కాలేజీ (1938–1959), కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ %c% సైన్స్ కాలేజీ (1959) మొదలైన కళాశాలల్లో ఆయన పని చేసారు. 1957 లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగానూ, 1958లో విధానమండలికి నామినేటెడ్ సభ్యుడిగానూ పని చేశారు. మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులు కున్నారు. 1916 లో "విశ్వేశ్వర శతకము" తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభమైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలోనే "ఆంధ్ర పౌరుషము" రచించారు. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చు కొన్నారు. 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రాచార్యునిగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసంగానికే కేటాయించారు. తరువాత విశ్వనాథ రచనా పరంపర పుంఖానుపుంఖాలుగా కొనసాగింది. 25 పైగిలకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, పరిశోధన వ్యాసాలు, ఉపన్యాసాలు... తెలుగుభాషకు విశ్వనాథ ఎనలేని సేవలు అందించారు. ఆయన రచనలలు కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించారు.విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కరలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన, వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంటాయి. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని అంటుండే వారు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ ఎందుకు వ్రాయాలంటే రోజూ తినడం మానివేయడం లేదుగదా అన్నారు. వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు "సహస్రఫణ్" పేరుతో హిందీ లోకి అనువదించారు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూప బడ్డాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపధ్యంలో వచ్చిన నవల "ఏకవీర"ను పుట్టపర్తి నారాయణాచార్యులు మలయాళంలోనికి, అంబటిపూడి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఏకవీర సినిమా కూడా వచ్చింది. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చారు. విశ్వనాథ వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడ్డది. భారతీయత మీద, తెలుగుదనం మీద అభిమానం



కలిగింది. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా తెలిపేవారు. ఈ కారణంగా విశ్వనాథను వ్యతిరేకించిన వారు చాలామంది ఉన్నారు. ఛాందసుడు అనీ, "గతకాలమె మేలు వచ్చుకాలము కంటెన్" అనేవాడు అనీ (శ్రీశ్రీ విమర్శ) విమర్శించారు. విశ్వనాథకు పాశ్చాత్య సాహిత్యం అంటే పడదని అనుకొంటారు. కాని ఆయన పాశ్చాత్య సాహిత్యం పట్ల గౌరవం కలిగి ఉండేవారు. షేక్స్పియర్, మిల్టన్, షెల్లీ వంటి కవుల రచనలను ఆసాంతం పరిశీలించారు. 1964లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ "కళాప్రపూర్ణ" తో సన్మానించింది. 1942లో గుడివాడ లో "గజారోహణం" సన్మానం జరిగింది. 1956 లో షష్ఠి పూర్తి వేడుకలు కూడా గుడివాడలో ఘనంగా జరిగాయి. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాతో సన్మానించింది. 1962 లో "విశ్వనాథ మధ్యాక్కరలు" రచనకు కేంద్రసాహిత్య అకాడెమీ వారి బహుమతి లభించింది. 1970 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆస్థాన కవి"గా గౌరవించింది. 1970 లో భారత ప్రభుత్వము "పద్మభూషణ పురస్కారం"తో గౌరవించింది. జ్ఞానపీఠ అవార్డు పొందిన తొలి రచయిత. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లోకి కూడా అనువదించారు. విశ్వనాథ చేపట్టని ప్రక్రియ కాని, ప్రయోగం కానీ లేదు. నవల, కథ, నాటిక, పాట, ఏదైనా తన పరిపూర్ణాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష్ఠ, తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలీ ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశారు. కోకిలరాజ అయన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కరలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన "రామాయణ కల్పవృక్షము" అనే పుస్తక రచనకు గాను జ్ఞాన పీఠ అవార్డు అందు కున్నారు. కోల్‌కతా, ముంబాయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కళా పరిషత్ విశ్వనాథను "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం "పద్మభూషణ్" బిరుదుతో గౌరవించింది. ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఎన్నో బిరుదులు, సన్మానాలతో సత్కరించాయి. విశ్వనాథ తన గురువులైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తన శిష్యుని గురించి ఇలా అన్నాడు..."నా మాదృష్టమున రచనా శైలిని స్పృశియా గురువు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిని గురించి ఇలా అన్నాడు... కాని, వీని దరియన్ తా మహ్మత్ లెందరో యోరనా వచటన్ సామాన్యుండన రాదు వీని కవితా సమ్రాట్ వవ్రత మా హేతువైనా మచ్చిష్యుని దా వరంచినది, నేనంతే ముదంబందెదన్". కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ 1976 అక్టోబర్ 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీ సేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం. సూర్యుని కాంతి, చంద్రుని వెన్నెల, కృష్ణమ్మ పరవళ్లు, గోదారి చల్లదనం ఉన్నంతవరకు తెలుగు సాహిత్య అభిమానుల గుండెల్లో విశ్వనాథ మరియు ఆయన రచనలు చిరస్మరణీయం.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

చురకలు



## సామగ్రి కొనలేం.. ఇల్లు కట్టలేం!

కరీంనగర్ : దేవుడు కరుణించినా.. పూజారి కరుణించలేదనట్లుగా మారింది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేయడంతో వారు పనులను ప్రారంభించారు. దీనిని అదునుగా భావించి కొందరు భవన నిర్మాణ సామగ్రి వ్యాపారులు ధరలు పెంచుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోదని భయపడుతున్నారు.

**రూ.5 లక్షలు సరిపోతాయా?**

పైలట్ ప్రాజెక్టు కింద మొదట జిల్లాలోని 15 మండలాల్లో దాదాపు 477 ఇళ్లు మంజూరు చేశారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాలతోపాటు హుస్నాబాద్‌లోని రెండు మండలాలను కలిపి దాదాపు 14 వేలకు పైగా ఇళ్లు కేటాయించాలని భావించారు. ఇందులో 8000కు పైగా మంజూరై..



చాలా చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్లో నిర్మాణ సామగ్రి ధరల పరిస్థితితో రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మేస్త్రీలు నిర్మాణ ధరలు, కూలీల ధరలు కూడా పెంచారు.

**జిల్లా, మండల కమిటీల ఏర్పాటు..**

నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు జిల్లాలో కమిటీలు వేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, కన్వీనర్‌గా హౌసింగ్ శాఖ పీడీ, సభ్యులుగా అదనపు కలెక్టరు, ఇతర అధికారులు ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు ఉంటారు.

**నిర్మాణం పూర్తి చేసేదెలా?**

– గడ్డం గీత, వెన్కేపల్లి

ఇల్లు మంజూరు కాకముందుతో పోలిస్తే ధరలు ఇప్పుడు చాలా పెరిగాయి. కంకర, సలాక, మొరం, సుతారి, కూలీ రేట్లు 40 శాతం వరకు పెంచారు. ఈ ధరలు తగ్గకపోతే ఇంటి నిర్మాణం పూర్తిచేయలేం.

## అనుమతులు వచ్చినా అంతులేని జాప్యం

ధర్మపురి : నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారి–63ని పనులకు మొన్నటి వరకు రిజర్వు అటవీ అనుమతుల్లో జాప్యం జరిగింది. ఇటీవల దీనికి అనుమతులు వచ్చినా టెండర్లు ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారిని హామ్(హైబ్రిడ్ యాన్యూటీ మోడ్) పద్ధతిలో రూ.3,850 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పొడవు 131 కిలోమీటర్ల పొడవును 4 ప్యాకేజీలుగా విభజించారు. ఆర్మూర్–మెట్‌పల్లి, మెట్‌పల్లి–జగిత్యాల, జగిత్యాల–రాయపట్నం, రాయపట్నం– మంచిర్యాలగా పనులను విభజించారు. 2023 డిసెంబరు నుంచి టెండర్ తుది ప్రక్రియ జరుగుతోంది. దీన్ని పలుమార్లు పొడిగించినా ఖరారు కాకపోవడమే జాప్యానికి కారణం అని అధికారుల ద్వారా తెలుస్తోంది.

**కదలిక వచ్చినా.. నిలిచిన ప్రక్రియ**

రెండు నెలల కిందట ఈ జాతీయ రహదారి ప్రక్రియలో కొంత కదలిక వచ్చింది. పుణ్య క్షేత్రాలు, పట్టణాలైన ధర్మపురి, గూడెంలతోపాటు



జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను కలపకుండా బయట నుంచి నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఆర్మూర్–మెట్‌పల్లి మధ్య 35 కి.మీ, మెట్‌పల్లి–జగిత్యాల మధ్య 28 కి.మీలు, జగిత్యాల–రాయపట్నం 31 కి.మీలు, రాయపట్నం–మంచిర్యాల మధ్య 35 కి.మీల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారి భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తయింది. 248 మంది రైతుల నుంచి 250 హెక్టార్ల భూమిని సేకరించే ప్రక్రియ పూర్తయింది. రైతులకు సంబంధించిన అభ్యంతరాలపై మరోమారు రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదికలను సమర్పించారు. అయితే రెండు నెలల కిందటే బుగ్గారం, ధర్మపురి మండలాల్లోని గుట్టల్లోని రిజర్వు అటవీ భూములకు అనుమతులు వచ్చాయి. ఇక కదలిక వచ్చిందనుకున్న సమయంలో టెండర్లు ఓపెన్ కావడం లేదని తెలుస్తోంది. కోర్టు కేసులు లేనిచోట్ల పరిహారం కోసం అవార్డుల ప్రక్రియ పూర్తయింది. టెండరు ఓపెన్ చేయాల్సి ఉంటుందని, టెండరు పూర్తయితేనే పనులు ప్రారంభించే అవకాశముందని సమాచారం.

## జీవాలకు మందులేవీ?

గంభీరావుపేట : జిల్లాలో పశువైద్యం గాలిలా దీపంలా మారింది. పాడి రైతులు, పశు పోషకులకు ఆదరువుగా నిలిచే జీవాలు పలురకాల వ్యాధులతో బాధపడుతుండగా.. ప్రైవేటు వైద్యంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏటా వర్షాకాలం ఆరంభంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. మేకలు, గొర్రెలు, పశువులకు నట్టల నివారణ మందులు అందించేవారు. 16 నెలల నుంచి జిల్లాలోని పశు వైద్యశాలలకు మందులు రావటం లేదు. సంవత్సరంలో నాలుగు సార్లు మందులు రావాల్సిన ఉండగా.. కొన్ని మాత్రమే వస్తున్నాయని.. అవి ఎటూ సరిపోవటం లేదని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయటం లేదని తెలుస్తోంది. దీంతో ప్రైవేటు దుకాణాల నుంచి మందులు తెచ్చుకుంటున్నారు.

**సిబ్బంది కొరత** జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, 13 పశువైద్య ఉప కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 17 మంది వైద్యులకు 13 మంది ఉన్నారు. నాలుగు పశు వైద్య కేంద్రాల్లో డాక్టర్లు లేరు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అటెండర్, కాంపౌండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో పశువులకు సరైన వైద్య అందక పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఖరీదైన పరీక్షలకు ఉచిత సేవలు



జగిత్యాల : ప్రజలకు ఆరోగ్య పరీక్షలు ఆర్థిక భారంగా మారొద్దనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రం(టీహబ్) సేవలను అందుబాటులోకి తెచ్చారు. జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయి. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రి, బస్తీ దవాఖానాల నుంచి రక్త నమూనాలను నిత్యం 5 ప్రత్యేక వాహనాల ద్వారా సేకరిస్తున్నారు. టీహబ్‌లో 134 రకాల పరీక్షలు నిర్వహించే వీలుండగా ప్రస్తుతం 94 రకాల వరకు నిర్వహిస్తున్నారు. రక్త పరీక్షలు, బయోకెమిస్ట్రీ, హిస్టోపాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో పరీక్షలు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లావ్యాప్తంగా 3,64,426 పరీక్షలు నిర్వహించారు. ఇందులో తిరస్కరణకు గురైన వారికి సైతం మరోమారు పరీక్షలు నిర్వహించారు.

**సాంకేతిక సమస్యలే అడ్డంకులు**

టీహబ్ సేవలను ఎక్కువగా పేదలే వినియోగించుకుంటున్నారు. మధ్య తరగతి వర్గాలు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఒక్కోసారి యంత్రాల్లో సాంకేతిక సమస్యలతో నివేదికలు రావడానికి ఆలస్యమవుతోంది. నిపుణులు లేక పరీక్షలు వంద శాతం చేపట్టలేకపోతున్నారు. మరోవైపు డెంగీ వంటి పరీక్షలకు సమయం పడుతుండటంతో నిరీక్షించలేకపోతున్నారు.

రోగులకు నివేదిక ప్రింట్ తీసి ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల టీహబ్ ఆధ్వర్యంలో అన్ని పీహెచ్‌సీలకు ప్రింటర్లను సైతం అందజేసింది. త్వరలోనే స్థానిక ఆసుపత్రుల్లో రిపోర్టులు తీసుకునే అవకాశం ఉంది.

**సందేహాల నివృత్తితోనే మేలు**

విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా లభిస్తున్నా ప్రజలు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నందున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలు ఏరోజుకారోజు అందుతున్నా ప్రజల్లో తలెత్తే సందేహాలను వైద్య శిబిరాల్లో నివృత్తి చేయాలి. చరవాణి వినియోగంపై అవగాహన లేనివారికి నేరుగా రిపోర్టులు అందేలా చొరవ చూపాలి.

**ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు ఇలా..**

రోగులు: 95,085సేకరించిన నమూనాలు: 1,74,668

వ్యాధి నిర్ధారణ పరీక్షలు: 3,64,426

**అదే రోజు నివేదికలు అందేలా చర్యలు**

జిల్లాలో వంద శాతం ప్రజలు టీహబ్ సేవలను వినియోగించుకుంటున్నారు.ఎనహో 5 వాహనాలు ప్రతి రోజూ నమూనాలను సేకరిస్తున్నాయి. ఇటీవల బస్తీ దవాఖానాలకు కూడా సేవలను విస్తరించాం. అన్ని రకాల పరీక్షల నివేదికలు అదే రోజు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.నివ్య, టీహబ్ ల్యాబ్ మేనేజర్

# రాయితీ బియ్యం వచ్చేశాయ్



సిరిసిల్ల : ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు సర్కారు కొత్తగా కార్డులు మంజూరు చేస్తోంది. ఆయా కుటుంబాల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రతను కల్పిస్తున్నాయి. వాటా ప్రకారం అవసరమైన సరకులు సమకూరుస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. జూన్‌లో మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేయడంతో చాలామంది కొత్త కార్డుదారులకు నిరాశే ఎదురైంది. ఈ నెల కోటాతో లబ్ధిదారుల్లో సంబరం నెలకొంది.

**కొత్తగా 42,623 మంది లబ్ధిదారులు** జిల్లాలోని 345 రేషన్ దుకాణాల పరిధిలో గతేడాది డిసెంబర్‌లో 1,73,727 రేషన్‌కార్డుల పరిధిలో 4,96 లక్షల మంది లబ్ధిదారులు ఉండేవారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్ సర్కారు కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ప్రాధాన్యం కల్పించింది. గ్రామ స్థాయిలో, మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికార యంత్రాంగం జిల్లాలో కొత్తగా 16 వేల కొత్త కార్డులను మంజూరు చేసింది. అందులో 42,623 మంది లబ్ధిదారులు కొత్తగా నమోదయ్యారు. పాత కార్డుల్లో మార్పులు చేర్పులతో మరో 31992 మందిని చేర్చారు.

**సర్వత్రా హర్షం**

నీ వానాకాలం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీకి చర్యలు తీసుకుంది. జూన్, జులై, ఆగస్టు మాసానికి సంబంధించి మే 23 వరకు జాబితాలో ఉన్న లబ్ధిదారులకు మాత్రమే మూడు నెలల కోటా కేటాయించారు.

నీ చివరి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ కార్డులు మంజూరీ చేసినా పౌరసరఫరాలశాఖ కీ రిజిస్టర్ జాబితాలో సాంకేతిక కారణాలతో పేర్లు నమోదు కాలేదు. దీంతో మెజారిటీగా కొత్తకార్డుదారులకు మూడు నెలల కోటా పంపిణీ కాలేదు.

నీ సెప్టెంబర్ మాసానికి సంబంధించి కేటాయించిన కోటాలో కొత్తగా చేరిన లబ్ధిదారులకు అవకాశం దక్కింది. 5,63,139 మంది లబ్ధిదారులకు 3648 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేయనుండగా సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

**జిల్లాలో ఇలా..** రేషన్ దుకాణాలు : 345

మొత్తం కార్డులు : 1,91,163

కొత్త కార్డులు : 16,859

కొత్త లబ్ధిదారులు : 74,615

నెలవారీ కోటా : 3,648 మె.ట.

# పరస్పర ఒప్పందాలు.. పరిశోధన మార్గాలు

వరంగల్ : వరంగల్ నగరంలోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్) ప్రఖ్యాత సంస్థలతో కలిసి అడుగులు వేస్తోంది. విద్యార్థులు, అధ్యాపకుల విద్యా పరిశోధనలు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఉద్యోగ అవకాశాలు మెరుగు పర్చడానికి పేరుగాంచిన సంస్థలతో పరస్పర ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంటోంది. దేశంలోని సంస్థలతో పాటు విదేశాలకు చెందిన విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలతో చేతులు కలుపుతోంది. తాజాగా బజాజ్ ఆటో లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.13 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు పరస్పర ఒప్పందం జరిగింది. నిట్ సంచాలకుడు ఆచార్య బిద్యాధర్ సుబుధి, బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ గుడిపాటి సుధాకర్ ఎంఓయూపై సంతకాలు చేశారు. బీటెక్ విభాగంలో ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఈ సంస్థ నుంచి సంయుక్తంగా సర్టిఫికేషన్ పొందే అవకాశం ఉంటుంది. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే నిట్ వరంగల్ పరిశోధనలకు హబ్‌గా మారనుంది.

**ఆవిష్కరణల పెరుగుదల**

పరిశ్రమలు, ఇతర విద్యా సంస్థలతో చేసుకుంటున్న ఎంవోయూల ద్వారా కొత్త పరిశోధన ప్రాజెక్టులు రూపొందించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని పెంపొందిస్తాయి. అంతే కాకుండా భాగస్వామ్య సంస్థల నుంచి



పూర్తి సహకారం పొందే అవకాశం ఉంటుంది. పరిశ్రమలతో బలమైన సంబంధాలు ఏర్పర్చుకోవడానికి దోహదపడతాయి. ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, కొత్త టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది.

**మెరుగైన అవకాశాలు**

పరిశ్రమలతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా కోర్సులు చేసే విద్యార్థులకు అత్యుత్తమ ప్లేస్‌మెంట్స్ లభిస్తాయి. అగ్రగామిగా ఉన్న ప్రతిష్ఠాత్మక సాఫ్ట్‌వేర్ సంస్థలు తరచూ నిట్ ప్రాంగణంలో నియామకాలు చేపట్టే అవకాశం వస్తుంది. అధ్యాపకులకు సైతం నూతన పరిశోధన పద్ధతులు, బోధనా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందే అవకాశాలను కల్పిస్తాయి. అంతర్జాతీయ సంస్థలతో ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకుంటూ వరంగల్ నిట్ మరింత గుర్తింపు తెచ్చుకుంటోంది.

## ప్రతినెలా.. పారదర్శకంగా..!

ఖమ్మం : బ్లాక్ గ్రానైట్ రాళ్లకు ఖమ్మం జిల్లా ప్రసిద్ధి చెందింది. నాలుగు నెలలుగా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా రాయల్టీ చెల్లింపులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టగా క్వారీలు, పరిశ్రమల యజమానులు ఆన్‌లైన్‌లో ప్రతినెలా రాయల్టీ సొమ్ము చెల్లించి క్వారీల నుంచి ముడి గ్రానైట్ రాళ్లను పరిశ్రమలకు తరలిస్తున్నారు.

**రాష్ట్రంలో ఎక్కడైనా.. ఏ క్వారీ నుంచైనా**

పరిశ్రమలో ముడి రాళ్లను కోసే ప్రతి బ్లేడ్ (కట్టర్)కు నెలకు రూ.16వేలను ఆన్‌లైన్‌లో చెల్లించి తమకు కావాల్సిన రాళ్లను కొనుగోలు చేసి పర్మిట్లు పొందుతున్నారు. నెలకు రూ.16వేలు చెల్లించి 16 క్యూబిక్ మీటర్ల రాళ్ల కొనుగోలు చేసుకోవచ్చు. అంతకుమించి ముడి రాళ్లు కొనాలంటే క్యూబిక్ మీటర్‌కు రాయల్టీ సొమ్ము రూ.5,500 చెల్లించి పర్మిట్ తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో ముందుగానే రాయల్టీ సొమ్ము చెల్లించటం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా, ఏ క్వారీ నుంచైనా గ్రానైట్ ముడి రాళ్లు కొనే అవకాశాన్ని సర్కారు కల్పించింది. జిల్లాలోని 318



పరిశ్రమలు ఆగస్టులో 18,960 క్యూబిక్ మీటర్ల ముడి రాళ్లను కొన్నాయి.

**జరిమానాల రూపంలో రూ.1.72 కోట్లు వసూలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.44.29 కోట్ల ఆదాయం లభించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.101 కోట్లు రాబడి సమకూరింది. వివిధ రకాల ఖనిజాలను అక్రమ మార్గంలో తరలిస్తున్న వారిని అధికారులు పట్టుకుని 340 కేసులు నమోదు చేశారు. వారి నుంచి జరిమానాల రూపంలో రూ.1.72 కోట్లు రాబట్టారు.గ్రానైట్ ముడి రాళ్ల కొనుగోలుకు రాయల్టీ సొమ్ము చెల్లింపులు, పర్మిట్ల జారీ వంటి ప్రక్రియ ఆన్‌లైన్‌లో సక్రమంగా సాగుతోంది. ఈ విధానంలో ఎవరూ నిరీక్షించాల్సిన అవసరం లేదు. బొగ్గు, బెరైటీస్, క్వార్ట్జ్ వంటి మేజర్ మినరల్స్‌కు సంబంధించి చెల్లింపులన్నీ నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా కంపెనీలు చెల్లిస్తాయి. మైనర్ మినరల్స్‌కు సంబంధించి రాయల్టీ వసూళ్లు తమ కార్యాలయం పరిధిలో సాగుతాయి. నిఘా పెంచి అక్రమ మార్గంలో తరలించే వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. సాయినాథ్, ఏడీ, గనుల శాఖ, ఖమ్మం

## బారులు తగ్గేలా.. బాధలు తొలగేలా..!

ఖమ్మం: యూరియా ఎప్పుడొచ్చినా.. ఎక్కడ విక్రయిస్తున్నా.. రైతులు బారులుదీరి పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పాలేరు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఉప కేంద్రాలు ఏర్పాటుచేశారు. కేంద్రాలు పెరగటంతో బారులు తగ్గాయి. ఇదే విధానాన్ని యూరియా అవసరమున్న ప్రాంతాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) తక్కువ ఉన్న మండలాల్లో వానాకాలం సీజన్ వరకు అనుసరించనున్నారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం, కారేపల్లి, కొణిజర్ల, తల్లాడ, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు తక్కువగా ఉండటంతో రైతులు బారులు తీరుతున్నారు. సమస్య నివారణలో భాగంగా ఆయా మండలాల్లో ప్యాక్స్‌కు అనుబంధంగా ఉపకేంద్రాల్లో యూరియా విక్రయాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎందుకొచ్చింది కొరత..?**

ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే ఎక్కువగా యూరియా బస్తాలు విక్రయించినా.. కొరత అంటూ రైతులు విక్రయ కేంద్రాల వద్ద ఎగబడుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతేడాది ఆగస్టు 31 వరకు జిల్లాలో 24,120.92 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. అప్పుడు ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. ఈ సంవత్సరం ఆగస్టు 31 వరకు 24,324.89 మెట్రిక్ టన్నులు అంటే 203.97 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అదనంగా విక్రయించారు. జిల్లాలో మారుమూల గ్రామాలు, తండాల్లో రవాణా పేరిట అధికంగా డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి మండలంలో ఇద్దరు, చింతకాని, నేలకొండపల్లి, రఘునాథపాలెం మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున వ్యాపారులు అదనంగా డబ్బులు తీసుకున్నట్లు వ్యవసాయాధికారుల దృష్టికి రావటంతో నలుగురి లైసెన్స్‌ను 15 రోజులపాటు సస్పెండ్ చేశారు. ఒక వ్యాపారి సొంతంగా లైసెన్స్ వదులుకున్నారు.



**అన్నీ సహకార సంఘాలకే..**

చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు 1,333.03 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం వచ్చింది. ఇందులో ఖమ్మం జిల్లాకు 483.03, భద్రాద్రి జిల్లాకు 500, మహబూబాబాద్ జిల్లాకు 250 మెట్రిక్ టన్నులను అధికారులు కేటాయించారు. ఖమ్మం నిల్వ కేంద్రానికి 100 మెట్రిక్ టన్నులు తరలించారు. మరో 2,598.75 మెట్రిక్ టన్నుల యూరియా శనివారం రానుంది. అందులో ఖమ్మం జిల్లాకు 918.75, భద్రాద్రి జిల్లాకు 1,000, మహబూబాబాద్ జిల్లాకు 480, ఖమ్మం నిల్వ కేంద్రానికి 200 మెట్రిక్ టన్నులు కేటాయించనున్నారు. 'ప్రస్తుతం వచ్చిన, రాబోయే యూరియా బస్తాలను సహకార సంఘాలు, వాటి పరిధిలో ఏర్పాటుచేస్తున్న ఉప కేంద్రాల ద్వారానే విక్రయిస్తాం. ప్రైవేటు కేంద్రాలకు కేటాయించటం లేదు'ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

# ప్రకృతి సేద్యం.. రసాయన రహితం

కోదాడ : ప్రతి రైతు యూరియా లేకుండా వరి సాగు చేయలేని పరిస్థితి. కానీ దీనికి భిన్నంగా గత ఎనిమిదేళ్లుగా ఒక్క యూరియా బస్తా కూడా పొలంలో చల్లకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కోదాడ మండలం గుడిబండకు చెందిన దంపతులు యరగాని లక్ష్మయ్యగౌడ్-రమణమ్మలు.

ప్రకృతి సాగు చేయాలంటే కొన్నేళ్లు సేంద్రియ పద్ధతి అనుసరించడం తప్పనిసరి అని లక్ష్మయ్య పేర్కొంటున్నారు. రెండెకరాల భూమిలో ఎనిమిదేళ్లు రసాయనాలకు తావు ఇవ్వకుండా జీవామృతం, పంచామృతం లాంటి సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేశారు. ప్రస్తుతం సాగుకు ముందు కేవలం 15 ట్రక్కుల పశువుల పెంటను భూమికి పట్టించారు. అనంతరం శనగ చెక్కను సాగు చేసి కలియ దున్నారు. తర్వాత పొలంగా మార్చి జపాన్ నాటు(శ్రీవరి సాగుకు పోలినది) పద్ధతుల్లో పది అంగుళాల దూరంతో నాటు వేశారు. కలుపు నివారణను కూలీలతో అరికట్టారు. వీటన్నింటికి రెండెకరాలపై లక్ష్మయ్యకు కేవలం రూ.30 వేలు ఖర్చు వచ్చింది. పైరు ఏపుగా పెరిగిన పంట పలువురిని ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

**స్వయంగా బియ్యం అమ్మకం**

రైతులు నష్టాలు ఎదుర్కోవడానికి ప్రధాన కారణం పండించిన పంటను వ్యాపారులకు, ప్యాక్స్‌లకు తక్కువ ధరకు విక్రయించడమేనని లక్ష్మయ్య అంటున్నారు. తాను పండించిన ధాన్యాన్ని స్వయంగా మిల్లుకు తరలించి మరాడించి నిల్వ చేస్తానని చెబుతున్నారు. కుమారుడు ప్రవీణ్ ఆర్డర్లు తీసుకొచ్చి క్వింటా రూ.8వేలు చొప్పున హైదరాబాద్, కోదాడ, సూర్యాపేట పట్టణాల్లో విక్రయిస్తుంటారు. ఏడాదికి అటు ఇటుగా 90 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తూ, పెట్టుబడి పోను రూ.5-6 లక్షల వరకు లాభం రాబడుతున్నట్లు తెలిపారు.



**పులిసిన పెరుగు.. పైరు పరుగు..!**

యూరియాకు ప్రత్యామ్నాయం ఉందని సేంద్రియ రైతులు నిరూపిస్తున్నారు. రెండు కిలోల పులిసిన పెరుగును డ్రమ్ము నీటిలో కలిపి పొలానికి (చేనుకు) పిచికారీ చేస్తే ఒక బస్తా యూరియా కంటే ఎక్కువ పని చేస్తుందని ఏపీలోని కర్నూలు జిల్లా కల్లూరు మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఇన్నోవేటర్ పల్లె వీరరాఘవరెడ్డి వ్యక్తం చేస్తున్నారు. ఆయన వాట్సప్ గ్రూపుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులున్నారు. ఇరవై ఏళ్లుగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా మంచి దిగుబడులను సాధిస్తూనే ఇతర రైతులకూ అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణం తయారీ: రెండు లీటర్ల పాలను వేడి చేసి వాటిని రాగి పాత్రలో పోసి పెరుగు చేయాలి. ఆ పెరుగును 15 రోజులపాటు ఆరుబయట పులియబెట్టాలి. దానిపై బూజు వచ్చేస్తుంది. ఆ పెరుగును బాగా చిలికి డ్రమ్ములో వంద లీటర్ల నీటికి కలపాలి. ఆ ద్రావణాన్ని వరి పొలానికి పిచికారీ చేయాలి. బస్తా యూరియా పది రోజులు పని చేస్తే ఈ ద్రావణం పొలాన్ని చాలా ఎక్కువ పచ్చదనంగా ఉంచి మంచి దిగుబడికి దోహదపడుతుంది. సేంద్రియ సాగులో యువరైతుమోత్కూరు: మోత్కూరుకు చెందిన యువరైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి అర్థశాస్త్రంలో పీజీ చదివారు. నాలుగేళ్లుగా పదెకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఒంగోలు జాతి గోవుల పేడ, మూత్రంతో జీవామృతం, ఘనజీవామృతం, గోకృపామృతం, కషాయాలు ఉపయోగించి దేశవాళి స్వచ్ఛమైన పౌష్టికాహారాన్ని అందించే పంటలు పండిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు, దేశవాళి వరి రకాలు నవార, రత్నచోడి, మైసూర్‌మల్లిక, కుజిపటాలియ, మట్టారైస్, కులాకర్, కృష్ణప్రియ, బహురూపి ఇలా.. అనేక పంటలతో దిగుబడులు సాధిస్తున్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో ఆశించిన లాభాలు గడిస్తున్నానని పేర్కొన్నారు.

# తనిఖీలు నామ'మాత్ర'మే!

కరీంనగర్ : ఔషధ నియంత్రణపై పర్యవేక్షణ లేక ఉమ్మడి జిల్లాలో తరచూ నకిలీలు బయటపడుతున్నాయి. అడపాదడపా తనిఖీలతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఎక్కువ కమీషన్ వచ్చే ప్రాధాన్యత లేని మందులకే పెద్దపీట వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 800కు పైగా ప్రైవేటు ఆస్పత్రులు, 2 వేలకు పైగా ఔషధ విక్రయ దుకాణాలున్నాయి. హోల్‌సేల్‌గా విక్రయించే 180 ఏజెన్సీలున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ రూ.7-9 కోట్ల వ్యాపారం జరుగుతోంది.

**వారికంతా మామూలే!**

నాలుగు జిల్లాల పరిధిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతోపాటు ఉమ్మడి జిల్లా, రీజియన్ స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే చిన్నాపెద్ద ఆస్పత్రులన్నీ 500కు పైగా ఉన్నాయి. వీటి పరిధిలోని మందుల దుకాణాల్లో నెలకోసారి కూడా తనిఖీలు నిర్వహించడం లేదు. కొందరు వ్యాపారులు దుకాణాల వద్దకు అధికారులు రాకుండా పలు రకాలుగా పలుకుబడిని ప్రయోగిస్తున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది. పలువురు అధికారులు తనిఖీలను 'మామూలు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేవలం 27 కేసులు మాత్రమే నమోదయ్యాయి. అంటే సగటున నెలకు రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ విషయమై ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు శ్రీనివాస్ వివరణ కోరగా తనిఖీల విషయంలో జాప్యం చేయడం లేదని, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

**చిన్న కేసులే అధికం**

సిరిసిల్ల జిల్లాలో తనిఖీ చేసిన ప్రతిసారీ ఆయుర్వేద సంబంధిత ఔషధాలే పట్టుబడ్డాయి. ముఖ్యంగా కిడ్నీలో రాళ్లు తొలగించడానికి, లావు తగ్గడానికి వాడే పొడి రూపంలోని మందులను, నిషేధిత పదార్థాలను పట్టుకున్నారు.గతేడాది అక్టోబరు 16న కరీంనగర్‌లో రూ.4.87 లక్షల విలువైన ఈఎస్ఐ మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా అజ్ఞాత వ్యక్తులిచ్చిన ఫిర్యాదు ఆధారంగానే ఈ కేసు నమోదు చేశారు. మిగతా సోదాల్లో చిన్న చిన్న మాత్రలను మాత్రమే గుర్తించారు.

ముఖ్యంగా లైసెన్సులు లేని వాటి విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో తయారైన నకిలీ ఔషధాలను కొన్ని దుకాణాల్లో స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్‌లో జులై 11న యాంటీ క్యాన్సర్ ఇంజిక్షన్‌ను నిర్ణీత ధర కన్నా రూ.668 అధికంగా అమ్ముతుండగా పట్టుకున్నారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా వసూలు చేస్తున్నందుకు కేసు పెట్టారు.

# మన్నిక డొల్ల.. కాసులు గుల్ల..!



కరీంనగర్ : ఏడాదిన్నర కిందట నగరంలోని ఓ రోడ్డుపై రబ్బర్‌తో ఏర్పాటు చేసిన వేగనియంత్రిక దుస్థితి ఇదీ. వాహనాల తాకిడికి ఎక్కడికక్కడ ఊడిపోయి.. ఇలా కొద్ది భాగం మిగిలింది. పైగా వీటిని ఏర్పాటు చేసేందుకు వాడిన మేకులు రోడ్డు పొడవునా అలాగే ఉండి వాహనదారులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. సీపీ కార్యాలయం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వైపునకు వెళ్లే రోడ్డు మీదనే ఇది నిలబడలేదు.ఏదైనా పని చేస్తే ఫలితం ఉండాలి. ప్రజలకు అది ఉపయుక్తంగా మారాలి. కానీ ఖజానాలో కాసులున్నాయని.. టెండర్లు పిలవడం.. పనులు చేపట్టడం.. కొన్నాళ్లకు చేసిన పనిలో డొల్లతనం కనిపించడం.. కరీంనగర్ బల్దియాలో అలవాటుగానే మారింది. తాజాగా నగరంలోని ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న అంతర్గత రహదారులపై వీటిని ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**అంతర్గత రహదారులపై...**

గీతాభవన్ చౌరస్తా నుంచి పద్మానగర్ చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా ఉన్న అయిదారు అంతర్గత రహదారుల మీద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఒక్క మార్గంలోనే వీటి కోసం నగర పాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.19.97 లక్షలను వెచ్చిస్తున్నారు. ఆగమేఘాల మీద గత నెల 21న టెండర్లు పిలిచి ఈ నెల 1న పూర్తి చేశారు. దాదాపు 12-15 వరకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా 303 చదరపు మీటర్లకుగాను చ.మీటరుకు రూ.2797 ధరను నిర్ణయించారు. దీనికే రూ.8.47 లక్షలు ఖర్చువుతోంది. ఇక 104 మీటర్ల క్యాట్ రబ్బరుకు రూ.4.16 లక్షలు వెచ్చించనున్నారు. మిగతా సొమ్మును సోలార్ బ్లింకర్లు, రౌండ్ మీటర్లకు వాడనున్నారు. ఈ చిన్న పనికి దాదాపు రూ.20 లక్షలు వెచ్చించడం అనుమానాలకు తావిస్తోంది. పైగా వీటిని నగరమంతా విస్తరించేందుకు రూ.కోట్లు ఖర్చు చేయాలనే యోచనలో అధికారులున్నారు. ఈ విషయమై ర.భ శాఖ జిల్లా ఉన్నతాధికారి నరసింహచారి, బల్దియా ఎస్‌ఈ రాజ్‌కుమార్‌లు స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలతో అంతర్గత రోడ్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఇలా ఇబ్బందికరం..**సీసీ రోడ్లపై సిమెంట్‌తో తారు రోడ్లపై తారుతో వేసిన స్పీడ్ బ్రేకర్లు మన్నికగా ఉంటాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు.సిమెంట్, డాంబర్‌తో వేసే వాటికి రూ.5-10 వేలు ఖర్చవనుంది. కానీ వీటికి ఒక్కోదానికి రూ.60-80 వేల వరకు వ్యయమవనుంది.మన్నిక విషయంలోనూ ఇబ్బంది ఉంటుంది. గతంలో వేసిన వందలాది రబ్బర్ నియంత్రికలు నామరూపాల్లేకుండా పోయాయి.సిమెంట్ కంకర, డాంబర్‌తో వేసేవాటికి మరమ్మతులకు అవకాశముంటుంది. రబ్బర్‌తో నిర్మించిన దాని స్థానంలో కొత్తగా ఏర్పాటు చేయాలి.ః వీటి నాణ్యత పరీక్ష కూడా ప్రశ్నార్థకమే! వాహనాల తాకిడిని తట్టుకోవడం కష్టమే.

# సమస్యలు కనరు.. వసతులు సమకూర్చరు




సిరిసిల్ల : వస్త్రోత్పత్తుల ఖిల్లా.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగేళ్ల క్రితం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమైంది. పేరుకు విశ్వవిద్యాలయం అయినా.. కనీస మౌలిక వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రవేశాల సమయంలో ఏడాదిలోపు అత్యాధునిక వసతులతో కూడిన భవన సముదాయాలను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇస్తున్నారు. అయిదేళ్లలో ఎలాంటి పురోగతి లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు కళాశాల అభివృద్ధి.. విస్తరణపైనా చూపుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆరు బ్రాంచిలు నాలుగేళ్ల విద్యార్థుల భవిష్యత్తుపైనా దీని ప్రభావం చూపుతోంది. ఇటీవలే కొత్త విద్యాసంవత్సరం ప్రవేశాలు పూర్తవడంతో గతవారం నుంచే తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలకు తరగతి గదుల విషయం రోజురోజుకు జఠిలమవుతోంది.

**ఇదీ పరిస్థితి**2021-22 విద్యాసంవత్సరంలో సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, టెక్స్‌టైల్ ఆరు బ్రాంచిలతో సిరిసిల్లకు జేఎన్‌టీయూ కళాశాల ప్రారంభమైంది. తాత్కాలికంగా వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో రెండేళ్లకు అనుమతించారు. ప్రస్తుతం నాలుగేళ్ల విద్యార్థులతో కలిపి 1,127 మంది ఉన్నారు. అయిదేళ్లుగా విడతల వారీగా విశ్వవిద్యాలయం గ్రాంటులతో డిగ్రీ కళాశాలలో 8 తరగతి గదులు, ల్యాబ్‌లకు ఫ్యాబ్రికెట్ షెడ్‌లను నిర్మించారు. వసతి గృహాలకు అగ్రహారంలోనే తొమ్మిది ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకున్నారు.

విశ్వవిద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణాలకు 2023 ఆగస్టులో తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో 20 ఎకరాల స్థలాన్ని రెవెన్యూశాఖ అప్పటి రిజిస్ట్రార్‌కు అప్పగించింది. భవన నిర్మాణాలకు జేఎన్‌టీయూ ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నా నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. డిగ్రీ కళాశాలలోనూ విద్యార్థుల ప్రవేశాలు పెరగడం.. వారికీ తరగతి గదుల విస్తరణలో ఇబ్బందులు తలెత్తడంతో ఇంజినీరింగ్ తరగతుల సముదాయానికి గురువారం తాళం వేశారు.

ఇక అధ్యాపకుల విషయానికొస్తే విశ్వవిద్యాలయం సీఎస్‌సీ, ఈసీఈలో ఇద్దరు ప్రొఫెసర్లను మాత్రమే నియమించింది. నలుగురిలో కేవలం ఇద్దరు మాత్రమే యూనివర్సిటీ నియమించిన ప్రొఫెసర్లు ఉన్నారు. అందులో ఒకరు సీఎస్‌సీ, ఈసీఈ విభాగాల వారు నలుగు ఒప్పంద ప్రొఫెసర్లు కాగా మిగతావారు అతిథి అధ్యాపకులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన, అత్యాధునిక ప్రయోగశాలలు లేవు. వసతి గృహాల్లోనూ మౌలిక వసతులు కరవయ్యాయి. దీనిపై విద్యార్థులు కూడా చాలా సార్లు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులకు లేఖలు రాసినా.. ఎలాంటి సమాధానం లేదని వాపోతున్నారు.

# పల్లెల పురోగతి.. వంద శాతం రాయితీ

సారంగాపూర్ : గ్రామాల్లో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలతోపాటు రైతులకు ప్రయోజనం చేకూరేలా అమలు చేస్తున్నారు. వందశాతం రాయితీపై ఇచ్చే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అవసరమున్న రైతులు స్థానికంగా ఉపాధి సిబ్బందికి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని డీఆర్డీవో పీడీ రఘువరన్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలన్నారు.

**మండలాల వారీగా లక్ష్యం**

జిల్లా వ్యాప్తంగా 385 పంచాయతీల్లో పశువుల పాకలు, మేకలు, గొర్రెల షెడ్లు, కోళ్ల షెడ్లు, అజోలా పెంపకం, వర్మీ కంపోస్టు గుంతలు, ఇంకుడు గుంతలు తదితర పనులకు మండలాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించి పనులు మంజూరు చేశారు. జిల్లాలో కోళ్ల పెంపకం కోసం షెడ్డు నిర్మాణాలు వంద నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే 34 నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. ఇంకుడు గుంతలు 2 వేలకుగానూ 1230, వర్మీ కంపోస్టు నిర్మాణాలు 201కి గానూ 112, పశువుల షెడ్లు 864కు 552, గొర్రెల షెడ్లు 119కి 74, అజోలా పెంపకానికి 659 లక్ష్యానికిగానూ 384, భూగర్భ జలాల పెంపు కోసం 20 చెక్‌డ్యాంల నిర్మాణాలు లక్ష్యంకాగా 17 ప్రగతిలో ఉన్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు పెద్దఎత్తున ఊరూరా పనుల జాతర కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించింది.

నిర్మాణ వివరాలిలా..



పశువుల పాకలు: యూనిట్ ధర రూ.98 వేలుకాగా.. మూడు పశువులు కచ్చితంగా ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మేకలు, గొర్రెల షెడ్ల యూనిట్‌కు కూడా రూ.98 వేలు ఉండగా కనీసం 10 మేకలు, గొర్రెలున్న వారికి మంజూరు చేయనున్నారు.

**కోళ్ల పెంపకం షెడ్లు:** ఒక యూనిట్ ధర రూ.25 వేలు. రైతు షెడ్డు నిర్మించుకొని వంద నాటు కోడి పిల్లలను పెంచాల్సి ఉంటుంది. వాటి పెంపకానికి రూ.3 లక్షలు అందించనున్నారు. **అజోల్లా పెంపకం:** యూనిట్ ధర రూ.20 వేలు రైతులకు మాత్రమే అందజేయనున్నారు.

**వర్మీ కంపోస్టు గుంతలు:** యూనిట్ విలువ రూ.15 వేలు రైతులు సామూహికంగా, వ్యక్తిగతంగా నిర్మించుకోవచ్చు.ఇంకుడు గుంతలు: ఒక్క యూనిట్‌కు రూ.6500 చొప్పున చెల్లించనున్నారు.

# ఆపదలో ఆదుకునే టోల్‌ఫ్రీ నెంబర్లు

భువనగిరి : నిత్యం ఎదురవుతున్న సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ పరిష్కారం చూపుతుంది. ఇటీవల పెరిగిపోతున్న ఆన్‌లైన్, వస్తు కొనుగోళ్లలో కొనసాగుతున్న మోసాలతో పాటు పలు సామాజిక అంశాలు, సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. మోసానికి, సమస్య పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలన్న విషయమై టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లు దారి చూపుతున్నాయి. సామాజిక భద్రత అంశాలపై భరోసా కల్పిస్తున్నాయి. ఏ నెంబర్ నుంచి ఎలాంటి సాయం పొందవచ్చో మీకోసం...అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు సహాయం పొందవచ్చు. ఫిర్యాదు అంశం మేరకు పోలీసులు సమస్య పరిష్కరిస్తారు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 1930 ఫోన్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఎవరైనా కాజేసినా వెంటనే ఫిర్యాదు చేసిన పక్షంలో డబ్బు తిరిగి పొందే అవకాశం ఉంది. ఫిర్యాదులో ఆలస్యమైన పక్షంలో నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల, బాల్య వివాహాల నియంత్రణకు 18001801551 నెంబర్‌ను వినియోగించుకోవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు బాలలకు విముక్తి కల్పిస్తారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి విద్యుత్తు సంస్థ 1912 నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉంది.మహిళలు గృహహింస ఎదుర్కొంటే 181కు ఫోన్ చేయవచ్చు. మహిళా సహాయక కేంద్రం సిబ్బంది స్పందించి సహాయం అందిస్తారు. పనిచేసే చోట వేధింపులు, లైంగిక, వరకట్న వేధింపులతో పాటు ఆడ శిశువుల విక్రయం, మానవ అక్రమ రవాణా సంబంధిత



అంశాలపై నేరుగా ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చు.

**స్టేషన్ బెయిల్ ఎలా ఇస్తారంటే**

వివిధ నేరాల్లో నిందితులపై పోలీసులు భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్ట ప్రకారం వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తుంటారు. తీవ్రమైన నేరాలతో పాటు ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో నిందితులు విచారణకు సహకరించే వారికి అన్ని కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అధికారం పోలీసులకు ఉంది. పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి నేర విచారణతోపాటు చట్టంలో పేర్కొన్న నిబంధనలు పాటిస్తారని పోలీసులు భావిస్తే స్టేషన్ అధికారి బెయిల్ ఇవ్వవచ్చు. కేసులో ఉన్న నిందితులు వ్యక్తిగత వివరాలు, గుర్తింపు ధ్రువపత్రాలు, జామీను బాండ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. నిందితులు సెక్షన్ 35(4) నోటీసు నిబంధనలు, షరతులు పాటించాలి.

సెక్షన్ 35(5) ప్రకారం నిబంధనలు పాటిస్తున్నప్పటికి పోలీసులు అరెస్టు చేయాలని భావిస్తే ఆ కారణాన్ని రికార్డు చేయాలి. నిబంధనలు పాటించని నిందితులను న్యాయస్థానం ఆదేశాలకు లోబడి సెక్షన్ 35(6) ప్రకారం అరెస్ట్ చేయవచ్చు. ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో ఉన్న నిందితులు పోలీసుల విచారణకు సహకరించరని అనుకుంటే సెక్షన్ 35(1)బీ నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేయవచ్చు.

ఏడు సంవత్సరాలు కంటే ఎక్కువ శిక్షలు ఉన్న కేసుల్లో సెక్షన్ 35(1)సీ అరెస్టుకు కారణం చూపాల్సిన అవసరం లేదు. నేరుగా అరెస్టు చేయవచ్చు. అరెస్టులపై పోలీసులకు విచక్షణాధికారం ఉన్నప్పటికి అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ 2014 కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును వెల్లడించింది. ఏడేళ్లలోపు శిక్షలు పడే కేసుల్లో నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని తన తీర్పులో పేర్కొంది. అరెస్ట్ సమయంలో పోలీసుల విచక్షణాధికారాల గురించి ఈ తీర్పు చెబుతుంది.

# బియ్యం.. బలవర్ధకం

మిర్యాలగూడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుపేదలకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మూడేళ్లుగా ఫోర్టిఫైడ్ బియ్యం (బలవర్ధక బియ్యం) సరఫరా చేస్తుండగా వీటిలో ఉన్న పోషకాల విషయంలో ఇటీవల చర్చ మొదలైంది. గ్రామీణ ప్రాంత పేదలకు సరైన పోషకాలు అందకపోవటంతో తరచూ రక్తహీనత, ఎముకల సమస్యలు, కంటి చూపు, శారీరక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం పౌర సరఫరాల ద్వారా పేదలకు అందించే బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ 12




వంటి సూక్ష్మ పోషకాలను కలిపి అందిస్తున్నారు.

**రేషన్ దుకాణాలకు ఫోర్టిఫైడ్ బియ్యం..**

ఐకేపీ కేంద్రాల ద్వారా పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్‌కు ఇస్తున్నారు. మర పట్టిన అనంతరం బియ్యంను రైస్ మిల్లుల వారు భారత ఆహార సంస్థ వారికి అప్పగించాల్సి ఉంది. మిల్లుల్లో ప్రత్యేకంగా ఫోర్టిఫైడ్ మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో సూక్ష్మపోషకాలు కలుపుతున్నారు. పౌరసరఫరాలశాఖ వారే ఆయా మిల్లులకు ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ ధాన్యానికి అనుగుణంగా సూక్ష్మపోషకాల బస్తాలను అందిస్తున్నారు. మిల్లుల్లో బస్తాలను ప్యాకింగ్ చేసే సమయంలో బస్తాకు ఒక కిలో సూక్ష్మపోషకాలను కలిపి ప్యాకింగ్ చేసి ఎఫ్‌సీఐకి పంపుతున్నారు. నాణ్యత నియంత్రణ అధికారులు ప్రత్యేకంగా బియ్యం నాణ్యతతో పాటు సూక్ష్మపోషకాల శాతం గుర్తించిన తరువాతే ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. ఈ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలకు అందిస్తున్నారు. బీ మొదట్లో కొందరు బియ్యం రంగుమారి వస్తున్నట్లు గా అపోహలు చెందినప్పటికీ అధికారులు అవగాహన కల్పించడంతో ప్రస్తుతం వాటినే వినియోగిస్తున్నారు.

**పిల్లలకు ఎంతో ఆరోగ్యం-డాక్టర్ జి.అంజయ్య, చిన్నపిల్లల వైద్య నిపుణులు**

సాధారణంగా తినే పాలిష్ బియ్యంలో బలవర్ధకమైన పోషకాలుండవు. అందుకే ప్రభుత్వం ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యంను గంజి వార్చకుండా వండి తింటే చిన్నపిల్లలకు, పెద్దలకు ఎంతో మంచిది. వీలైతే కుక్కర్‌లో వండితే అన్ని విధాలుగా మేలు. వీటిపై ఎలాంటి అపోహలకు లోనుకావొద్దు.

# రైతు వెన్నంటి.. సేవల్లో మేటి

జగిత్యాల : పంటలపై పరిశోధన.. వంగడాల రూపకల్పన.. క్షేత్ర స్థాయి అవగాహన.. ఇలా బహుముఖ సేవలతో జగిత్యాల మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) నాలుగు దశాబ్దాలుగా అన్నదాత సేవలో తరిస్తోంది. 1986 జులై 9న నాటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన పరిశోధన స్థానం నేడు 40వ వసంతంలోకి అడుగు పెడుతోంది.

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో మొదట ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలుండేవి. అనంతరం వరంగల్‌లో ఆర్ఏఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలను చేర్చారు. ప్రస్తుతం పొలాస పరిధిలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మొత్తం 10 జిల్లాల్లో పరిశోధన, విస్తరణ కార్యకలాపాలు సాగుతున్నాయి. 15 జిల్లాలకు ఇక్కడి నుంచే ప్రతి వారం రెండు సార్లు వాతావరణ బులెటిన్లు అందిస్తున్నారు. వ్యవసాయ అధికారులకు నిరంతర శిక్షణ, రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతూ..**

పొలాస పరిధిలో కరీంనగర్, కూనారం, ముథోల్, ఆదిలాబాద్, రుద్రూరులలో పరిశోధన స్థానాలు, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జమ్మికుంట, రుద్రూరు, బెల్లంపల్లిల్లో ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు, పొలాస, జమ్మికుంట, రుద్రూరుల్లో వ్యవసాయ



పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. పొలాసలో డిగ్రీ, పీజీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయి. వరి, నువ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పన, ఇతర పంటల్లో యాజమాన్యం, చీడపీడల నివారణ, నీటిపారుదల, ఎరువుల వాడకంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు.

**సృష్టించిన వంగడాలు**

వరిలో పొలాసప్రభ, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, మానేరు సోన, జగిత్యాల మషూరి, కరీంనగర్ సాంబ, ప్రాణహిత, అంజన, ప్రత్యుమ్న, బతుకమ్మ, జగిత్యాల రైస్-1, జగిత్యాల వరి-2, జగిత్యాల వరి-3 రకాలను విడుదల చేశారు. పసుపులో సుగుణ, సుదర్శన, వేరుశనగలో జేసీఎస్88, జగిత్యాల పల్లి-1, నువ్వుల్లో స్వేతా తిల్, రాజేశ్వరి, హిమ, చందన, జగిత్యాల తిల్-1, జగిత్యాల తిల్-2 రకాలను ఆవిష్కరించారు. రైతులు వరిలో సంకర రకాలపై మక్కువ చూపడంతో జేజీహెచ్131, జేజీహెచ్141 రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. వరి, నువ్వుల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన మరిన్ని కొత్త రకాలు రైతుల క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల్లో ఉన్నాయి.

**దృష్టి సారిస్తే మేలు**

భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మేరకు పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం, న్యూక్లియస్ విత్తన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. పరిశోధన స్థానం ఆవరణలో నిర్మించిన ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించాలి. మొత్తం 34 మంది శాస్త్రవేత్తలకు గాను 13 మంది మాత్రమే పని చేస్తుండగా శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి.హరితగృహం, ఆధునిక ల్యాబ్‌ల ద్వారా వంగడాల రూపకల్పన సమయాన్ని 12-13 సంవత్సరాల నుంచి ఆరేడు సంవత్సరాలకు కుదించాలి.ఆధునిక యంత్రాల తయారీ, సంకర రకం విత్తనాల రూపకల్పన, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల క్షేత్రాలకు చేరేలా విస్తరణ కార్యక్రమాలను అమలు చేస్తే పరిశోధన స్థానం సేవలు మరింత విస్తృతమవుతాయి.

# కబ్జా చేసినా కన్నెత్తి చూడరు

గంగాధర : ఉమ్మడి జిల్లాలో పలువురు వరదకాలువ స్థలాలను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువలు కుంచించుకుపోతున్నాయి. కొందరి నిర్వాకంతో చాలామంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వందలాది గ్రామాల మీదుగా 137 కి.మీ మేర వరదకాలువ విస్తరించి ఉంది. ఇరువైపులా దారులకు వంద మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలిపెట్టగా.. దానిపక్కనే గత ప్రభుత్వం ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. అయితే చాలా గ్రామాల్లో వరదకాలువకు సంబంధించి మట్టి, రాళ్లను అక్రమార్కులు తవ్వుకొని తరలిస్తుండగా.. ఖాళీగా ఏర్పడిన స్థలాలను సమీపంలోని కొందరు తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అంతకుముందే నష్టపరిహారం పొందినవారు సైతం భూములను కబ్జా చేశారు.

**పైపులైన్ల స్థలాన్ని సైతం..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న



సిరిసిల్ల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 60 కి.మీ పొడవునా 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేశారు. ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం చెరువులోకి 11 కి.మీ, అక్కడి నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయంలోకి 25.50 కి.మీ, ఇక్కడి నుంచి 11 కి.మీ దూరంలో ఉన్న కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల్లో పైపులైన్ల పైభాగంలో మట్టి తవ్వి పంటలు సాగు చేస్తున్నారు. కొందరైతే అక్రమ నిర్మాణాలు చేశారు.

**అదనంగా రైతు భరోసా**

కొన్ని చోట్లయితే రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సరిచేయక రైతు భరోసా సాయం కూడా పొందుతున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమించి వరినార్లు పోశారు. కాలువల దారులను దున్ని పంటలు వేస్తుండడంతో అటువైపు అధికారుల వాహనాలే కాకుండా రైతులు తమ ట్రాక్టర్లను తోలుకుపోవడం ఇబ్బందిగా మారింది. దారులు లేక రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో అధికారులకు కొందరు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

# బతుకుల్లోకి.. ముతక మెతుకులు



సూర్యాపేట : వాతావరణ మార్పులు, అనారోగ్య సమస్యలతో జనం ఆహారపు అలవాట్లలో మార్పును కోరుకుంటున్నారు. శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు అందించే తెల్ల బియ్యానికి బదులు బ్రౌన్ రైస్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. పట్టణ ప్రజలకు పోటీగా పల్లెవాసులు కూడా పూర్వకాలపు పద్ధతిలో దంపుడు బియ్యం తినడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా క్రమంగా వారి సంఖ్య పెరుగుతోంది. అందులో ఆరోగ్యానికి బలాన్ని చేకూర్చే పోషకాలుంటాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**ఏటా 60 టన్నుల బియ్యం:** ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు ఏటా సుమారు 60 టన్నుల బ్రౌన్ రైస్ మరాడిస్తారు. ఇందులో మిర్యాలగూడలోని మిల్లర్లు అత్యధికంగా 50 టన్నులు, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని మిల్లర్లు మిగిలిన 10 టన్నులు మిల్లాడిస్తూ ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. స్వయంగా మిల్లుల వద్దకు వెళ్లి వడ్లను మరాడించుకుంటున్న రైతులున్నారు. సూపర్‌మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వారు కూడా ఉంటున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు వాటి స్థాయిలు అదుపులో ఉండేలా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అనారోగ్యానికి గురికావొద్దని భావించి దంపుడు బియ్యం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. వారి ఆహార పట్టికలో ఈ ఆహారాన్ని చేర్చుకున్నారు.

**పోషకాలను దూరం చేసుకుంటున్నాం**

ప్రశాంతి, పోషకాహార నిపుణులు

డబుల్ పాలిష్ బియ్యం మెరుస్తుంటాయి. కానీ వాటితో వండిన అన్నం తినడం వల్ల పోషకాలు దూరమవుతున్నాయని ప్రజలు గ్రహించడం లేదు. దంపుడు బియ్యం తినడం వల్ల శరీరానికి అవసరమైన బీ కాంప్లెక్స్ విటమిన్లు అందుతాయి. బరువు పెరగుదల ఉండదు. అరుగుదల నెమ్మదిగా ఉండటంతో మధుమేహం అదుపులో ఉంటుంది. సేంద్రియ పద్ధతిలో పండించిన ధాన్యాన్ని బ్రౌన్ రైస్‌గా తీసుకుంటే బీ కాంప్లెక్స్ విటమిన్లతో పాటు సూక్ష్మపోషకాలు కూడా అందుతాయి.

**కరోనా సమయం నుంచి తింటున్నారు**

బండారు దయాకర్, రైస్ మిల్ యజమాని,తుంగతుర్తి

కరోనా కాలం నుంచి ఇంటిల్లిపాది బ్రౌన్ రైస్ తినడం ప్రారంభించారు. బియ్యం పట్టించినప్పుడల్లా చాలా తక్కువగా పాలిష్ చేసి పక్కన పెట్టుకుంటున్నారు. పాలిష్ ఎక్కువగా పెట్టడం వల్ల అందులోని పోషకాలు బయటకు వెళ్తాయనే అవగాహన పెరిగింది. ఏటా 30 మంది రైతులు బ్రౌన్ రైస్ పట్టించుకుంటున్నారు.

# పాలేరుకు పోటెత్తిన వరద



కూసుమంచి : పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో పాలేరు ఏరు పొంగి ప్రవహిస్తోంది. 22.15 అడుగులున్న నీటిమట్టం 23.15 అడుగులకు చేరడంతో జలాశయం ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్ల ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. పాలేరు ఏరు, కోమటికుంట వాగు, రాతిబంధం వాగు ద్వారా జలాశయానికి భారీగా వరద చేరుతోంది. రాత్రి 8 గంటలకు 24.25 అడుగులకు నీటిమట్టం చేరింది. అదే సమయంలో వరద చేరిక 18,503 క్యూసెక్కులు ఉంది. గేట్లు, అలుగుల ద్వారా దిగువకు 13,600 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. **మరింత పెరిగే అవకాశం: ఎస్ఈ**

జలాశయానికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు అంచనా వేశారు. వరంగల్, జనగామ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో బుధవారం తెల్లవారుజాము వరకు 25వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందన్నారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు పాలేరు జలాశయానికి చేరుతుండగా, నీటి విడుదల సామర్థ్యాన్ని తగ్గించేందుకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ రవికుమార్, ఈఈ అనన్య, డీఈఈలు మధు, రత్నకుమారి, ఏవో ఆర్.వాణి తదితరులు వరద పరిస్థితిని పరిశీలించారు. ఖమ్మం గ్రామీణం ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్ జలాశయం ఫాలింగ్ గేట్ల వద్ద వరద సరళిని గమనించారు.

**700 ఎకరాల్లో ముంపు: డీఏఓ**భారీ వర్షం, వరదల కారణంగా కూసుమంచి మండలంలో 700 ఎకరాల్లో వరి, పత్తి పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పుల్లయ్య తెలిపారు. కూసుమంచి, నేలపట్ల, తురకగూడెం, నర్సింహులగూడెం, జీళ్లచెర్వు గ్రామాల్లో నీట మునిగిన, కోతకు గురైన పొలాలు, పత్తి క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఏఓ ఆర్.వాణి, ఏఈఓ రవీందర్ పాల్గొన్నారు.

**కూసుమంచిలో కుండపోత**

జిల్లాలోనే అత్యధిక వర్షపాతం 10.3 సెం.మీ.గా నమోదు

కూసుమంచి మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 40 నిమిషాలపాటు ఏకధాటిగా పడింది. ఉరుములు, మెరుపులతో జనం భయాందోళనకు గురయ్యారు. తెల్లారేసరికి వాగులు, పొంగి ప్రవహించాయి. జిల్లాలో అత్యధికంగా కూసుమంచి మండలంలో 10.3 సెం.మీ. వర్షం కురిసింది. కూసుమంచిలోని అతిపెద్ద చెరువు గంగాదేవితోపాటు అన్ని గ్రామాల్లో చెరువులు అలుగు పారాయి. జీళ్లచెర్వులోని చెరువు వీధి, ఎస్సీకాలనీ, కూసుమంచి బీసీ కాలనీలో వరద పోటెత్తి జనజీవనానికి ఇబ్బందిగా మారింది. కూసుమంచి, తురకగూడెం, నర్సింహులగూడెం, కిష్టాపురం ప్రాంతాల్లో అనేక పొలాలు చెరువులను తలపించాయి. పత్తి క్షేత్రాలు నీటమునిగాయి. కొద్ది రోజుల క్రితమే నాటుపెట్టిన వందలాది ఎకరాల్లో వరి మునిపోయింది. కొన్నిచోట్ల ఇసుక మేట వేసింది. గంగాదేవి చెరువు అలుగు పారడంతో కూసుమంచి నుంచి కిష్టాపురం, పోచారం, బీరోలు ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కోమటికుంట వాగుప్రవాహంతో నర్సింహులగూడెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఫాలింగ్ గేట్ల ద్వారా ఏట్లోకి భారీగా వరద నీరు ప్రహించింది.

# సౌర సొబగులు.. స్వీయ అడుగులు

కొత్తగూడెం: ఎన్నటికీ తరగని సౌరశక్తి వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలను సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. నానాటికీ పెరుగుతున్న విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సవాల్‌గా మారుతోంది. ఛార్జీల భారం తడిసి మోపెడవుతోంది. డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ భారాన్ని తగ్గించుకోవటానికి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌరఫలకల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్తు** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు క్యాటగిరీ-2 కింద విద్యుత్తు అందుతోంది. యూనిట్‌కు రూ.6 నుంచి రూ.8వరకు డిస్కంలకు చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక కార్యాలయానికి 5కిలోవాట్ల సౌర ఫలకలు అమర్చితే.. సుమారు రూ.2.50 లక్షల ఖర్చవుతుంది. నెలకొల్పిన సౌర ప్లాంట్ నుంచి ఏడాదికి 7వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఏటా రూ.56వేల ఆదాయం (క్యాటగిరీ-2 కింద యూనిట్‌కు రూ.8 అనుకుంటే) సమకూరుతుంది. ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి సొమ్ము 4-5ఏళ్లలో తీరుతుంది. సౌరఫలకల జీవితకాలం 25ఏళ్లు అనుకుంటే.. 20ఏళ్లపాటు ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా విద్యుత్తు అందించవచ్చు. డిస్కంలకు బిల్లులు చెల్లించాల్సిన



భారం ఉండదు.

**ఇదీ ప్రయోజనం..**

ఉభయ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు 9,307 విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి గ్రామపంచాయతీల వరకు విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. కరెంటు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. సౌర విద్యుత్తు విధానం అమలైతే ప్రభుత్వకార్యాలయాలకు బిల్లుల మోత.. డిస్కంలకు బకాయిల భారం తగ్గనుంది. ఉభయ జిల్లాల్లో 44 మండలాల్లో 1,042 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులను కలెక్టర్లు ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే చేపట్టనున్నాం. సోలార్ విద్యుదుత్పత్తికి అనువైన ప్రాంతాలను గుర్తించి డిస్కం ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.అజయ్‌కుమార్, మేనేజర్ టీజీ రెడ్కో

# సైకిల్ సవారీ.. ప్రకృతి దారి

ఖమ్మం : మానవ తప్పిదాలతో ప్రకృతికి తీవ్ర ముప్పు ఏర్పడింది. విచక్షణారహితంగా చెట్లను నరకటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. వేసవిలో వర్షాలు, వర్షాకాలంలో ఎండలు, శీతాకాలంలో చలి లేకపోవటం ఇప్పుడు ఆశ్చర్యం కలిగించే అంశలయ్యాయి. ఈ నేపథ్యంలో పలువురు వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పోలీసులు, ఔత్సాహిక అధికారులు కలిసి ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఖమ్మం సైక్లింగ్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొలికొండ మహేంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ అధికారి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. ఏడాది క్రితం దీన్ని ప్రారంభించనప్పటికీ ఈ నెల 6న అధికారికంగా రిజిస్టర్ చేయించారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ చేతుల మీదుగా లోగో ఆవిష్కరింపచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఈ క్లబ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో మరింత విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

**చేపడుతున్న కార్యక్రమాలు**

పర్యావరణ పరిరక్షణ, సామాజిక అడవుల ప్రాధాన్యంపై అవగాహన.

పొలాల్లో వరి కయ్యలను కాల్చకుండా రైతులకు వివరించటం.

పెట్రోలు, డీజిల్ అధిక వినియోగంతో వెల్లడయ్యే కర్బన ఉద్గారాల ప్రభావం తెలియజేయటం.ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచేందుకు



విద్యార్థులు, యువతను చైతన్యపరచటం.జాతీయ రహదారుల వెంట తప్పని సరిగా మొక్కలు నాటించటం.నిత్యం కనిష్ఠంగా 30 కి.మీ.

క్లబ్‌లో మొత్తం 15మంది సభ్యులున్నారు. వీరు నిత్యం సైకిళ్లపై వివిధ ప్రాంతాల్లో సవారీ చేస్తుంటారు. రోజుకు కనీసం 30 నుంచి 100 కి.మీ. దూరం ప్రయాణిస్తారు. కొంతమంది ఒక్కోసారి ఏకబిగిన 300 నుంచి 1200 కి.మీ. దూరం ప్రయాణించిన వారు ఉండటం విశేషం. ఇటీవల ఖమ్మం నుంచి పదిమంది సభ్యులు సైకిల్‌పై హైదరాబాద్ వరకు 200 కి.మీ. ప్రయాణించి హైదరాబాద్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభ్యులు గోపి, రామారావు, నాగరాజు.. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, రంపచోడవరం నుంచి లంబసింగి వరకు చేరుకున్నారు. తిరిగి అక్కడి నుంచి నర్సీపట్నం, రాజమండ్రి, విజయవాడ, సూర్యాపేట మీదుగా 1200 కి.మీ. ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నారు.సాధారణ రోజుల్లో సభ్యులు ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా కనీసం 30 నుంచి 100 కి.మీ. వరకు రైడ్ చేస్తుంటారు. ఉదాహరణకు కోటేశ్వరరావు అనే ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వారంలో కొన్నిరోజులు ఖమ్మం నుంచి ఉదయం 6గంటలకు సైకిల్‌పై బయలుదేరి కొత్తగూడేనికి 8.30 గంటలకు చేరుకుంటారు. గంటసేపు విశ్రాంతి అనంతరం కార్యాలయానికి వెళతారు. తిరుగు ప్రయాణం కూడా సైకిల్‌పై ఉంటుంది. సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం అలవడుతుంది. మధుమేహం, బీపీ, ఊబకాయం, మోకాళ్ల నొప్పులు రావు. పెట్రోలు, డీజిలు వాడక కాలుష్యం తగ్గిపోతుంది. మహేంద్రకుమార్, వైద్యుడు

# నిరంతర ప్రక్రియ.. నిరీక్షణకు తెర

కొత్తగూడెం: నిరుపేదల ఏళ్ల నిరీక్షణకు తెరపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అర్హులకు రేషన్‌కార్డులు మంజూరవుతున్నాయి. ఇప్పటికే ఉభయ జిల్లాల్లో 64 వేలకు పైగా కొత్త రేషన్‌కార్డులకు పౌరసరఫరాల శాఖ ఆమోదం తెలిపింది. 'ప్రజాపాలన'తో పాటు ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలిస్తున్న అధికారులు అర్హులను గుర్తిస్తున్నారు. అర్హత కలిగిన వారికి రేషన్‌కార్డులు అందిస్తామని చెబుతున్నారు.

**29,649 మంజూరు పత్రాలు పంపిణీ**

ఖమ్మం జిల్లాలో 19,690, భద్రాద్రి జిల్లాల్లో 9,959 రేషన్‌కార్డులకు సంబంధించి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో కొంతమంది అర్హుల పేర్లు జూన్‌లోనే కీ రిజిస్టర్‌లో నమోదవటంతో మూడు నెలల రేషన్ బియ్యం సైతం పొందారు. జూన్ తర్వాత కీ రిజిస్టర్‌లో చేరిన వారికి సెప్టెంబర్ నుంచి సన్నబియ్యం అందుతుందని అధికారులు స్పష్టం చేశారు. మంజూరు పత్రాలు రానివారు మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లను సంప్రదించవచ్చునని సూచిస్తున్నారు.



**అందనున్న సంక్షేమ పథకాలు**

ఏళ్ల తరబడి నూతన రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోవటంతో అనేక మంది అర్హులు రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ సహాయం, ఇతర సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, గ్యాస్‌బండ రాయితీ తదితరాలకు అర్హతలు ఉన్నా.. రేషన్‌కార్డులు చేతికి అందకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కారు కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు, ఉన్నవాటిలో సభ్యులను చేర్చే కార్యక్రమం చేపట్టడంతో అర్హుల ఆశలకు జీవం పోసినట్లయ్యింది. ఈ ఒక్క ఏడాదిలోనే ఉభయ జిల్లాల్లో 64వేల కొత్త కార్డుల మంజూరుకు ఆమోదం లభించటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నాం. జూన్ తర్వాత కొత్తగా కార్డులు పొందిన వారికి సెప్టెంబరు నుంచి సన్నబియ్యం అందుతుంది. రుక్మిణీదేవి, డీఎస్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

# అభివృద్ధి ఆగి.. ఆదాయం తగ్గి!

రాయదుర్గం: రాయల కాలం నాటి ఆలయాల అభివృద్ధికి గ్రహణం పట్టుకుంది. రాయదుర్గం పరిధిలో ప్రసిద్ధ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన కోనేరు, ప్రహరీ తదితర నిర్మాణ పనులు కొన్నాళ్లుగా ఆగిపోయాయి. నిధులు మంజూరై రెండేళ్లవుతున్నా ఆశించిన మేరకు పనునలు జరగటం లేదని భక్తులు వాపోతున్నారు. దీంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.2.65 కోట్లు మంజూరవగా... దేవాదాయశాఖ నుంచి రూ.1.50 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.4.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటి వరకు 40 శాతమే పూర్తి అయ్యాయి. బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా గుత్తేదారు మిగతా 60 శాతం పనులు చేయలేదని తెలిసింది.

**అసౌకర్యంగా మారి..**

శ్రీ ప్రసన్న వెంకరటేశ్వరస్వామి, జంబుకేశ్వరస్వామి ఆలయాల ఎదుట గతంలో రూ.లక్షలు కేటాయించి నిర్మిస్తున్న దుకాణ సముదాయం పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కంపచెట్లు పెరగడంతో నిత్యం పశువులు సంచరిస్తున్నాయి. పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తే



ఆదాయం పెరుగుతుంది. దాన్ని ఆలయ నిర్వహణకు కేటాయించడానికి వీలుకలుగుతుంది.

జంబుకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.23 లక్షలతో ఆరేళ్ల కిందట భువనేశ్వరి ఆలయాన్ని నిర్మించినప్పటికీ విగ్రహ ప్రతిష్ఠలో జాప్యం ఏర్పడుతోంది. దాతలు ముందుకొచ్చినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఆలయాలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికైనా ఆగిన పనులు పూర్తయ్యేలా పాలకవర్గాలు, అధికారులు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

**పనులు పూర్తయ్యేలా చర్యలు**

గుత్తేదారుతో మాట్లాడి వెంకటేశ్వరస్వామి ఆలయ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం. భువనేశ్వరీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠతోపాటు నిలిచిపోయిన వ్యాపార సముదాయాల పనులు పూర్తి చేయించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. నరసింహారెడ్డి, కార్యనిర్వహణాధికారి

# రైతుల ఇంట.. సిరుల పంట

తాళ్లూరు : గతేడాది వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి, పొగాకుల సాగు గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మరోవైపు దిగుబడులు తక్కువగా రావడం కారణంగా పెట్టుబడులు సైతం దక్కలేదు. ఆ రెండు పంటలకు ప్రత్యామ్నయంగా సాగు చేసేలా ప్రోత్సహించి చైతన్యపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యవసాయాధికారి సూచనలతో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై చైతన్యం కల్పించారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని భూములు, అరకొరగా సాగునీటి వసతి కలిగిన భూముల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు.

**తాళ్లూరు మండలంలోనే ఎక్కువ..**

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలోని దర్శి, సంతనూతలపాడు, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగులో ఉంది. ఈ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 3,120 హెక్టార్లుగా నమోదుకాగా, గతేడాదిలో 2345 హెక్టార్లే సాగైంది. జిల్లాలోకెల్లా తాళ్లూరు ప్రాంత రైతులు ఎక్కువగా మొక్కజొన్న వేశారు. తాళ్లూరు, కేవీపాలెం, శివరాంపురం, కొత్తపాలెం, మాధవరం, తూర్పుగంగవరం, బెల్లంకొండవారిపాలెం, లక్కవరం గ్రామాల రైతులు అయిదువేలకు పైగా ఎకరాల్లో సాగు చేపట్టారు. సాగర్ నీరు విడుదల చేయడంతో ఈ పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

**ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం**

ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తే పంట చేతికొచ్చే సరికి రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. ఈ పాటికే రైతులు సుమారు రూ.పదిహేనువేల వరకు ఖర్చు చేసి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయంటున్నారు. గతేడాది మాదిరిగా కనీస ధరలు దక్కినా రూ.70 వేల వరకు ఫల సాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇలా చూస్తే ఎకరాకు రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారు.

# గూడన్నారు.. గోడు వినలేదు..!

ఎచ్చెర్ల: సొంత ఇళ్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ ధరకు గృహాలు నిర్మించేందుకు 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాజీవ్‌స్వగృహ కార్పొరేషన్ పేరుతో ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురం పంచాయతీలోని కొండపై వంద ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అనమిత్ర టౌన్‌షిప్ పేరిట ప్లాట్లుగా విడదీసి ఇచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా మౌలిక వసతుల కల్పించకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**చీకట్లు.. ఇక్కట్లు..** ఈ టౌన్‌షిప్‌లో రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం లేవు. రాజీవ్‌స్వగృహ అనమిత్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న నివాసితులు ప్రతినెలా కొంత నిధులు వేసుకొని వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు ఛార్జీల చెల్లింపు, మౌలిక సౌకర్యాలతో పాటు ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. తాగునీటి పథకం మూలకు చేరడంతో వ్యక్తిగత బోర్లు వేసుకుని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నివసిస్తున్న వారిని ఎవరూ పట్టించుకోకపోవడంతో హౌస్ మ్యాపింగ్ లేక, ఆధార్, రేషన్, ఇతర గుర్తింపు కార్డులు పొందేందుకు వీలు కావడం లేదు.మురుగునీటి నిర్వహణ ప్లాంట్, డంపింగ్‌యార్డు, ప్రహరీ, గేటు వంటివి ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో రూ.3,500 రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్న ప్రకటనతో జిల్లాలో ఐదు వేలమంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.ఇళ్ల నిర్మాణానికయ్యే ఖర్చులో 25 శాతం దరఖాస్తు దారుడు ముందే చెల్లించి మిగిలింది బ్యాంకు నుంచి రుణంగా పొంది నిర్మాణం పూర్తిచేస్తామని ప్రకటించారు.

ఫేజ్-1లో 50 ఎకరాల్లో 500 ఇళ్లు నిర్మించేందుకు ప్లాట్లు వేయగా 54 మంది మాత్రమే 25 శాతం రుసుం చెల్లించి ఇళ్లు సొంతం చేసుకున్నారు. మరో 135 ఇళ్లు పునాదులు, శ్లాబుల స్థాయిలోనే అసంపూర్తిగా ఉండిపోగా, 322 స్థలాలు ఖాళీగా ఉన్నాయి. 2014లో తెదేపా ప్రభుత్వం వేలం వేసి 175 ఖాళీ స్థలాలు విక్రయించింది. ఇంకా 147 మిగిలాయి. తర్వాత వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. అనమిత్ర టౌన్‌షిప్‌లో సీసీ, బీటీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులు రూ. 13.5 కోట్లతో కొనసాగుతున్నాయి. నవంబర్ నాటికి పూర్తిచేసేలా పనులు చేపడుతున్నాం.

# ఇసుక.. కొరత రానీయక!




ఒంగోలు : జిల్లాలో ఇసుక రేవులు అందుబాటులో లేకపోవడంతో రవాణా ఛార్జీల పేరుతో బయట మార్కెట్ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కాస్త వర్షాలు కురిసి నదుల్లోకి నీరు చేరితే ఇసుక లభ్యత లేకుంటే రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా అధికార యంత్రాంగం ముందస్తు ఇసుక నిల్వలపై దృష్టిసారించింది. జిల్లాలోని అన్ని యార్డుల పరిధిలో రానున్న రెండు నెలల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లాలోని ఇసుక విక్రయాలకు సంబంధించి ఒంగోలులో ఒకటి, గిద్దలూరులో రెండు, మార్కాపురంలో మూడు, యర్రగొండపాలెంలో రెండు, కనిగిరిలో రెండు, దర్శిలో రెండు చోట్ల యార్డులు ఏర్పాటు చేశారు. యార్డుల నిర్వాహకులకు కేటాయించిన మేరకు నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీ నుంచి ఇసుకను తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. తమ వద్దే ఇసుక కొనుగోలు చేయాలని యార్డుల నిర్వాహకులు రాజకీయ నాయకుల అండతో వినియోగదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా ఇసుక బుక్ చేసుకుని తెచ్చుకొనే వెసులుబాటు ఉన్నా బయట నుంచి ఇసుక లారీలను రానీయడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించడంలేదు. టన్నుకు రూ.100 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

ప్రధానంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు. రానున్న కాలంలో ఇసుకకు కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని 12 యార్డుల పరిధిలో 75 వేల నుంచి 85 వేల టన్నుల నిల్వలు ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. జిల్లాలో రోజుకు 600 టన్నుల నుంచి వేయి టన్నుల వినియోగం జరుగుతుంటుంది. చాలా వరకు డిపోల పరిధిలో కొనుగోళ్లు జరిగినా పాలేరు, గుండ్లకమ్మ నదీ పరివాహకాల నుంచి కొంతమేర ఇసుక తీసుకొస్తున్నారు.

**కాలనీ ఇళ్లకు 10 వేల టన్నులు**

జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగేవిధంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 10 వేల టన్నుల ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే గృహనిర్మాణశాఖ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కురిసి ఇసుక లభ్యత తగ్గిన నేపథ్యంలో ముందస్తుగానే తాము నిల్వలు చేసినట్లు భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రజలకు ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

# సర్కారు శాఖలు... వెళ్లారో షాకులు!



ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో పలు ప్రభుత్వ శాఖలు ఉండగాబీ అందులో సగం కార్యాలయాలు ప్రారంభం నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రిమ్స్‌ను కొత్తగా నిర్మించిన భవనంలోకి తరలించారు. దీంతో అప్పట్లో పాత రిమ్స్ సముదాయం ఖాళీ అయింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అద్దెల భారం నుంచి విముక్తి కల్పించేందుకు 2011లో అప్పటి కలెక్టర్ పాత రిమ్స్‌లోని సముదాయంలో 20 ప్రభుత్వ శాఖల నిర్వహణ నిమిత్తం ఆయా విభాగాలకు అనుగుణంగా గదులు కేటాయించారు. కాలక్రమేణా పాత రిమ్స్ పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లోకి నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు సముదాయంలో కార్యాలయాల నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో ఇటీవల రెండు, మూడు శాఖలు నగరంలోని ఇతర అద్దె భవనాల్లోకి తరలించారు.

**అక్కడ కార్యాలయాలు ఇవే...**

ఉద్యానవన, ఉపాధి, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ సబ్ డివిజన్, వైద్య విధాన పరిషత్తు, ఆరోగ్యశ్రీ, మలేరియా, ఆయుష్, హోమియోపతి, సైనిక, నైపుణ్యాభివృద్ధి, నెహ్రూ యువకేంద్రం, పర్యాటక, డివిజనల్ కో-ఆపరేటివ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, విద్య, సంక్షేమ ఇంజినీరింగ్ కార్యాలయాలు, పరిశ్రమలు, డిప్యూటీ డీఈవో, స్టెప్, మైనార్టీ, జిల్లా గురుకుల విద్యాలయాలు, బీసీ స్టడీ సర్కిల్, ఏపీఎంఐడీసీ, ఓపెన్ స్కూల్, వయోజన విద్యాశాఖ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు.

**నిర్వహణ పట్టదా..?**

పాత రిమ్స్ ఆవరణలో ఇప్పటికీ సుమారు 15 కీలకమైన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. మొదట్లో కార్యాలయాల పరిసర ప్రాంతం పరిశుభ్రతతోపాటు మౌలిక వసతుల నిర్వహణ నిమిత్తం నెలవారీ కనీస అద్దెను సంబంధిత వైద్య,ఆరోగ్యశాఖకు చెల్లించాలని నిబంధన పెట్టారు. దీంతో ప్రారంభం సమయంలో కొన్నేళ్లపాటు అద్దె జమ చేశారు. అందుకు సంబంధితశాఖ నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ఖాతాకు జమయ్యేవిధంగా పీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసేవారు. కాలక్రమేణా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్యాలయాల నిర్వహణలో భాగంగా అద్దె చెల్లింపుల నిమిత్తం అప్‌లోడ్ చేసినా బిల్లులు విడుదల కాలేదు. దీంతో జిల్లా అధికార యంత్రాంగానికి కార్యాలయాల నిర్వహణ కష్టంగా మారింది. కార్యాలయాలకు వెళ్లే ఇరువైపులా అంతర్గత రహదారులు గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికి నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పైగా ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పోవడంతో పాటు పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. ఉద్యోగులతోపాటు ప్రజల అవసరాల నిమిత్తం ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో నిరుపయోగంగా మారాయి. కార్యాలయాలకు చెందిన ప్రభుత్వ వాహనాలు సైతం మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టి పోయాయి.

# అక్రమాల 'సదరం'గం!

ఒంగోలు : నకిలీ దివ్యాంగ పత్రాలు ఇచ్చిన వైద్యులపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. నకిలీ సదరం ధ్రువపత్రాలు ఇచ్చిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల నవ్యాంధ్ర వికలాంగుల సేవాసమితి అధ్యక్షుడు షేక్ కాలేషా ముఖ్యమంత్రి కార్యాలయంలో అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర నెల రోజుల్లో చర్యలు తీసుకుని వివరాలు పీజీఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గత వైకాపా ప్రభుత్వంలో సదరం ద్వారా ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం ఇటీవల పునఃపరిశీలన చేపట్టింది. ముందుగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్నవారిలో మంచానికి పరిమితమైన వారిని మినహాయించి మిగిలిన వారి పత్రాలను సదరం ద్వారా పునఃపరిశీలన చేపట్టారు. వీరిలో మొత్తం 4,654 మంది అనర్హులున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. అర్హతలేని వారి పింఛను నిలిపివేతకు చర్యలు తీసుకుంటారని భావించారు. ఇంతలో కొంతమంది తమకు అర్హతలున్నా పింఛను నిలిపి వేతకు నోటీసులు ఇచ్చారని ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అర్హుల పింఛన్లు కూడా తీసేయబోతున్నారని అసత్య ప్రచారం సైతం చేశారు.అప్పీలు చేసుకున్నవారిని తిరిగి సదరం శిబిరానికి



పిలిపించి రెండోసారి స్క్రీనింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వీరిలో 1,062 మంది వృద్ధాప్య పింఛనుకు కూడా అర్హులు కావడంతో ఆ జాబితాలోకి మార్చారు. మరో 3,592 మంది అనర్హుల జాబితాలో ఉన్నారు. మరో నాలుగు రోజుల్లో పునఃపరిశీలన పూర్తికానుంది. గత ప్రభుత్వంలో నాయకుల సిఫార్సు మేరకు ఒక వేలు, ఒక కన్ను వికలత్వం ఉన్నవారికి కూడా వైద్యులు 60 నుంచి 70 శాతం వరకు డిజేబిలిటి నమోదు చేసి పింఛన్లు పొందడానికి వీలు కల్పించారు. రీ అసెస్‌మెంట్ ప్రకారం బోగస్ అని నిర్ధారణ అయిన పింఛన్లపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# సంకల్ప బలం.. కళల సాకారం

తిరుపతి : విత్తనానికి జీవం కల్పించినట్లే కృషితో సంకల్పానికి రూపకల్పన చేయాలి. అప్పుడే కష్టాలెన్ని ఎదురైనా విజయతీరాలు చేరవచ్చంటున్నారు ఈ విద్యార్థినులు. ఊహతెలియని వయసులో తల్లిదండ్రుల్ని కోల్పోయినా ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు ప్రవల్లిక, రేవతి, దీపిక.. కటిక పేదరికంతో తల్లిదండ్రులు తమను చదివించలేక శరణాలయంలో చేర్పించినా.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ పీజీ విద్యనభ్యసిస్తున్నారు జ్యోత్స్న, త్రివేణి. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సంగీతం, నృత్యం, కళల విభాగంలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్న వీరి జీవితంలో ఎన్ని అడ్డంకులెదురైనా నృత్యకారిణులుగా రాణించాలనే సంకల్పంతో సాగుతున్నారు. హైదరాబాదులోని శ్రీసత్యసాయి సేవాసంఘ్ సహకారంతో ప్రాథమికవిద్యను ప్రారంభించి పీజీ స్థాయికి ఎదిగారు. వారు తమ అనుభవాలు పంచుకున్నారు.

**పేదరికం అడ్డు కాకూడదని : జ్యోత్స్న**

మాది శ్రీకాకుళం. అమ్మ గృహిణి. నాన్న చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. పేద కుటుంబం కావడంతో మమ్మల్ని చదివించలేని పరిస్థితిలో తల్లిదండ్రులు శ్రీసత్యసాయి సేవాసంఘ్‌లో చేర్పించారు. ఆసక్తి కొద్దీ నృత్యం కోర్సులో చేరా. కళలు అంటే క్రమశిక్షణ. మనిషి తన జీవితాన్ని ఎలా గడపాలో కళలు మనకు నేర్పిస్తాయి. హైదరాబాదు, తిరుపతిలో



భరతనాట్య ప్రదర్శనలిచ్చా.

**తల్లిదండ్రుల ప్రేమ తెలియదు : రేవతి**

మాది మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు. నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. ప్రాథమిక విద్యనుంచి పీజీ వరకు సత్యసాయి సంస్థ సహకారారంతోనే చదువుతున్నాం. కళలపై ఉన్న ఇష్టంతో ఎంఏ భరతనాట్యం కోర్సులో చేరా. అనేక ప్రదర్శనలిచ్చా. కొంచెం ఆసక్తి ఉంటే కళల్లో రాణించవచ్చు.

**అబ్దుల్ కలాం స్ఫూర్తితో: ప్రవల్లిక**

నాకు రెండేళ్లు ఉండగా ప్రమాదవశాత్తు తల్లిదండ్రులు చనిపోయారు. మేనత్త సహకారంతో సత్యసాయి సేవాసంఘ్‌లో చేరా. సిద్ధిపేటలో ఇంటర్, గుల్బర్గాలో డిగ్రీ భరతనాట్యం కోర్సు చేశా. మహిళా వర్సిటీలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్నా. సంకల్పబలంతో ప్రపంచ ఖ్యాతి సాధించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నాకు స్ఫూర్తి.

**ఆశయాన్ని బలపరచుకోవాలి: త్రివేణి**

మాది శ్రీకాకుళం జిల్లా. అమ్మ గృహిణి, నాన్న ప్రైవేటు ఉద్యోగి. మేం ముగ్గురు సంతానం. పేదరికం కారణంగా నాన్న నన్ను సత్యసాయి సంస్థలో చేర్పించారు. కష్టాలు వస్తుంటాయి పోతుంటాయి. వాటిని తలచుకుని బాధపడితే ఏదీ సాధించలేం. భవిష్యత్తులో గొప్ప నృత్యకళాకారిణి కావాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. చదువుతోపాటు యోగా, కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా.

**మొలకెత్తని విత్తనంగా ఉండకూడదు : దీపిక**

మనలో మనం గమనించని ఎన్నో అద్భుత శక్తులున్నాయి. వాటిని వెలికితీసే ప్రయత్నం చేయనంతకాలం మొలకెత్తని విత్తనంగా ఉండిపోతాం. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. తొమ్మిదేళ్ల వయసులో అమ్మ, 13 ఏళ్ల వయసులో నాన్న చనిపోయారు. ఉన్నత స్థానానికి వెళ్లాలంటే గట్టి ప్రయత్నం చేయాలని చదువుపై దృష్టిపెట్టా. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చా. భవిష్యత్తులో దేశం గర్వించే నృత్యకళాకారిణి కావాలనేదే నా లక్ష్యం.

# పేరు సం'క్షేమం'.. తీరు సం'క్షామం'

ఏలూరు : భీమడోలు మండలం గుండుగొలనులోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆరేళ్ల కిందట శిథిలమై కూలిపోయింది. అప్పట్నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో 65 మంది బాలికలు వసతి పొందుతున్నారు. పాత భవనం ఆవరణలోని అధ్వాన మరుగుదొడ్లే వినియోగిస్తున్నారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపుల్లేవు. కిటికీలకు దోమ తెరల్లేవు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తే.. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముంది. కొన్నిచోట్ల అరకొరగా దుప్పట్లు ఇవ్వగా.. మరికొన్నిచోట్ల అసలు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

**కూటమి పాలనలో ఉపశమనం..**

వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 13 బీసీ బాలుర వసతి గృహాలకు ఒక్కోదానికి రూ.1.50 లక్షలు చొప్పున కేటాయించింది. 52 ఎస్సీ వసతి గృహాలకు 5.75 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు సదుపాయాలు



మెరుగుపరుస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు. ఉంగుటూరు మండలం కైకరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడ శ్లాబు పెచ్చులూడుతోంది. కిటికీలకు తలుపులు, దోమ తెరల్లేవు. జంగారెడ్డిగూడెం బీసీ బాలుర వసతి గృహంలో పరుపులు, దోమ తెరలు చిరిగిపోయాయి. చేతి పంపు పని చేయడం లేదు. ముసునూరు బీసీ బాలుర వసతి గృహం భవనం శ్లాబు పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే చెమ్మగిల్లుతోంది.

# అడగలేవని.. మందులు మరిచారా?

పుట్టపర్తి : రైతుసేవా కేంద్రాల్లో పశువైద్యం గగనమైపోయింది. 2019 నుంచి 2024 మధ్య అధికారంలో ఉన్న వైకాపా... రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని గొప్పలు చెప్పింది. వాటిని నిర్వహించడానికి అవసరమైన నిధుల కేటాయింపు, మందులు అందించాలన్న స్పష్టమైన విధానం రూపొందించలేదు. సిబ్బందిని మాత్రమే కేటాయించి గాలికొదిలేసింది. 2023 నుంచి అరకొర మందులను సరఫరా చేసి బంద్ చేసింది. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.

మడకశిర నియోజకవర్గంలోని 12 పశువైద్యశాలల్లో ఇద్దరు వైద్యులే ఉన్నారు. కానీ 51 రైతు సేవా కేంద్రాల్లో 51 మంది సహాయకులున్నారు. ఏ ఒక్క కేంద్రంలోనూ మందులు లేవు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో వ్యాధులు సోకిన పశువులను రైతులు అక్కడికే వెళ్లి సొంత ఖర్చుతో మందులు తెచ్చుకుంటున్నారు.

**అక్కడ సిబ్బంది కొరత.. ఇక్కడ ఖాళీగా..**

శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో పశువులకు వైద్యం అందించేందుకు మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో 66 ఆసుపత్రులున్నాయి.



15 ప్రాంతీయ పశువైద్య కేంద్రాలు, 23 గ్రామీణ ఉప కేంద్రాలు, హిందూపురంలో ఒక పాలిక్లినిక్ అందుబాటులో ఉన్నాయి. వాటికి ఏడాదిలో రెండు నుంచి మూడుసార్లు మందులు సరఫరా చేస్తున్నారు. కానీ సిబ్బంది కొరత వేధిస్తోంది. పశువులను మండల కేంద్రాలకు తరలించాలంటే రైతులు వ్యయప్రయాస పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ పశు సహాయకులు అందుబాటులో ఉన్నా ఫలితం లేకపోతోంది. ఇక్కడ మందులు అందుబాటులో లేవు.

**సర్దుబాటు చేస్తున్నాం : శుభదాస్, పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ**

రైతు సేవా కేంద్రాలకు మందుల సరఫరా లేనిమాట వాస్తవమే. ప్రభుత్వం పశువైద్యశాలలకు మందులు ఇస్తోంది. అవసరమైన చోట వాటిని సర్దుబాటు చేస్తున్నాం. సిబ్బంది తక్కువ ఉన్నచోట ఆర్ఎస్కేల్లోని సహాయకులు సహకారం అందిస్తారు.

**శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..**

రైతు సేవా కేంద్రాలు: 412
గ్రామ పశు సహాయకులు: 323
ఆవులు: 2.81 లక్షలు
గేదెలు: 96 వేలు
గొర్రెలు: 26.29 లక్షలు
మేకలు: 4.45

# కొండల్లో కొలువుల సాగు

తుని : చుట్టూ పచ్చని కొండల మధ్య ఉన్న ఆ ఊరును చూడగానే ఎంతో ముచ్చట వేస్తుంది. కానీ అభివృద్ధి అంతంతమాత్రమే. నేటికీ బస్సు సౌకర్యం కూడా లేదు. ఆర్థిక, సామాజిక సమస్యలతో ఆ గ్రామస్థులు విసిగిపోయారు. చదువే తమ జీవితాలను మారుస్తుందని గట్టిగా నమ్మారు. పాతికేళ్ల నాటి వారి కల నేడు నిజమైంది. ప్రస్తుతం అక్కడ 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. అదే.. తుని నియోజకవర్గంలోని కేవో మల్లవరం.

**అలా మొదలైంది..**

గ్రామంలో సుమారు 4వేల జనాభా ఉంది. ఏమాత్రం అభివృద్ధి అంతంత మాత్రమే. అందరికీ వ్యవసాయమే ఆధారం. ఆరుతడి పంటలే పండుతాయి. ఆర్థికంగా ఎప్పుడూ సమస్యే. తమ బిడ్డలను బాగా చదివించి, ఉద్యోగులుగా చూడాలని 25 ఏళ్ల క్రితం గ్రామస్థులు సంకల్పించుకున్నారు. సర్కారు కొలువు సాధించేలా చిన్నప్పటి నుంచి ప్రోత్సహించారు. వారి కృషితో 15 ఏళ్ల క్రితం ఓ పదిమంది ఉద్యోగాలు సాధించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారు అదే బాటలో పయనిస్తున్నారు. ఇటీవల 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, మరో ముగ్గురు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఆర్మీ, నేవీ, పోలీసు, రైల్వే, విద్యా, వైద్యశాఖల్లో పనిచేస్తున్నారు.

**కలిసి సాధించాం..**

ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకున్నాం. ఎన్ని కష్టాలొచ్చినా మా లక్ష్యం మరిచిపోలేదు. వివాహమైన తర్వాత కూడా కలిసి సాధన చేశాం. తాజాగా ఇద్దరం ఉపాధ్యాయులుగా ఎంపికయ్యాం.

– ఎన్.నాగేశ్వరరావు, లీలా శివజ్యోతి, దంపతులు

**చిన్నప్పటి నుంచి సాధన..**

చిన్నప్పటి నుంచి స్నేహితులం. క్రీడాకోటాలో కొలువు సాధించాలని నిర్ణయించుకున్నాం. చిన్నప్పటి నుంచి ఆటల్లో పోటీ పడేవాళ్లం. బీ–పీఈడీ చేసి, ఏళ్లుగా సాధన చేస్తున్నాం. ఇప్పుడు పీఈటీలుగా ఎంపికయ్యాం.

– సుర్ల కృష్ణవేణి, చందక శ్రావణి, స్నేహితులు

# స్మార్ట్ చిక్కులు.. పంపిణీకి తిప్పలు

కాకినాడ : స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి చిక్కులు తప్పడం లేదు. పట్టణాల్లో మ్యాపింగ్ సమస్యతో తమకార్డు ఏ దుకాణం పరిధిలో ఉందో తెలుసుకోవడానికి కార్డుదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మూడు, నాలుగు చౌక దుకాణాల పరిధిలోని రేషన్‌కార్డులను ఒక ఎండీయూ ఆపరేటర్‌కు మ్యాపింగ్ చేశారు. ఈ క్రమంలో కొన్నికార్డులు వేర్వేరు దుకాణాలకు మారిపోయాయి. దీని ప్రకారం స్మార్ట్‌కార్డులను కేటాయించారు. దీంతో ఏ డీలరు వద్ద ఉందో తెలుసుకోడానికి నానా ఇక్కట్లు పడుతున్నారు.

**ముందుకు సాగని ప్రక్రియ**ఎక్కడినుంచైనా రేషన్(పోర్టబులిటీ) తీసుకునే విధానం అమల్లో ఉండటంతో కార్డుదారులు సమీపంలోని దుకాణాల నుంచి సరకులు పొందుతున్నారు. స్మార్ట్‌కార్డులు మాత్రం గతంలో మ్యాపింగ్ చేసిన దుకాణాల్లోనే అందుబాటులో ఉంటున్నాయి. అక్కడకు వెళ్లి అడుగుతుంటే డీలర్లు జాబితా ఇస్తున్నారు. వీటిలో పేర్లు లేకపోతే మరిన్ని దుకాణాలు తిరగాల్సి వస్తోంది. కార్డు ఉందో లేదోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 1 నుంచి జిల్లా వ్యాప్తంగా 1,060 చౌక దుకాణాల పరిధిలో పంపిణీ ప్రారంభించారు. జిల్లాకు 6,36,245 స్మార్ట్‌కార్డులు రాగా, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 1,11,563 కార్డులు అంటే 18 శాతం పంపిణీ చేశారు. గొల్లప్రోలు మండలంలో 0.06 శాతం, పిఠాపురంలో 1.99 శాతం, గండేపల్లిలో 5.17 శాతం, యు.కొత్తపల్లి మండలంలో 6.92 శాతం మాత్రమే పంపిణీ జరిగింది. పిఠాపురం నియోజకవర్గానికి పౌరసరఫరాల ఉప తహసీల్దారు లేకపోవడం దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. సామర్లకోట, తుని, కరప, జగ్గంపేటలో 35 నుంచి 38 శాతం మందికి అందించారు.

**త్వరగా అందించేలా చర్యలు**స్మార్ట్‌రేషన్‌కార్డు ఏ చౌకదుకాణం పరిధిలో ఉందో ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

# కొలువుల వేటకు కొత్త పుస్తకాలేవీ?



అనంతపురం : పోటీ పరీక్షల్లో రాణించాలంటే వర్తమాన అంశాలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జనరల్ నాలెడ్జి, జనరల్ స్టడీస్, కరంట్ అఫైర్స్, వివిధ సబ్జెక్టు పుస్తకాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన పుస్తకాలు అవసరమే. అప్పుడే పోటీ పరీక్షల్లో గట్టెక్కి ఉద్యోగం సాధించగలుతారు. పౌరగ్రంథాలయాల్లో కూడా పోటీ పరీక్షల విభాగాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పరీక్షలకు సరిపడే పుస్తకాలు కరవయ్యాయి. పాత పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయడంతో గ్రంథాలయ శాఖ కేవలం డీఎస్సీ పరీక్షలకు మార్కెట్‌లో దొరికే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచారు. డీఎస్సీకి పోటీ ఎక్కువగా ఉన్నందున అభ్యర్థులు కోచింగ్ బాటపట్టారు.

**త్వరలో రానున్న ప్రకటనలు..!**

అటవీశాఖలో సెక్షన్ ఆఫీసరు, ఎల్ఐసీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఏఏఓ, ఏఈ పోస్టులకు ప్రకటన ఇప్పటికే విడుదలైంది. బ్యాంకింగ్, దేవాదాయశాఖ, గ్రంథాలయ సంస్థల్లో వివిధ కేడర్ల ఉద్యోగాలు ప్రకటనలు రానున్నాయి. ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–2 ఉద్యోగాలు కూడా భర్తీ చేయనున్నారు. మెగా డీఎస్సీ ముగిసిన తరువాత టెట్, మార్చి లోపు మరోసారి డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఆయా ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో లేకపోవడం దారుణం. పౌరగ్రంథాలయాలు అంటేనే పురాతన గ్రంథాలు, నవలలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు మాత్రమే గుర్తుకొస్తాయి. పాతపుస్తకాలు, పత్రికలు మాత్రమే కనిపిస్తాయి. నేటి యువత ఉద్యోగాలు సాధించడానికి కొత్త పుస్తకాలను అందుబాటులో ఉంచాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

**పార్కుల బాటలో ..**పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యత ఉంటే అవి ఉద్యోగార్థులతో కళకళలాడేవి. ఆపరిస్థితి లేక ఎక్కువ శాతం గ్రంథాలయాలపై ఆసక్తి చూపడం లేదు. ఉద్యానవనాలు, రీడింగ్ హాళ్లకు వెళ్లి సొంతంగా కొనుగోలు చేసిన పుస్తకాలతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొత్త పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నా ఒకటి, రెండు మాత్రమే ఉంటాయి. ఒకరిద్దరికే అవి సరిపోతాయి. గ్రంథాలయానికి వెళ్లినా పుస్తకాలు దొరక్క వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి. సమయం వృథా కూడా. అక్కడికి వెళ్లే అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది. పేద విద్యార్థులు, పుస్తకాలు కొనలేని స్థితిలో ఉన్న వారు గ్రంథాలయాలకు వెళ్తున్నారు. **పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం**డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తెచ్చాం. పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు కూడా సాధించారు. రాబోయే ఉద్యోగ ప్రకటనలకు అనుగుణంగా అవసరమైన కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. రమ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

# నారీమణుల సేవాపథం




తాడిపత్రి : మహిళలంతా ఏదో కొంత తమకు చేతనైనంత సాయం అభాగ్యులకు చేయాలనుకున్నారు. కొందరుగృహిణులు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి పనులతో జీవనం సాగించేవారంతా ఏడాదిన్నర కిందట 'ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్' అనే సంస్థను ప్రారంభించి ఆపదలో ఉన్న వారికి ఆర్థికసాయం, వారికి అవసరమైనవి అందిస్తూ ఆదర్శంగా నిలిచారు.

**ఆలోచన మొదలైందిలా..**

తాడిపత్రికి చెందిన నాగరాగిణి, మరో ముగ్గురు మహిళలతో కలిసి 2024లో 'ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థను ప్రారంభించారు. మొదట నలుగురు చందాలు వేసుకుని ఆపదలో ఉన్న వారికి సాయం అందించారు. దీన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసేవారు. తర్వాత సంస్థ పట్ల స్ఫూర్తి పొంది 195 మంది మహిళలు సభ్యులుగా చేరి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు వైద్యులు, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేకపోయినా, చదువుకు సాగించడానికి ఇబ్బందులున్న వారి వివరాలను తమ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేస్తారు. అనంతరం సభ్యులంతా కలిసి చందాలు వేసుకుని ఆ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటారు. ఒకటిన్నర సంవత్సరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురితో మన్ననలు అందుకోవడం విశేషం.

**సభ్యుల సామాజిక సేవలు**

తాడిపత్రిలోని సౌభాగ్య అనాథ ఆశ్రమంలో ఉన్న విద్యార్థులకు పాఠశాల దూరంగా ఉంటంతో నడిచి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని గుర్తించి రూ.30వేలు విలువ చేసే 6 సైకిళ్లను అందజేశారు.

కడప రోడ్డులో సౌజన్య అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో తమ కుమారులను చదివించకోలేక ఇబ్బంది పడుతోందని గుర్తించి రూ.20వేలు, అలాగే సంజీవనగర్‌కు చెందిన నూరి అనే మహిళ కుమారుడికి రూ.20వేలు పాఠశాల ఫీజు కట్టి చదువుకునేందుకు ఆసరా కల్పించారు.

తాడిపత్రిలోని పలు కాలనీల్లో దివ్యాంగులకు 10 మూడు చక్రాల సైకిళ్లను అందించారు. తరచూ ఆలయాల వద్ద ఉన్న యాచకులకు అన్నదానం చేస్తుంటారు.

హైదరాబాద్‌కు చెందిన హర్షిత అనే మహిళా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునేందుకు అవస్థలు పడుతోందని గుర్తించారు. ఆమెకు ఔషధాల కోసమని రూ.17 వేలు అందించారు.

స్నేహితుల సహకారంతో సత్కార్యం : నాగరాగిణి, ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకురాలు

ఆపదలో ఉన్నవారికి తమ వంతు సాయం అందించాలని స్నేహితులతో కలిసి చర్చించా. దీనికి వారొప్పుకొని ముందుకొచ్చారు. ప్రస్తుతం ఎక్కడ ఆపదని తెలియగానే అందరం కలిసి తమ వంతుసాయం అందిస్తున్నాం. ఇంకా సంస్థను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు ఎక్కువగా సాయం చేస్తాం.

# తక్కువ ధరకే మందు బిళ్లలు

అనంతపురం : పేద, మధ్య తరగతి కుటుంబాలకు తక్కువ ధరలోనే మందులు అందుబాటులో ఉంచేందుకు మండలానికో జనరిక్ ఔషధ దుకాణాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వాలని వెల్లడించారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తైన వారితో దరఖాస్తులు ఆహ్వానించాలని నిర్ణయించారు. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి.

రక్తపోటు, చక్కెర వ్యాధి, గ్యాస్ట్రిక్ వంటి రుగ్మతలతో 80 శాతం మంది నిత్యం ఏదోక ఔషధం వాడుతున్నారు. కొన్ని కుటుంబాలు మందుల కొనుగోలు చేసేందుకు ప్రతి నెలా రూ.వేలు ఖర్చు చేస్తున్నారు.

రక్తపోటు, చక్కెర వ్యాధులకు సంబంధించి పలు కంపెనీలకు చెందిన పది మాత్రలు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాలంటే వాటి ధర రూ.100 నుంచి రూ.130 ఉండగా జనరిక్‌లో రూ.20 నుంచి 30కే లభ్యమవుతాయి.

ఫార్మసీ చదువుకున్న యువత ఒక దుకాణం ఏర్పాటుకు రూ.8 లక్షల వరకు రుణం, అందులో రూ.4 లక్షలు వరకూ రాయితీ కల్పించాలని నిర్ణయించారు.దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది,

**ఉమ్మడి జిల్లాలో 26..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 26 జనరిక్ కేంద్రాలున్నాయి. అనంతపురంలో ఐదు, పెద్దవడుగూరు 1, బొమ్మనహాళ్ 1, గుంతకల్లు



2, కళ్యాణదుర్గం 2, పామిడి 1, రాయదుర్గం 1, హిందూపురం 4, కదిరి 2, మడకశిర 1, పెనుకొండ 1, పుట్టపర్తి 2, రొళ్ల 1 ఉన్నాయి. వీటిని సీనియర్ సిటిజన్లు, మహిళా సమాఖ్య సభ్యులు, అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు నిర్వహిస్తుండగా మరికొన్ని వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నారు. త్వరలోనే నూతనంగా జనరిక్ దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

# దశాబ్దాలుగా అదే వరస

చీమకుర్తి : ఇటీవల రూపుదిద్దుకున్న ఎన్నో రహదారులకు జాతీయ హోదా దక్కినా..ఒంగోలు – కర్నూలు రహదారికి ఆ మహా భాగ్యం దరిచేరడం లేదు. ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నా నేటికీ ఎలాంటి ఫలితం లేదు. దీంతో ఈ ఛిద్ర రహదారిపై అష్టకష్టాలు పడుతూ జిల్లావాసుల ప్రయాణం సాగుతోంది. ఒంగోలు – కర్నూలు రోడ్డుకు జాతీయ హోదా అన్నది దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. పశ్చిమ ప్రకాశంలో పలు రోడ్లు జాతీయ రహదారులుగా మారుతూ నాలుగు వరసలుగా విరాజిల్లుతుంటే ఎంతో ప్రాముఖ్యమున్న ఈ రోడ్డును మాత్రం ఆ జాబితాలో చేర్చడం లేదు. ఒంగోలు నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఉన్న 107 కిలోమీటర్ల రోడ్డుకు జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. అయితే ఒంగోలు – చీమకుర్తి మధ్య 21 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే కారులో సైతం నలభై నిమిషాలు



పడుతుందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందరో ప్రాతినిధ్యం..:** ఒంగోలు నుంచి చీమకుర్తి మండలం వరకూ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా జాతీయ హోదా మాత్రం నేటికీ కలగానే మిగిలింది. అదేవిధంగా సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు సైతం నిత్యం ఆపసోపాలు పడుతూ జిల్లాకేంద్రానికి వస్తుంటారు. వీరేకాక ఒంగోలు నుంచి రాయలసీమ, పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మారి సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయి. ఒంగోలు – పొదిలి మధ్య శిథిల రహదారిలో ప్రయాణిస్తూ ఏడాదికి కనీసం 25 మంది వరకూ మృత్యువాత పడుతున్నారు. ఇక క్షతగాత్రుల సంఖ్యకు అయితే లెక్కేలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు హోదా కల్పించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆశల అలలు తీరం చేరేనా!

జిల్లా అభివృద్ధిలో మరో మణిహారం చేరనుంది.. తూర్పు తీరంలో పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద మరో గొప్ప మత్స్య ఓడరేవు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న మత్స్యకారులకు ఉపాధి దక్కనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ తరహాలో పూర్తిస్థాయి 'ఫిషింగ్ హార్బర్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వేలాది మంది మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. వేటకు వెళ్లే వీరంతా తమ బోట్లను తీరానికి చేర్చాలన్నా, చేపలను నిల్వ చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నా ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కొన్నాళ్లుగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చింతపల్లి వద్ద ఆరు ఎకరాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపినా.. అయిదేళ్లూ నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్య ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తూ వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ ప్రణాళికను తెరపైకి తెచ్చింది. దీని ఏర్పాటుకు తీర ప్రాంతంలో 22 ఎకరాల స్థల సేకరణకు యోచిస్తున్నారు. సెంట్రల్ కోస్టల్ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.



జిల్లాలో వేటాడిన మత్స్య సంపద వాహనాలతో విశాఖ హార్బర్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో రవాణా ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. హార్బర్ ఏర్పాటైతే మత్స్యకారులు హార్బర్‌లోనే చేపలు విక్రయించవచ్చు. ఇతర రాష్ట్రాలకూ తరలించొచ్చు. మరోవైపు పర్యాటకంగానూ జిల్లా అభివృద్ధి చెందుతుంది. బహుముఖ లాభదాయక మత్స్య కేంద్రంగా నిలుస్తుందని ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి...**

సముద్ర తీరం : 29 కి.మీ
పంచాయతీలు : 16
మత్స్యకార జనాభా : 27వేలు
వేటపై ఆధారపడిన
కుటుంబాలు : 6 వేలు
జిల్లాలో మోటరైజ్డ్ బోట్లు: 714
చింతపల్లిలో మోటరైజ్డ్: 487
సంప్రదాయ వేట పడవలు: 361

ఇవీ ప్రయోజనాలు..

రోడ్ల వసతులు మెరుగవుతాయి
కోల్డ్ స్టోరేజీలతో వ్యర్థాలు తగ్గుతాయి.
మత్స్య ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వస్తుంది.
ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.
పరిశ్రమలు ఏర్పాటవుతాయి.
పర్యాటక రంగానికి ఊతం వస్తుంది.
అభివృద్ధి హబ్‌గా మారుతుంది.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం..

–శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో మత్స్యశాఖ

తపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు వర్చువల్‌గా ప్రారంభమైనా గత ప్రభుత్వం పూర్తిచేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు 22 ఎకరాలు అవసరం. ఇటీవల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కోస్టల్ ఇంజినీరింగ్ ఆఫ్ ఫిషరీస్ అధికారులు ఈ ప్రాంతంలో స్థలానికి పరిశీలించి నివేదికను పంపించారు. అనుమతులు రాగానే స్థల సేకరణ పనులు చేపడతాం.

చురకలు



# నాడు రూ.40 కోట్లు.. నేడు రూ.29 కోట్లే

శ్రీకాళహస్తి: ఎక్కడైనా రోజులు గడిచే కొద్ది నిర్మాణ వ్యయం పెరగడం సర్వసాధారణం. కాని శ్రీకాళహస్తి విషయానికి వస్తే వైకాపా హయాంలో రూ.40 కోట్లతో అంచనాలు సిద్ధం చేసిన రోడ్డు పనులను కూటమి ప్రభుత్వం రూ.29 కోట్లతోనే చేపడుతుండటం విశేషం. ఏడాది గడిచాక పనులు ప్రారంభించినా ఏకమొత్తంగా రూ.11 కోట్లు వ్యత్యాసం ఉండటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. శ్రీ శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జలవినాయకుని ఆలయం వద్ద ఉన్న వంతెన నుంచి బైపాస్ వంతెనను కలుపుతూ 'శివం టు శివం' రోడ్డు ఏర్పాటు చేయాలని తెదేపా హయాంలో అప్పటి ట్రస్టు బోర్డు తీర్మానం చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లు ఈ రోడ్డు ఏర్పాటుపై హామీలిస్తూ వచ్చింది. ఎన్నికలకు ముందు టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసింది.

**రూ.11 కోట్ల వ్యత్యాసం..:** సన్నిధివీధిలోని జల వినాయకుని ఆలయం నుంచి సువర్ణముఖి నదిని ఆనుకుని కుడి వైపు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. 2.75 కిలోమీటర్లు పొడవు ఉన్న ఈ పనులకు వైకాపా హయాంలో రూ.40 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. దీనిపై తెదేపా అప్పుడే అభ్యంతరం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే పనులను రూ.29 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు



నిర్వహించి పనులు ప్రారంభించారు. పనుల నిర్వహణలో ఇంత వ్యత్యాసం ఎందుకన్నది ఇప్పటికీ చర్చనీయాంశమే.

**రోడ్డుతో.. సౌలభ్యాలు అనేకం..:** శివం టు శివం రోడ్డు పనులతో ఎన్నో సౌలభ్యాలు చేకూరనున్నాయి. ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడనున్నారు. అంతేకాకుండా ఆలయానికి వచ్చే భక్తులు పట్టణంలోకి ప్రవేశించకుండానే నేరుగా ఆలయానికి రావడం, దర్శనం పూర్తయ్యాక మళ్లీ ప్రధాన రహదారుల్లో కలిసే విధంగా పనులు చేపడుతున్నారు. అలాగే పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో విశేష ఉత్సవాలు, భారీ కార్యక్రమాల నిర్వహణ సమయంలో ట్రాఫిక్ మళ్లింపు సులభతరంగా ఉండే అవకాశముంది. సువర్ణముఖి నదీ అదనపు జలాలు చెంబేడు కాల్వకు మళ్లింపు చేసే ప్రదేశంలో కాంక్రీటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇన్ని ప్రయోజనాలు కలిగిన శివం టు శివం రోడ్డును మరింత పకడ్బందీగా, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పనులు చేపడుతున్నట్లు పాలకులు, అధికారులు చెబుతున్నారు.

# మత్తు మాయలో.. మృత్యు మార్గంలో

విజయనగరం : గతేడాది పెద్దచెరువు రోడ్డులో 19 ఏళ్ల యువకుడు, 15 ఏళ్ల బాలుడు డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. మార్గమధ్యలో ఇద్దరూ మద్యం తాగి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారం తరువాత పూల్‌బాగ్ కాలనీ సమీపంలో 17 ఏళ్ల బాలుడు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి తాటి చెట్ల మధ్యలోకి దూరి ప్రాణాలు కోల్పోయాడు. మత్తు కారణంగా ఈ ఘటన జరిగినట్లు తేల్చారు. బొండపల్లి రోడ్డులో 32 ఏళ్ల యువకుడు బైక్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పూటుగా మద్యం తాగిన అతడిని వైద్యులు కాపాడలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మద్యం, గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతున్నట్లు ఇటీవల పోలీసులు తెలిపారు. మృతుల్లో 15 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారని గుర్తించారు. నేరుగా ముందున్న వాహనాలు, చెట్లు, డివైడర్లను ఢీకొనడమో లేదా ఇతర ప్రయాణికులను క్షతగాత్రులుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని దాడులు చేస్తున్నా రోజురోజుకూ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**తరచూ ప్రమాదాలు..** రెండు జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 25 శాతం వరకు మత్తులో ఉన్నవారి వల్లే చోటుచేసుకుంటున్నాయని పోలీసుశాఖ పేర్కొంటోంది. కొందరు గంజాయి, మద్యం తాగిన తరువాత శిరస్త్రాణాలు సైతం ధరించడం లేదని, ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇతర ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నట్లు గుర్తించింది. ఈ ఏడాది 255 ప్రమాదాల్లో 62 మంది మృతిచెందారు.

**అందుబాటులో కేంద్రాలు..**

తాగుడుకు దూరం కావాలనుకునే వారికి మహారాజా ప్రభుత్వాసుపత్రి, పార్వతీపురంలోని జిల్లా వైద్యాలయాల్లోని మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఒక్కోచోట పది పడకల చొప్పున అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, కౌన్సెలర్లు, ఇతర సిబ్బందిని నియమించారు. బాధితుడితో పాటు అవసరం మేరకు అతడి కుటుంబ సభ్యులకు సైతం కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 758 మంది చికిత్స పొందారు.

**భారీగా జరిమానాలు..**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినా, బహిరంగ, నిషేధిత ప్రాంతాల్లో తాగినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కోర్టులకు తరలిస్తుండడంతో రూ.10 వేల చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది 366 మందికి రూ.36.60 లక్షల జరిమానా పడింది. ఇటీవల నగరానికి చెందిన 10 మంది రూ.1.60 లక్షలు చెల్లించారు. వీరంతా 15 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

**మెదడుపై ప్రభావం..**

'మద్యం తాగి వాహనం నడపడం గుండెకు మంచిది కాదు. మెదడుపై నేరుగా ప్రభావం పడుతుంది. ఈక్రమంలో పట్టు కోల్పోతారు. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ఒకవేళ మద్యానికి బానిసైతే వైద్యులను సంప్రదించాలి' అని ప్రముఖ జనరల్ ఫిజీషియన్, ఎన్‌సీడీ సెల్ వైద్యుడు డా.మురళీకృష్ణ చెప్పారు. మందుబాబుల విషయంలో రాజీ పడడం లేదని, పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# పంథా మారిన పరీక్ష



అనంతపురం : పాఠశాలల్లో నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చింది. దీంతో పరీక్షల పంథా మారింది. కొత్త విధానంతో సోమవారం నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ప్రశ్న, సమాధాన ప్రతాలు గతానికి భిన్నంగా రూపకల్పన జరిగింది. ప్రశ్నలు నేరుగా అడగకుండా మెలిక పద్ధతిలో ఉన్నాయి. సమాధానాలకు పత్రాలు కాకుండా ప్రత్యేక పుస్తకాన్నే తయారు చేశారు. కొత్త విధానంతో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. నూతన విధానంలో సత్ఫలితాల సాధనకు విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనప్పుడే సాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏడాదంతా ఒకే పుస్తకంలో..**

కొత్త పద్ధతిలో ఒకే పుస్తకంలోనే ఏడాదిలో జరిగే పరీక్షలన్నీ రాయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి విధిగా హాజరవ్వాలి. సమాధాన పత్రాల్లో ఎక్కడా కొట్టివేతలు ఉండకూడదు. పరీక్ష పత్రాలను దిద్దాక పక్కన పడేయకుండా భద్రపరిచే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. విద్యార్థులు సాధించిన మార్కులను నమోదు చేస్తారు. మొదటి, తర్వాత పరీక్ష ఫలితాన్ని బట్టి బోధనలో నాణ్యత, విద్యార్థి సామర్థ్యాల అంచనాకు సులువు అవుతుంది. బోధన ప్రశ్నలకు పాఠ్యాంశాలపై భిన్న కోణాల్లో విశ్లేషించే లోతైన అవగాహన ఉంటేనే సమాధానానికి సులువవుతుంది. దీంతో అందరూ ఒకేరకమైన సమాధానానికి అవకాశం లేదు. తద్వారా మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది. ఫలితంగా సామర్థ్యం కలిగిన పిల్లల ప్రత్యేకత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించేందుకు దోహదపడుతుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం పాఠశాలలు: 3,855

విద్యార్థులు: 3,60,000

**తార్కిక విధానాన్ని పెంచేలా బోధన**

– ధనుంజయ, గణిత ఉపాధ్యాయుడు, కదిరి

కొత్త పద్ధతి పరీక్షల్లో ఫలితాలకు పాఠ్యాంశాలను విద్యార్థి ఆకళింపు చేసుకునేలా బోధన జరగాలి. తార్కిక విధానాన్ని పెంపొందించేలా పిల్లలను తయారు చేయాలి. విద్యార్థి భిన్నకోణాల్లో తనను తాను ప్రశ్నించుకోవటంతో ఉత్పన్నమయ్యే కొత్త ఆలోచనలు పరిష్కారం దిశగా సాగుతాయి. తద్వారా బట్టీ విధానానికి చెల్లుచీటీ పడుతుంది. స్వీయ సామర్థ్యాలతో ఫలితాల సాధన సులువవుతుంది.

# పన్నుల సొమ్ము.. గుత్తేదారుల పాలు




హిందూపురం: ప్రజలను నుంచి వసూలు చేసే పన్నుల సొమ్మును స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు గుత్తేదారుల పరం చేస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనుల నాణ్యత మాట దేవుడెరుగు... కనీసం టెండర్లు పిలవడం, పనుల కేటాయింపుల్లోనూ నిబంధనలు పాటించలేదు. ఇష్టారాజ్యంగా నిర్వహణ పేరుతో ఖర్చు పెట్టేశారు. గతంలో జరిగిన తప్పిదాలను కూటమి ప్రభుత్వంలోనూ సరిదిద్దకపోగా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. ఆడిటింగ్ చేసే అధికారులు చెప్పే అభ్యంతరాలను బేఖాతరు చేస్తున్నారు. చివరకు కాగ్ అధికారులు చేసే ఆడిటింగ్‌లో తప్పిదాలు బయట పడుతున్నాయి. సరిదిద్దుకోవాలని కాగ్ చెబుతున్నా లెక్క చేయడం లేదు.

**అడుగడుగునా ఉల్లంఘనలే..**

ఏదైనా పనికి టెండర్ పిలిచినప్పుడు ఒక్క గుత్తేదారు మాత్రమే దాఖలు చేస్తే అతను చివరకు లెస్‌కు టెండర్ వేసినా ఆమోదించరాదు. హిందూపురం పురపాలికలో గుత్తేదారు పని విలువకు ఎక్సెస్‌గా 4.99 శాతం వేస్తున్నా వాటిని ఆమోదించి పనులు కట్టబెడుతున్నారు. వైకాపా హయాంలో ప్రతి పనికి అధిక టెండర్ వేయడం రివాజుగా సాగింది. గొల్లపల్లి తాగునీటి పథకం నిర్వహణ పేరుతో పెద్ద ఎత్తున నిధులను ఖర్చు పెట్టారు. ఇటీవల హిందూపురంలో మినీ డంపింగ్ యార్డుల చుట్టూ ప్రహరీ నిర్మాణాలకు ఒక గుత్తేదారు ముందుకు వచ్చినా పనులు కట్టబెట్టారు. ఒకే రకమైన పనులను విభజించరాదు. పని విలువ ఎక్కువ అయితే ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాల్సి వస్తుందని స్థానిక ఇంజినీరింగ్ అధికారులు ఒకే పనిని విభజిస్తున్నారు. హిందూపురంలో ఇటీవల తాగునీటి సరఫరాకు సంబంధించి దాదాపు రూ.5 కోట్లు విలువైన పనులకు టెండర్లు పిలిచారు. అన్ని నీటి సరఫరాకు సంబంధించినవే అయినా 33 పనులుగా విభజించడం గమనార్హం.

**క్షుణ్ణంగా పరిశీలించాకే ఆమోదం**

–మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్

పనుల్లో నాణ్యత ఉండాలని, నిబంధనలు పాటించేలా చూడాలని ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పనులను చేయవద్దని సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. గత అధికారుల హయాంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని సూచించా. ప్రతి టెండర్, బిల్లును క్షుణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ ఆడిటింగ్ విభాగ అధికారికి ఆదేశాలు ఇచ్చాం.

# ఇంటిని మరపించే వసతి లోగిలి



అనంతపురం : వసతి గృహాలు అనగానే పాడుబడిన భవనాలు, రంగులు వెలసిన గోడలు, వేలాడుతున్న తీగలు, మరుగుదొడ్లు లేక పాట్లు.. ఇలా ఎన్నో అసౌకర్యాల నిలయాలు. ఐదేళ్ల వైకాపా హయాంలో నాడు-నేడుతో సౌకర్యాలు కల్పిస్తామని ఆర్భాటం చేసి కనీసం మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ కూడా అందివ్వని దయనీయ స్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టి ఇంటిని మురిపించే విధంగా సౌకర్యాలు కల్పించారు. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి.

**రూ.9.25 కోట్లతో పనులు**

వసతి గృహాల్లో విద్య మౌలిక సదుపాయల కల్పన ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించి మొదట అత్యవసరం అయిన పనులను గుర్తించారు. అనంతపురం జిల్లాలోని 62 సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రూ.9.25 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. మరుగుదొడ్లు నిర్మాణం, రంగులు, వైరింగ్, స్లాబు మరమ్మతులు, షెడ్లు, మురుగు వ్యవస్థ, తాగునీరు, తలుపులు, కిటికీలు తదితర సౌకర్యాలు కల్పించి ఆహ్లాదంగా మార్చారు. బీసీ, సాంఘిక సంక్షేమంలో 106 ఉంటే 86 వసతి గృహాల్లో ప్రవేశాలు పెరిగాయి.

**ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది..**

అనంతపురంలోని సాంఘిక సంక్షేమ నంబరు-2 వసతి గృహాల్లో గత సంవత్సరం 121 మంది ఉండగా ఈ సంవత్సరం 147 మంది ప్రవేశాలు పొందారు. నంబరు-4వసతి గృహంలో గత సంవత్సరం 104 మంది ప్రవేశాలు పొందితే ఈ సంవత్సరం 132 మంది చేరారు. ఈ రెండు వసతి గృహాల్లో రూ.38.50 లక్షలతో పలు రకాల సౌకర్యాలు కల్పించి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు.

**మూడింట్లోనే 182 మంది**

అనంతపురంలోని గిల్డ్ ఆఫ్ సర్వీసు బాలికల వసతి గృహ ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల, బీసీ సంక్షేమ పాఠశాల వసతిగృహాలు ఉన్నాయి. మూడు వసతి గృహాల్లో రూ.40 లక్షల వరకు వెచ్చించి పలు సౌకర్యాలు బాలికలకు కల్పించారు. గత సంవత్సరం కంటే 182 మంది అధికంగా చేరారు. మూడు వసతి గృహాల్లో సీట్లు కావాలని ఒత్తిడి పెరగడంతో ప్రవేశాలు లేవని బోర్డులు ఏర్పాటు చేశారు.

# అక్రమార్కుల 'పాక'పాచిక

విశాఖపట్నం : విశాఖలో కబ్జాలకు సరికొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ తరహా భూ దందాకు బీజం పడింది. 13వ వార్డు దారపాలెం, ఫైనాపిల్ కాలనీ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయి. సర్వే నెంబరు 15/12 లో ఉన్న 3.07 ఎకరాల్లో గత ఐదేళ్లలో రూ.కోట్ల విలువైన ఎకరా భూమిపైగా కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇదే తరహా కబ్జాలకు అడుగులు వేస్తున్నారు. ఇటీవల యోగాంధ్ర నిర్వహణలో అధికారులు నిమగ్నమైన వేళ కొన్ని నిర్మాణాలు ఆగమేఘాలపై పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

**నాయకులు, రౌడీషీటర్లదే హవా:** పోరంబోకు స్థలంలో మొదట పశువుల కోసం ఎండుగడ్డి వేసి, అక్కడే వాటిని కట్టేస్తారు. కొన్ని రోజుల తర్వాత పశువుల రక్షణ పేరుతో పాకలు వేస్తారు. ఆ స్థలం ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి చక్రం తిప్పుతున్నారన్న విమర్శలున్నాయి. ఆపై జీవీఎంసీ సిబ్బందితో లాలూచీ పడి పన్ను వేయించడం, ఆపై విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. తరువాత కొన్ని రోజులకే రక్షణ గోడ నిర్మాణం చేపడతారు. ఎవరైనా ప్రశ్నిస్తే బీఆర్టీఎస్ రహదారిలో స్థలం



పోగొట్టుకున్నామని, ప్రతిగా ఇక్కడ స్థలం ఇచ్చారంటూ చెప్పుకొస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంలో నాయకులతోపాటు, కొందరు రౌడీషీటర్లు పావులు కదుపుతున్నారు. ఓ రౌడీషీటర్ ఆధ్వర్యంలో ఇటీవల కొన్ని నిర్మాణాలు సాగడంపై చర్చనీయాంశమైంది.

**అధికారుల 'భూ'చాట!:** ఇక్కడ విచిత్రం ఏమిటంటే కొందరు అధికారులే ప్రభుత్వ భూములు ఎలా కబ్జా చెయ్యాలో, ఆక్రమణదారులు ఏ విధంగా రక్షణ వలయంలో ఉండాలో సూచనలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆక్రమణదారులు భవన నిర్మాణం చేసేవరకు అటువైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులొస్తే హడావుడి చేసి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి చేతులు దులిపేసుకుంటున్నారు. సృష్టించిన నకిలీ పత్రాలను వాస్తవమైనవా? నకిలీవా? అని అధికారులు తీరుబడిగా తేల్చేలోగా భవనాలు పూర్తిచేస్తున్నారు. ఈ భవనాలు కొన్ని చేతులు మారగా, మరికొందరు అద్దెలకిచ్చుకుంటున్నారు.

# దస్త్రాల్లో పేదలు.. పొలాల్లో పెత్తందార్లు

బొబ్బిలి : పేదల బతుకు తెరువు కోసం గతంలో ప్రభుత్వం అందజేసిన డి.పట్టా భూములు చేతులు మారుతున్నాయి. భూముల ధరలు పెరుగుదలతో లబ్ధిదారులను మోసగించి.. కారుచౌకగా వారి నుంచి లాగేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దస్త్రాల్లో లబ్ధిదారులే ఉన్నా వందేళ్ల లీజు పేరుతో పత్రాలు సృష్టించి పెత్తందార్లు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఈ భూములు సేకరిస్తే కొనుగోలు చేసిన వారికే లబ్ధి చేకూరుతోంది.

**ఇదీ పలుచోట్ల పరిస్థితి**

బొబ్బిలి పట్టణం మల్లంపేట, గున్నతోటవలస, గొల్లపల్లి, రామన్నదొరవలస, పుల్లేరువలస, పారిశ్రామికవాడ ప్రాంతం, విజయపురి ప్రాంతాల్లోని వందల ఎకరాలు బడాబాబుల చేతుల్లో ఉన్నాయి. గతంలో ఓ నాయకుడు రామన్నదొరవలస వద్ద గిరిజనుల డి.పట్టా భూములను కొనుగోలు చేసి జగనన్న కాలనీకి విక్రయించారు. రూ.లక్షలు లాభం పొందాడు. సీబీసీఐడీ అధికారులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు నిర్వహించారు. అధికారుల అండదండలతోనే ఇదంతా సాగింది. తెర్లాం మండలంలోని లోచర్ల, ఆమిటి, వెలగవలస, ఎం.ఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల డి.పట్టా భూములను విశాఖకు చెందిన ఓ వైద్యుడు కొనుగోలు చేశారు. కొన్నాళ్లు సాగు చేశాక వివాదంలోకి వెళ్లడంతో స్థలాన్ని ఖాళీగా ఉంచారు.

భూబందరవలస రెవెన్యూలో పేదలకు ఇచ్చిన భూములను తెలంగాణకు చెందిన భూస్వామి కొనుగోలు చేసి, దర్జాగా పంటలు పండించుకుంటున్నాడు.

డొంగురువలస రెవెన్యూలో డి.పట్టాలు పేదల పేరున ఉన్నప్పటికీ భూములు మాత్రం పెత్తందార్ల చేతిలో ఉన్నాయి.

చింతాడ సమీపంలోని డి.పట్టా భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు కొనుగోలు చేశాడు. ప్లాట్లు వేయడానికి



చదును చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

రామభద్రపురం మండలం కొండకెంగువ, ఎనుబరువు, రావివలస గ్రామాల్లో డి.పట్టాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

బొబ్బిలి మండలం కొయ్యకొండవలస గిరిజనులకు చాలా ఏళ్ల కిందట ఇచ్చిన భూములను సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. ఫిర్యాదు అందడంతో గతేడాది నవంబరులో తహసీల్దారు శ్రీను, వీఆర్వోలు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించారు.

**రెవెన్యూ సిబ్బంది సహకారంతో..**

కొంతమంది పెత్తందారులు వీఆర్‌వోలను చేతిలో పెట్టుకుని గుట్టుగా బేరాలు సాగిస్తున్నారు. అన్ని కుదిరిన తర్వాత పలుకుబడితో పక్కనే ఉన్న జిరాయితీ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

**దృష్టి సారించాం..**

డి.పట్టా భూముల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జగనన్న కాలనీలోని ఖాళీ భూమిలో ఇటీవల కొందరు నీలగిరి మొక్కలు వేస్తుంటే అడ్డుకున్నాం. డి.పట్టా క్రయవిక్రయాలు చెల్లవు. వీటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం.రామ్మోహనరావు, ఆర్డీవో

# తెరముందు సైనికులు.. కథ నడిపేది ధనికులు!!

విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాటం చేసి వచ్చిన జవాన్ల సేవకు గుర్తుగా ఇచ్చిన భూములపై వైకాపా నాయకులు కన్నేశారు. మాజీ సైనికులకు ఇచ్చిన విలువైన భూములను కొట్టేయడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు వెలుగులోకి వచ్చిన ఉదంతాలే చెబుతున్నాయి. పలువురు నేతల అక్రమ వ్యూహాలకు అధికారులు కూడా సహకరించినట్లు స్పష్టమవుతోంది.

**భూములు కేటాయింపు ఎలా అంటే:** జవాన్లు పదవీ విరమణ పొందిన తర్వాత మూడేళ్లలోపు భూమి కోసం దరఖాస్తు చేసుకోవాలి. మాజీ జవాన్లు తమ మండల పరిధిలో భూమి గుర్తించి, ఆ వివరాలతో జిల్లా సైనిక బోర్డు నుంచి కలెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. సంబంధిత తహసీల్దార్ ద్వారా విచారణ చేసి.. ఎసైన్‌మెంట్ కమిటీలో పెట్టి ఆ భూమి కేటాయిస్తారు. కేటాయించిన భూమి సాగులో ఉండి పదేళ్ల తర్వాత నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందిన తర్వాత అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. సిపాయి నుంచి హవల్దార్ స్థాయి వారే భూమి కేటాయింపులకు అర్హులు. సుబేదార్ నుంచి పైస్థాయిలో పనిచేసిన ఆర్మీ అధికారులకు మన రాష్ట్రంలో ప్రభుత్వ భూములు కేటాయించరు.

**అర్హత లేకపోయినా:** ఎండాడ గ్రామం పరిధిలో 5.10 ఎకరాల భూమి జూనియర్ కమీషన్డ్ అధికారి (జేసీవో) హోదాలో పనిచేసిన మాజీ సైనిక ఉద్యోగికి కేటాయించినట్లు పత్రాలు చూపడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. నిబంధనల ప్రకారం అర్హతలేకపోయినా ఆర్మీలో జేసీవో స్థాయి అధికారికి 1971లో భూమి ఇచ్చినట్లు అధికారులు చూపించడం గమనార్హం.

నగరానికి సుదూరంలో ఉన్న అనంతపురం జిల్లాకు చెందిన బాలిరెడ్డి అనే జవానుకు విశాఖలో భూములు కేటాయించడం మరో విచిత్రం.



అయితే... గతంలో ఈ భూములను రికార్డుల్లోకి ఎక్కించి సీతారామయ్య వారసులు పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.

బాలిరెడ్డి వారసులు జోజిరెడ్డి, సాగు చేస్తున్న సీతారామయ్య వారసులు శంకర్రావు ఈ భూమి కోసం కోర్టును ఆశ్రయించారు. ఆ తరువాత పరిణామాలు చకచకా మారిపోయాయి. జోజిరెడ్డికి అప్పట్లో వైకాపాలో ఉన్న నేత అండగా నిలిచారు. అనంతరం బాలిరెడ్డికి చెందిన భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ 2024 మార్చి 14న ఉత్తర్వులు వచ్చాయి. తరువాత శంకర్రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించేలా చేసి, ఈ ఏడాది ఫిబ్రవరి 18న పూర్తిగా గుప్పిట్లోకి తీసుకున్నారు. గతంలో వైకాపాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన ఓ నాయకుడు ప్రస్తుతం కూటమిలో చేరారు. కీలక పదవిలో ఉన్న ఆ నేత ఈ మొత్తం పరిణామాల్లో చక్రం తిప్పారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ భూమి విలువ దాదాపు రూ. 250 కోట్ల వరకూ ఉంటుందని సమాచారం.


మాజీ మంత్రి కుమారుడి గుప్పిట్లోకి: కొమ్మాది వద్ద పరదేశీపాలెం పరిధిలో 1955లో ఇచ్చిన డిపట్టాలు రద్దు చేశాక మాజీ సైనికుల పేరుతో భారీ కుంభకోణానికి తెరతీశారు. కొంత కాలం క్రితం... 'నా భర్తకు ప్రభుత్వం పరదేశీపాలెం వద్ద 4.89 ఎకరాలు కేటాయించింది. ఆయన మరణించినందున భూమి విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాలి' అంటూ విశాఖ అప్పుఘర్‌కు చెందిన ఒకరి నుంచి కలెక్టర్‌కు విన్నపం అందింది. వాస్తవానికి ఆ సైనికుడి పేరుతో అక్కడ భూమి కేటాయించలేదని ఆరోపణలున్నాయి. ఈ వినతిపై అధికారులు ఆగమేఘాలపై డి.పట్టా, టైటిల్‌డీడ్, పాసుపుస్తకం ఇచ్చేశారు. ఆ భూమి విక్రయించుకునేందుకు నిరభ్యంతర పత్రం ఇచ్చేశారు. వెంటనే వైకాపాకు చెందిన మాజీ మంత్రి కుమారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. వైకాపా హయాంలో ఈ స్థలం విలువ పెరిగేలా జీవీఎంసీ నిధులతో తారు రోడ్డు నిర్మించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

శ్రీకాళహస్తి: స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్డులను ముద్రిస్తున్నారు. ఇప్పటికే కార్డుల ముద్రణ 90 శాతం మేర పూర్తి చేశారు. గత వైకాపా ప్రభుత్వం కార్డులను ఆ పార్టీ రంగులతో ముద్రించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన సాంకేతికతతో స్మార్ట్ కార్డులకు శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు తరహాలో కొత్తవి ఉంటాయి. ఎలాంటి పార్టీ గుర్తు, రంగులు లేకుండా ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం లబ్ధిదారుడి ఫొటో, చౌక దుకాణం నంబరు ఉంటాయి. వెనుకవైపు కుటుంబ సభ్యుల వివరాలు ముద్రిస్తారు.

**కొత్త కార్డులకు భారీగానే దరఖాస్తులు**

జిల్లాలో 1063 డిపోల పరిధిలో 5,37,038 మంది కార్డుదారులు ఉన్నారు. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, కొత్తకార్డుల మంజూరుకు మే 7న సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. వీటిలో



కొత్త రేషన్ కార్డులకు 3501 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2వేలకు పైగా ఆమోదం లభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. గత ప్రభుత్వం చివరి మూడేళ్లు కార్డులు మంజూరు చేయలేదు. దీంతో వేల సంఖ్యలో లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోయారు. కార్డుల్లో చనిపోయిన వారి పేర్ల తొలగింపు, పిల్లల పేర్లు చేర్పు, చిరునామా మార్పులు వంటి వాటికి ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం నుంచి రాగానే అందిస్తాం: ప్రభుత్వ నుంచి కొత్త రేషన్ కార్డులు రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. ఏటీఎం కార్డు తరహాలో ఉన్న కారణంగా లబ్ధిదారులకు వెసులుబాటు కలుగుతుంది. కొత్త కార్డులకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.మూర్తి, డీఎస్ఓ

# పేదల బియ్యం బొక్కేస్తున్నారు!



అనంతపురం : అర్బన్‌లో కొందరు సిండికేట్‌గా మారి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. స్థానిక నాయకులకు ప్రతినెలా కమీషన్లు అందిస్తున్నారు. అధికారులు సైతం అక్రమ రవాణాను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో ప్రజాప్రతినిధి అండతో స్థానిక నాయకులు రేషన్‌బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ప్రాంతాల్లో కిలో రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేసి ఒక చోటుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో రాత్రిపూట జాతీయ రహదారి మీదుగానే కర్ణాటకలోని తూముకూరుకు తరలిస్తున్నారు. తాడిపత్రి పరిధిలో ఐదుగురు స్థానిక నాయకులు ఇంటింటికీ ఆటోలను పంపించి కిలో రూ.20 చొప్పున సేకరిస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా రేషన్ డీలర్ల నుంచే నొక్కేస్తున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లిలోని రైసుమిల్లులకు తరలిస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. పేదల ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం సేకరించేందుకు ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నారు. అవకాశమున్న చోట నేరుగా చౌకదుకాణాల నుంచే బియ్యాన్ని నొక్కేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని ఒకచోటకు చేర్చి కర్ణాటకలోని మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ పాలిష్ చేసి.. పలు రకాల బ్రాండ్ల పేరుతో తిరిగి ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం నడిపేందుకు అక్రమార్కులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అన్ని ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకుని బియ్యం సేకరిస్తున్నారు. రాత్రి వేళ్లలో జాతీయ రహదారి మీదుగానే యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతుండటం గమనార్హం.

**కిలో రూ.20**

అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లో ఆటోల ద్వారా కిలో రూ.18 నుంచి రూ.20 చొప్పున రేషన్ బియ్యాన్ని సేకరిస్తుండటం గమనార్హం. ఏజెంట్లకు కిలోకు రూ.3 కమీషన్ ఇస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని నియోజకవర్గాల వారీగా రహస్య ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి సమయాల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. కడప జిల్లా పులివెందులలో ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ముదిగుబ్బ మీదుగా కర్ణాటకకు తీసుకెళ్తున్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నా అక్రమరవాణాకు అడ్డుకట్ట పట్టడం లేదు.

**స్థానిక మిల్లుల్లోనూ..**

ప్రస్తుతం కర్ణాటకలోనూ రేషన్ బియ్యం పంపిణీ చేపట్టడంతో కొంతమేర డిమాండ్ తగ్గింది. ఇటీవల కాలంలో స్థానిక రైసు మిల్లులకే విక్రయిస్తున్నారు. యాడికిలోని మిల్లులో వందల టన్నుల బియ్యం దొరకడమే ఇందుకు నిదర్శనం. రూ.20 చొప్పున సేకరించి రూ.25కు అమ్ముతున్నారు. పాలిష్ చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయనే ఉద్దేశంతో కొందరు మిల్లుల యజమానులు సైతం అక్రమార్కులకు వంత పాడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో ఇలా..విజిలెన్స్ కేసులు: 51

పట్టుబడిన రేషన్ బియ్యం: 1,926 క్వింటాళ్లు

# అవయవదాతలు.. అభయ ప్రదాతలే



అనంతపురం : అమ్మ జన్మనిస్తే.. అవయవదానం ద్వారా పునర్జన్మను ఇవ్వొచ్చు. మరణించినా మరొకరిలో జీవించే వరం అవయవదానంతోనే సిద్ధిస్తుంది. ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయదాన దినోత్సవంగా జరుపుకొంటాం. ఇప్పుడిప్పుడు అవగాహన పెంచుకుంటున్న కొందరు అవయవదానానికి ముందుకొస్తుండటం అభినందనీయం

బుక్కరాయసముద్రంకు చెందిన జగదీశ్ 2023లో రోడ్డు ప్రమాదంలో జీవన్మృతుడయ్యాడు. గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులను తొలగించి గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. అతని అవయవాలను నలుగురికి అమర్చి వారి జీవితాల్లో వెలుగునింపారు.

అనంతపురం సాయినగర్ వాసి నర్మదమ్మ ఇటీవల ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె కళ్లను ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు.

**70 మంది వీలునామా**

18ఏళ్లు నిండి ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ అవయవదానం చేయవచ్చు. మరణానంతరం మృతదేహాన్ని తీసుకోవచ్చనే వీలునామా రాసి ఇవ్వాలి. కుటుంబసభ్యుల అంగీకారం తప్పనిసరి. ఉమ్మడి అనంత జిల్లాలో ఇప్పటివరకు 70 మంది దేహదానానికి వీలునామా రాశారు.


శరీరదానానికి వీలునామా రాసిన వ్యక్తి మృతి చెందిన వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని మెడికల్ కళాశాలకు, సేవా సంఘం సభ్యులకు గానీ సమాచారం అందించాలి. 6 గంటల్లోపే అయితే కళ్లను ఇతరులకు అందజేయడానికి అవకాశం ఉంటుంది.

పరిగి మండలం కొడిగినహళ్లి పంచాయతీ సుబ్బరాయనపల్లికి చెందిన శ్రీనాథ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కొంతకాలం క్రితం ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. స్థానిక దేహదాతల సంఘం ప్రతినిధులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో దేహదానానికి అంగీకరించారు.

**3వేల అంగీకారపత్రాలు..**

– డా. పరదేశీనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అనంతపురం వివిధ కళాశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో 40కిపైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. 3వేల మందికిపైగా అవయవ దానానికి అంగీకారం తెలిపిన పత్రాలను ఏపీ జీవన్‌దాన్ ట్రస్టుకు అందజేశాం.

# ఉన్నత చదువులకు అండగా విద్యాలక్ష్మి



శ్రీకాళహస్తి:పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్య చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ఆర్థిక, ఉన్నత విద్య, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు, ఇండియన్ బ్యాంకు అసోసియేషన్ (ఏబీఏ) సంయుక్తంగా విద్యాలక్ష్మి పోర్టల్ రూపొందించాయి. దీనిలో 38 బ్యాంకులు నమోదయ్యాయి. 86 రకాల విద్యారుణాలు అందిస్తూ విద్యార్థుల కలలు సాకారం చేస్తున్నాయి.

ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించని వారికి ఈ పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి వారి ఉన్నత విద్యను పూర్తి చేయడానికి బ్యాంకులు సమాయత్తం అవుతున్నాయి. ఇంజినీరింగ్, వైద్యం, ఛార్టెడ్ అకౌంటెంట్, మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎం.ఎస్., ఐఐటీ, వృత్తి విద్యా, విమానయాన కోర్సులు, యూజీసీ, ఏఐసీటీఈ, ఎంసీఐ, ఇతర ప్రభుత్వ అధీకృత సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వారికి రుణాలు ఇస్తారు. జిల్లావ్యాప్తంగా 126 బ్యాంకులు ఉన్నాయి. పాయకరావుపేట, నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, పెందుర్తి తదితర ప్రాంతాల్లో బ్యాంకర్లు ఈ పథకం కింద విద్యార్థులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేయడానికి ముందుకు వస్తున్నారు.

**నిబంధనలు ఇలా...**

పీఎం విద్యాలక్ష్మి ద్వారా మొత్తం 86 రకాల విద్యారుణాలు మంజూరు చేస్తున్నారు. దేశంలో పేరున్న 860 విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన వారికి ఎలాంటి సెక్యూరిటీ, గ్యారంటీలు లేకుండా రుణాలు అందిస్తారు. యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు అందించే కోర్సులకు సైతం కొన్ని షరతులపై రుణాలు ఇస్తారు. విదేశాల్లో చదువుకునే వారు మాత్రం తప్పనిసరిగా సెక్యూరిటీ చూపించాలి.

విద్యాలక్ష్మి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో తక్కువ వడ్డీతో రుణం మంజూరు చేస్తారు. చదువుకు అయ్యే ఖర్చులతోపాటు ట్యూషన్ ఫీజు, వసతి, రవాణా ఖర్చులను కలిపి రుణం పొందే అవకాశం ఉంటుంది. ఎలాంటి ప్రాసెసింగ్ ఛార్జీలు వసూలు చేయరు.

రుణం పొందడానికి దరఖాస్తు ఇలా..మూడు పద్ధతుల్లో విద్యా రుణానికి దరఖాస్తు చేసుకోవచ్చు. %www.vidyalakshmi.co.in% వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం సీఈఎల్ఏఎఫ్ దరఖాస్తు పూర్తి చేయాలి. దీంతో పాటు ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. అర్హులైన విద్యార్థులకు మూడు విభాగాల్లో రుణాలు అందిస్తారు. మొదటి విభాగంలో రూ. 4 లక్షలలోపు, రెండో విభాగంలో రూ. 5 లక్షలు, మూడో విభాగంలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ రుణాన్ని మంజూరు చేస్తారు.

# నమ్మిన బంట్లు.. నకిలీల 'సృష్టి!

పాయకరావుపేట : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం'లో జరిగిన నకిలీ సరోగసీ, పిల్లల అక్రమ రవాణా కేసులో కీలక పరిణామాలు విశాఖ కేంద్రంగా సాగాయి. హైదరాబాద్‌లో కౌన్సెలింగ్, ఇతర ప్రక్రియలు పూర్తి చేస్తే, డెలివరీలు, పిల్లల సంరక్షణ, అప్పగింత వంటి పరిణామాలన్నీ విశాఖలోనే జరిగినట్టు పోలీసు వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ కేసును మరింత లోతుగా విచారించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. **ప్రత్యేక వైద్య బృందం:** ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రత విశాఖలో లేనప్పటికీ తనకంటూ ఓ వైద్య బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మొత్తం అరెస్టయిన వారిలో విశాఖకు చెందిన ఏడుగురు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వారిలో ప్రసూతి వైద్యురాలు డాక్టర్ పి.ఉషాదేవి ప్రసవాలను, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఏ.విద్యుల్లత పుట్టిన పిల్లల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించేవారు. డాక్టర్ వాసుపల్లి రవి మత్తు వైద్య సేవలు అందించేవారు. నగరంలోని సృష్టి కేంద్రం మేనేజర్‌గా సీహెచ్.కల్యాణి, జూనియర్ ఎంబ్రాలజిస్టుగా బి.రమ్య సేవలు అందించారు. సబ్ ఏజెంట్లుగా కొనసాగిన కె.రత్నం, కె.మీనాక్షి ఉన్నారు.

**మరికొందరిపై అనుమానాలు**

ఈ కేసులో మరికొందరి పాత్రపై అనుమానాలు ఉన్నాయని పోలీసు




వర్గాలు చెబుతున్నాయి. సిట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో లోతైన విచారణ జరిగితే.. మరికొందరు అరెస్టు అవుతారు. విశాఖకు చెందిన కొందరు వైద్యులు, మధ్యవర్తుల పాత్రపై పోలీసులు అనుమానిస్తున్నారు.

**'ఏ–1'పై క్రిమినల్ కేసులు..**

'ఏ–1'గా ఉన్న డాక్టర్ నమ్రతపై 2020లో మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వాటిల్లో మూడు 'చైల్డ్ ట్రాఫికింగ్' కేసులే. 2010లో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. 2018 నుంచి సృష్టి సంతాన సాఫల్యం కేంద్రం విశాఖలో సేవలు అందిస్తోంది. అయిదేళ్ల పాటు జడ్పీ రోడ్డులోని ఓ భవనంలో కొనసాగింది. ఆ తర్వాత పక్కనే ఉన్న మరో భవనంలోకి కేంద్రాన్ని మార్చి, ప్రచార బోర్డు మాత్రం ఏర్పాటు చేయలేదు. పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా... జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ కేంద్రం వైపు దృష్టి సారించలేదు. ఏటా ప్రైవేటు ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలను తనిఖీ చేసి లైసెన్స్‌లు తనిఖీ చేయాల్సిన జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతోనే అక్రమాలు కొనసాగాయి.

# పొలం పనులు.. పాము కాట్లు

పాయకరావుపేట : వారం రోజుల క్రితం సీతారాంపురానికి చెందిన పి.గోవింద్ గడ్డివాము నుంచి గడ్డి తీస్తుండగా కట్లపాము కాటేసింది. హుటాహుటిన తుని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడకు తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. నక్కపల్లి మండలం జానకయ్యపేటకు చెందిన జి.అప్పలరాజును చేనులోనే పాము కాటేసింది. నక్కపల్లి మండలంలోని మనబాలవానిపాలెంకు చెందిన రెండేళ్ల బాలుడు పాము కాటు బారిన పడ్డారు.

ఖరీఫ్ పనుల ఆరంభమైందంటే పాము కాట్ల బారిన పడే రైతులు, కూలీల సంఖ్య పెరుగుతుంది. రాత్రింబవళ్లు పొలాల్లో పని చేసే వీరికి పాము కాటు ప్రాణాంతకంగా మారుతోంది. దేశంలో 240 జాతుల పాములుంటే వాటిలో 10 జాతులకు చెందిన 52 రకాల పాములు మాత్రం విషపూరితమైనవి. గడ్డివాములు, పంట పొలాలు, చెరువులు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురుగా ఉండే పచ్చికలు, చల్లటి



ప్రదేశాల్లో ఎక్కువగా సంచరిస్తాయి. వర్షాకాలంలో సర్పాలు గుడ్లను పొదుగుతాయి. ఈ సమయంలో కోపంతోనూ, చిరాకుగానూ ఉంటాయి. అందుకే ఖరీఫ్ పొలం పనుల సమయంలో ఎక్కువగా పాముకాటు బాధితులు ఉంటారు. తాచు, కట్ల, నాగు పాములు కాటు ప్రాణాంతకంగా గుర్తించాలి. సర్పాలకు చెవులుండవు, భూమిపై ఏర్పడే ప్రకంపనల ద్వారానే గుర్తిస్తాయి. అతి స్వల్పమైన వేడిని సైతం గుర్తిస్తాయి. వేడి రక్తం ప్రవహించే మనిషి, జంతువులను తేలిగ్గా పసిగడతాయి.

**పాము కనిపిస్తే..**రాత్రివేళ పొలాలకు వెళ్లే వారు, గడ్డివాముల వద్ద, రాళ్లగుట్టల పరిసరాల్లో తిరిగేవారు టార్చిలైటు దగ్గర ఉంచుకోవాలి. పశువుల పాకలు, ఇంటి పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పాము ఎదురైతే తప్పించుకునేందుకు ప్రయత్నించాలి. ధైర్యమే అసలైన మందు: పాము కాటుకు గురైతే ధైర్యంగా ఉండాలి. కరిచిన భాగాన్ని కదిలించకూడదు. సకాలంలో ఆసుపత్రికి తీసుకువస్తే యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించవచ్చు. కాటువేసిన భాగానికి కొద్దిగా పైన వస్త్రంతో లేదా తాడుతో కట్టాలి. ప్రతి 15 నిమిషాలకోసారి దాన్ని వదులు చేసి మళ్లీ బిగించాలి. నాటువైద్యం జోలికి వెళ్లవద్దు. వీలైనంత తక్కువ సమయంలో ఆసుపత్రికి తరలించాలి. ఆందోళనకు గురి కాకూడదు. డి.సుభాష్, వైద్యులు, పాయకరావుపేట పీహెచ్‌సీ

## చైనా వాల్ దాటిన 'మిరాయ్' పాప

చూస్తుండగానే చైనా వాల్ దాటేయబోతోంది ఈ కొత్తమ్మాయ్. మిరాయ్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా దేశాలన్నీ చుట్టేయబోతోంది. ముంబైలో ఒక్క ఛాన్స్ అంటూ అవకాశాల కోసం వెతికిన ఈ మోడల్ కం నటి, ఉన్నట్టుండి తేజ సజ్జా సినిమాతో వరల్డ్ ఫేమస్ కాబోతోంది. కొత్తమ్మాయ్ అయినా కానీ తనవైన వన్నె చిన్నెలు, గ్లామరస్ లుక్ తో మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం ఏ నోట విన్నా ఈ అమ్మడి లక్ గురించే గుసగుస. పేరు రితిక నాయక్. ఢిల్లీలోని ఒడియా కుటుంబంలో జన్మించిన ఈ ప్రతిభావని టాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటోంది. 2019లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ యొక్క 12వ సీజన్‌ను గెలుచుకున్న తర్వాత వినోద పరిశ్రమలో బిగ్ డ్రీమ్స్ ని నెరవేర్చుకోవడానికి ప్రయాణం ప్రారంభించింది. కాలేజ్ డేస్ నుంచే నటన అంటే ఈ భామకు ఆసక్తి. ఆరంభం అశోక వనంలో అర్జున కళ్యాణం (2022)తో తెరంగేట్రం చేసింది. ఈ చిత్రంలో వసుధగా తనదైన అద్భుత నటనతో యువతరాన్ని ఆకట్టుకుంది. విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన



ఈ చిత్రానికి విద్యాసాగర్ చింత దర్శకత్వం వహించారు. ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాలో రితిక నటనకు ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత రవితేజ ఈగిల్ లో కీలక పాత్ర పోషించినా పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఇప్పుడు మిరాయ్ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా పాపులరైపోతోంది. హనుమాన్ చిత్రంతో తేజ సజ్జా పాన్ ఇండియా స్టార్ గా గుర్తింపు తెచ్చుకోవడంతో ఇప్పుడు ఇది ఈ భామకు కూడా కలిసొస్తోంది. మిరాయ్ కథ, విజువలైజేషన్ పాన్ ఇండియా అప్పీల్ తో అలరించడంతో మార్కెట్లో ఈ మూవీపై బోలెడంత బజ్ పెరిగింది. ఇక ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొడితే, తేజ సజ్జాతో పాటు రితిక నాయక్ దశ తిరిగిపోతుందని కూడా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి కొత్తమ్మాయే అయినా, సినిమా రిలీజ్ తర్వాత అమాంతం తన రేంజ్ మారిపోతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక రితిక ఇప్పటికే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సినిమాలోను అవకాశం అందుకుంది. ఈ ఏడాది మార్చిలో ఈ సినిమా ప్రారంభమైంది. చూస్తుండగానే మిరాయ్ పాప చైనా వాల్ దాటేస్తోంది.. దేవీశ్రీ పాడిన పాటలోని ఒక అద్భుతమైన సింగిల్ లైనర్ వర్ణనలా ఇండస్ట్రీలో దూసుకుపోతోంది.

## జిమ్‌లో దివి వర్కౌట్

తెలుగు బిగ్ బాస్ సీజన్ 4తో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ దివి. ఈ అమ్మడు అంతకు ముందు సినిమాల్లో నటించినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. కానీ లక్కీగా బిగ్ బాస్ లో ఛాన్స్ దక్కించుకుని ఒక్కసారిగా కెరీర్ టర్న్ అయింది. బిగ్‌బాస్ లో ఫైనల్ వరకు లేకున్నా కూడా దివికి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. బిగ్ బాస్ వల్ల సినిమాలు, సిరీస్‌లు దక్కించుకుంది. హీరోయిన్‌గా ఒకటి రెండు సినిమాలు చేసినా ఆశించిన స్థాయిలో గుర్తింపు తెచ్చుకోలేక పోయింది. కానీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. అంతే కాకుండా హీరోయిన్స్ రేంజ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం



ద్వారా మిలియన్‌కి పైగా ఫాలోవర్స్‌ను దక్కించుకుంది.

**తెలుగు బిగ్ బాస్‌తో గుర్తింపు...** 2020లో హైదరాబాద్ టైమ్స్ లో మోస్ట్ డిజైరబుల్ వుమెన్‌గా నిలిచిన ఈ అమ్మడు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. తక్కువ సమయంలోనే పలు సినిమాల్లో చేసినా కూడా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హీరోయిన్‌గా సినిమాలు చేయాలి అని కలలు కన్న దివికి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ఆ సమయంలో వచ్చిన బిగ్‌బాస్ ఆఫర్ ఆమెకు మంచి బూస్ట్ ఇచ్చింది. తెలుగు బిగ్ బాస్‌లో పాల్గొన్న వారిలో అతి కొద్ది మందికి మాత్రమే మంచి గుర్తింపు వచ్చింది. అందులో దివి ఒకరు అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా బిగ్ బాస్ చేసిన తర్వాత ఆఫర్లు వచ్చాయి. అంతే కాకుండా సోషల్ మీడియాలో లక్షల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. అందుకే ఈ అమ్మడికి బిగ్‌బాస్ ఖచ్చితంగా లైఫ్ ని ఇచ్చిందని, కెరీర్‌ను నిలబెట్టిందని అంటారు.

**దివి అందాల ఫోటో షూట్స్...** ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మిలియన్‌కు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ముద్దుగుమ్మ దివి తాజాగా మరోసారి అందమైన ఫోటోలను షేర్ చేసింది. జిమ్‌లో ఈ అమ్మడు వర్కౌట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. టైట్ డ్రెస్‌లో దివి ఆకట్టుకుంటుంది. తన అందంతో ఎంతో మందిని కట్టి పడేసిన దివి ఎప్పటిలాగే ఈ వర్కౌట్ వీడియోలు, ఫోటోలతో వైరల్ అవుతోంది. తన అందమైన ఫోటోలు, వీడియోలతో ఈ అమ్మడు మెప్పించింది. అందాల దివి సోషల్ మీడియాలో ఆకట్టుకుంటూ ఉంది. టైట్ జెగ్గిన్ లో స్పోర్ట్స్ బ్రా ధరించి కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడు వర్కౌట్ ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి.




## సంక్రాంతి రేసు.. ట్విస్ట్ మీద ట్విస్ట్



తెలుగు సినిమాల వరకు అత్యంత డిమాండ్ ఉండే సీజన్ అంటే సంక్రాంతినే. చాలా ముందుగానే ఆ సీజన్‌కు బెర్తులు బుక్ అవుతుంటాయి. కానీ కర్చీఫ్ వేసిన వాళ్లందరూ కచ్చితంగా ఆ సీజన్లో వస్తారని గ్యారెంటీ ఏమీ ఉండదు. ఆర్నెల్ల ముందు మొదలయ్యే రేసులో చివరికి మూణ్నాలుగు సినిమాలు నిలుస్తుంటాయి.

మధ్యలో మార్పులు చేర్పులు జరుగుతూ ఉంటాయి. ఐతే 2026 సంక్రాంతి సీజన్‌కు సంబంధించి ఆల్రెడీ బెర్తులు కన్ఫమ్ అయిపోయాయని.. ఇక మార్పులేమీ ఉండవని అంతా ఒక అంచనాకు వచ్చేశారు. మెగాస్టార్ చిరంజీవి-అనిల్ రావిపూడిల 'మన శంకర వరప్రసాద్', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమాలు చాలా ముందే సంక్రాంతి రిలీజ్ ఫిక్స్ చేసుకుని.. ఆ దిశగా సినిమాలను రెడీ చేసే పనిలో ఉన్నాయి. ఇటీవలే 'రాజా సాబ్' కూడా సంక్రాతికే అని ఖరారైంది. మరోవైపు తమిళ అనువాదం 'జనగాయగన్' కూడా రేసులో ఉంటుందన్నది స్పష్టం. ఇంతకుమించి సినిమాలు వచ్చినా థియేటర్లను సర్దుబాటు చేయడం కష్టం. కాబట్టి అంతటితో పోటీ ముగిసిందని అంతా అనుకున్నారు.కానీ ఇప్పుడు కొత్తగా సినిమాలు పోటీలోకి వస్తుండడం ఆశ్చర్యం కలిగించే విషయం. మాస్ రాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల రూపొందిస్తున్న సినిమాను ఇంతకుముందు సంక్రాంతికే తీసుకురానున్నట్లు ప్రకటించారు. కానీ షూటింగ్ మొదలయ్యాక దీని గురించి ఏ అప్‌డేట్ లేదు. కొన్ని నెలల పాటు చిత్ర బృందం సైలెంట్‌గా ఉండడంతో ఇది సంక్రాంతికి రాదనే అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ సినిమా పండక్కి పక్కా అంటున్నారు. సంక్రాంతికి సినిమాను థియేటర్లలో రిలీజ్ చేసేలా ఓటీటీ డీల్ కూడా పూర్తయిందట.

కాబట్టి మాస్ రాజా కూడా సంక్రాంతి పోటీలో ఉండడం గ్యారెంటీ అంటున్నారు. మరోవైపు శర్వానంద్ హీరోగా 'సామజవరగమన' దర్శకుడు భాను భోగవరపు తీస్తున్న 'నారి నారి నడుమ మురారి' సినిమా సైతం పండుగ పోటీలో ఉన్నట్లు ఆ చిత్ర బృందం మీడియాకు లీకులు వదిలింది. త్వరలోనే వాళ్లు కూడా రిలీజ్ డేట్ పోస్టర్ రిలీజ్ చేయనున్నారట. మరి ఇన్ని సినిమాలకు సంక్రాంతి సీజన్లో చోటు ఎక్కడ ఉందన్నది ప్రశ్న. బహుశా ఆల్రెడీ పోటీలో ఉన్న వాటిలో ఏదైనా తప్పుకుంటే తమ సినిమాను దించుదామని ఒక ప్రయత్నం చేస్తుండొచ్చు. కానీ ప్రభాస్, చిరు సినిమాలు ఉండగా తెలుగు నుంచి ఇంకొక్క సినిమాకు మించి థియేటర్లు సర్దుబాటు చేయడం కష్టమవుతుంది. కలెక్షన్ల పరంగా చూసినా కూడా మూడుకు మించి పోటీ ఉంటే ఇబ్బంది తప్పదు.

## నిధి అగర్వాల్.. రాజాసాబ్ 'సర్ప్రైజ్' చూశారా?




టాలీవుడ్ లో టాలెంటెడ్, ప్రామిసింగ్ హీరోయిన్స్ లిస్టులో అందాల భామ నిధి అగర్వాల్ కచ్చితంగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సవ్యసాచి మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన అమ్మడు.. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. రీసెంట్ గా హరిహర వీరమల్లు మూవీతో సందడి చేసింది నిధి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన వీరమల్లు కోసం ఐదేళ్లపాటు డేట్స్ కేటాయించింది. కానీ అనుకున్న స్థాయిలో రిజల్ట్ అందుకోని నిధి అగర్వాల్.. ఇప్పుడు రాజా సాబ్ పైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ మారుతి కాంబోలో హారర్ కామెడీ డ్రామాగా ఆ మూవీ రెడీ అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న రాజా సాబ్ లో ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్నారు. నిధి అగర్వాల్ తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహనన్ సందడి చేయనున్నారు. ఆ ముగ్గురూ రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ లో సందడి చేశారు. అందులో నిధి చాలా అందంగా కనిపించారు. ఇప్పుడు మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రాజా సాబ్ టీమ్ అందమైన, ప్రతిభావంతులైన నిధి ప్రత్యేక రోజు జరుపుకుంటుందని తెలిపారు. ఆమె పాత్ర కథకు తగ్గ విధంగా క్రియేట్ చేశామని చెప్పారు. హ్యాపీ బర్త్ డే నిధి అంటూ రాసుకొచ్చారు. అయితే పోస్టర్ లో నిధి అగర్వాల్ చాలా కూల్ గా కనిపించారు. వైట్ కలర్ ఔట్ ఫిట్ లో ఉన్న ఆమె.. క్యాండిల్స్ దగ్గర నిల్చుని ప్రేయర్ చేస్తున్నారు. నవ్వుతూ.. ఏదో చూస్తూ.. హ్యాపీ మూడ్ లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిధి అగర్వాల్ కొత్త పోస్టర్ ఫుల్ వైరల్ గా మారింది. నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పోస్టర్ అదిరిపోయిందని నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. సినిమాలో ఆమె రోల్ కు సరైన ప్రాధాన్యత ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు. మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి.. ఆమెకు ఖాతాలో సరైన విజయం పడాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చెబుతున్నారు.

## చెట్టు కింద చదువు నేర్పిన శ్రీ లీల!

శ్రీ లీల.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. కన్నడ బ్యూటీ అయినప్పటికీ తెలుగులో సత్తా చాటుతూ దూసుకుపోతోంది. 'పెళ్లి సందD' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె.. రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' సినిమాతో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ అందుకుంది.. ఆ తర్వాత పలు చిత్రాలలో నటించిన ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. మధ్యలో భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి చిత్రాలు చేసి.. మోస్తారుగా విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగులో రవితేజతో మరొకసారి మాస్ జాతర అనే సినిమాలో చేస్తున్న ఈమె.. ఇటు పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 7న ఆమె సినిమా షూటింగ్లో కూడా భాగమయ్యారు. ఈ విషయాన్ని రాసి ఖన్నా తన




సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే మరోవైపు బాలీవుడ్ లో కార్తీక ఆర్యన్ తో ఒక సినిమా చేస్తున్న ఈమె.. అక్కడే మరో ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలా తెలుగు, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ బిజీగా మారిన ఈమెకు సంబంధించిన ఒక విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. శ్రీ లీల స్వతహాగా డాక్టర్ అనే విషయం అందరికీ తెలిసిందే. ఒకవైపు నటిస్తూ మరొకవైపు ఎంబిబిఎస్ కూడా పూర్తి చేసింది. అంతేకాదు ఇద్దరు పిల్లలను దత్తత తీసుకొని తన మంచి మనసు చాటుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. అలాంటి ఈమె టీచర్ కూడా అని తెలిసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే అది ఇప్పుడు కాదు అని.. విద్యార్థి దశలో ఉన్నప్పుడే చిన్నపిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పిందని సమాచారం. ఇదే విషయంపై ఆమె మాట్లాడుతూ.." నేను చిన్నప్పుడు బెంగళూరులో ఉండేదాన్ని. కానీ వేసవి సెలవులు వస్తే మాత్రం నా స్వస్థలమైన ఒంగోలుకు వెళ్లేదాన్ని. అక్కడ చిన్నప్పుడు మా తాత నాగేశ్వరరావు నిడమానూరి ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకం ఇచ్చేవారు. అయితే పుస్తకంలో ఉన్న ఇంగ్లీష్ నేర్చుకొని చెట్టు కింద పిల్లల్ని పోగేసుకొని వాళ్లకు ఇంగ్లీష్ పాఠాలు చెబుతూ వారికి చదువు చెప్పాను. అలా నాకు చిన్నప్పుడే ఇంగ్లీష్ పై మంచి పట్టు ఏర్పడింది. ముఖ్యంగా ఈ పట్టు రావడానికి కారణం మా తాత ఇచ్చిన ప్రోత్సాహమే. అది ఎప్పటికీ మరువలేనిది" అంటూ శ్రీ లీల తెలిపింది అలాగే తన గ్రాండ్ పేరెంట్స్ తో తనకు ఉన్న అనుభవాలను పంచుకుంటూ.." జీవితం చాలా చిన్నది. అందుకే ప్రతి ఒక్కరు గ్రాండ్ పేరెంట్స్ తోనే గడపాలి అప్పుడే జీవితంపై ఒక స్పష్టత వస్తుంది. ఇప్పటికీ నాకు ఏదైనా సలహా కావాలి అంటే ముందుగా మా తాతయ్యను అడుగుతాను. మా అమ్మ తర్వాత నాకు తాతయ్య అంటే చాలా ఇష్టం. ఆయన సలహా లేకుండా ఏదీ కూడా ముందడుగు వేయలేను" అంటూ క్లారిటీ ఇచ్చింది శ్రీలీల. మొత్తానికైతే తన గ్రాండ్ పేరెంట్స్ తో తనకు ఉన్న అనుభవాలను తాజాగా అభిమానులతో పంచుకుంది ఈ ముద్దుగుమ్మ.

## హలగలి గ్లింప్స్.. ఇదేదో బాగుందే..!

కన్నడలో తన నటనతో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తూ వస్తున్నాడు ధనుంజయ్. పుష్ప సినిమాలో జాలి రెడ్డి రోల్ లో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చాడు ధనుంజయ్. అఫ్కోర్స్ అది కాస్త నెగిటివ్ టచ్ ఉన్న రోల్ అయినా కూడా తన పాత్రలో అదరగొట్టాడు. ఐతే ఇప్పుడు అతను సోలో హీరోగా ఒక క్రేజీ అటెంప్ట్ చేస్తున్నాడు. అదే హలగలి. సుఖేష్ నాయక్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను కళ్యాణ్ చక్రవర్తి దూళిపాళ్ల నిర్మిస్తున్నారు. హలగలి ఫస్ట్ గ్లింప్స్ తోనే సినిమా గ్రాండియర్ అప్పీల్ అనిపించింది.

**బిఫోర్ ఇండిపెండన్స్ కథతో హలగలి..** హలగలి బిఫోర్ ఇండిపెండన్స్ కథతో పీరియాడికల్ మూవీగా వస్తుంది. హలగలి అనే ఊరు మీద దండయాత్రకు వచ్చిన బ్రిటీషర్లకు అక్కడ నాయకుడు ఎలా బదులు చెప్పాడు అన్న కథతో ఈ సినిమా వస్తుంది. ముఖ్యంగా సినిమాలో యాక్షన్ బ్లాక్స్, పీరియాడికల్ అప్పీల్ అదిరిపోయాయి. ఇక ధనుంజయ్




కూడా తన రోల్ లో అదరగొట్టేలా ఉన్నాడు. తన శూలంతో బ్రిటీష్ జెండాను కూలగొట్టే షాట్ అదిరిపోయింది. పీరియాడికల్ స్టోరీ అది కూడా ఇండిపెండన్స్ ముందు కథ తో హలగలి వస్తుంది. ఈ సినిమా నుంచి వచ్చిన ఈ ఫస్ట్ లుక్ గ్లింప్స్ అయితే అంచనాలు పెంచింది. ఈమధ్య కాలంలో ఒక సినిమా అది ఏ భాష నుంచి వచ్చినా కూడా కథ, కథనం నచ్చేలా ఉంటే దాన్ని సూపర్ హిట్ చేస్తున్నారు. హలగలి కూడా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా గ్లింప్స్ తోనే గట్టి మ్యాటర్ ఉన్నట్టే అనిపిస్తుంది.

**అంచనాలను పెంచిన ఫస్ట్ గ్లింప్స్...** హలగలితో ధనుంజయ్ ఒక గొప్ప ప్రయత్నమే చేస్తున్నారనిపిస్తుంది. సినిమా గ్లింప్స్ అయితే అంచనాలను పెంచింది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ కూడా దానికి యాడ్ అయ్యాయి. సో హలగలి హంగామా ఇంప్రెస్ చేసేలానే ఉంది. సినిమా నుంచి మరిన్ని అప్డేట్స్ వస్తేనే కానీ ఇంకాస్త డెప్త్ ఏంటన్నది తెలుస్తుంది. పుష్ప తర్వాత తెలుగులో ఛాన్స్ లు వచ్చినా తను కోరే లీడ్ రోల్స్ కాదని లైట్ తీసుకున్నాడు ధనుంజయ్. అందుకే ఇప్పుడు ఈ హలగలి సినిమాతో తన మాస్ స్టామినా చూపించనునాడు. హగలై సినిమా కన్నడ నుంచి రాబోతున్న మరో భారీ సినిమా అవుతుంది. కె.జి.ఎఫ్ నుంచి కన్నడలో భారీ సినిమాల నిర్మాణం జరుగుతుంది. అదే దారిలో హలగలి వస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536